ప్రపంచానిక ఆఖరు ఘడియలు
రూ॥140/- పేజీలు:154

నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ (నాగోల్), హైదరాబాద్-68. ఫోన్: 040-29884453/54
E-mail: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
బ్యాంక్ స్ట్రీట్(ఆబిడ్స్),హిమాయత్‌నగర్, బండ్లగూడ(నాగోల్)- హైదరాబాద్ హన్మకొండ.

www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★

సంపుటి 09, సంచిక: 263 | శనివారం | 22-08-2026 | కరీంనగర్ | Published from: **Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar** | పేజీలు: 12+8 | వెల రూ. 5.00

### అర్హులైన ప్రతి పేద కుటుంబానికీ ఇందిరమ్మ ఇల్లు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

### పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా

ఆందోళన చేస్తున్న విద్యార్థులతో మంత్రి వివేక్ ముఖాముఖి

03

### బకాయి మిల్లర్లపై ఉక్కుపాదం



సివిల్ సప్లయిస్‌లోకి గ్రేహౌండ్స్, ఆక్టోపస్ కమాండోలు

28 మందితో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్.. రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు : ఎం.స్టీఫెన్ రవీంద్ర

03

## సిఎం రేవంత్‌రెడ్డి యుఎస్ పర్యటనకు
# అనుమతి నిరాకరణ



ఆక్స్‌ఫర్డ్ వర్సిటీని సందర్శించిన సిఎం

- నిర్దిష్ట నిబంధనలు పాటించలే : రణధీర్ జైస్వాల్
- రాజకీయ కారణాలతో అనుమతి నిరాకరించడం పట్ల ముఖ్యమంత్రి విస్మయం

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచంలోనే అత్యంత పురాతన, ప్రతిష్టాత్మక విశ్వవిద్యాలయాల్లో ఒకటైన ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీని తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సందర్శించారు. దాదాపు 900 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ విశ్వవిద్యాలయంలో సిఎం ప్రతినిధి బృందంతో కలిసి పర్యటించారు. ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ పరిధిలోని బ్లావాట్నిక్ స్కూల్ ఆఫ్ గవర్నమెంట్‌ను కూడా ముఖ్యమంత్రి సందర్శించారు. ఆక్స్‌ఫర్డ్ అనుబంధ విద్యాసంస్థలలోని నూతన సంస్థల్లో ఇది ఒకటి. ఈ సందర్భంగా ప్రొఫెసర్ మాయా ట్యూడర్, ప్రొఫెసర్ ఫైసల్ దేవ్జీ తెలంగాణ ప్రతినిధి బృందాన్ని క్యాంపస్‌లో కలిశారు. సమావేశంలో ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో పాటు ఇతర అధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణకు సంబం ధించిన పలు అంశాలు, పాలన, విద్య, ప్రజా విధానాలపై చర్చించారు. కేంద్ర విదేశాంగ మంత్రిత్వ శాఖ అనుమతి నిరాకరించిన నేపథ్యంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ రైజింగ్ ప్రతినిధి బృందం అమెరికా పర్యటన రద్దయింది. ముఖ్యమంత్రి నేతృత్వం లోని ప్రతినిధి బృందం ఇంగ్లాండ్, అమెరికా దేశాల పర్యటనకు వెళ్లాల్సి ఉండగా, రాజకీయ కోణంలో అనుమతి నిరాకరించబడిందని కేంద్రం తెలియజేసిన నేపథ్యంలో సిఎం రేవంత్ రెడ్డి అమెరికా పర్యటనను రద్దు చేసుకున్నారు. విధివిధానాలు, ప్రోటోకాల్ ప్రకారం సిఎం ఇంగ్లాండ్ అమెరికా పర్యటనకు రాష్ట్రం కేంద్ర అనుమతి కోరింది. తొలుత ఇంగ్లాండ్ పర్యటనకు మాత్రమే అనుమతి లభించింది. అధికారిక ప్రతినిధి బృందం ఇంగ్లాండ్‌కు చేరుకున్న తర్వాత అమెరికా

తరువాయి 8లో

## రాహుల్‌గాంధీ
# మెరుపుధర్నా

- పెల్లెట్ గన్ బాధిత యువకుడి ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా న్యాయానికి భయపడుతున్నారని విమర్శ
- పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్ వద్ద ఉద్రిక్తత





యువకుడు పెల్లెట్ గాయాలకు గురైన ఘటనపై ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ఆరు గంటల పాటు ధర్నా నిర్వహించగా ఎట్టకేలకు ఢిల్లీ పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. బాధితుడు సాహిల్ లోచబ్ తల్లి నుండి మాకు ఫిర్యాదు అందిందని, ఘటనపై ఎఫ్ఐఆర్ నమోదు చేస్తామని వర్గాలు పేర్కొన్నాయి.

**న్యూఢిల్లీ :** ఢిల్లీలో 'కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి)' ఆధ్వర్యంలో జులై 20న విద్యార్థులు, యువత చేపట్టిన 'పార్లమెంట్ మార్చ్' సందర్భంగా పోలీసులు పెల్లెట్ గన్‌లతో కాల్పులు జరపడాన్ని లోక్‌సభలో ప్రతిపక్ష నేత తీవ్రంగా విమర్శించారు. నిరసనలో పెల్లెట్ గాయాలకు గురైన ఒక యువకుడు ఇచ్చిన ఫిర్యాదుపై ఎఫ్ఐఆర్ నమోదు చేసే వరకు తాను కదిలేది లేదని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ శుక్రవారం పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో ఆరు గంటల పాటు ధర్నాకు దిగారు. రాహుల్ గాంధీ నిరసనకు దిగడంతో అప్రమత్తమైన పోలీసులు పార్లమెంట్ పోలీస్ స్టేషన్ వెలుపల భారీగా బలగాలను మోహరించారు. పరిస్థితి అదుపు తప్పకుండా ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బందిని కూడా రంగంలోకి దించారు. కొద్దిసేపు పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. బాధితుడైన 19 ఏళ్ల సాహిల్ లోచబ్‌తో కలిసి వచ్చిన రాహుల్‌గాంధీ, పై స్థాయి నుంచి ఆదేశాలు ఉన్నందున ఎఫ్ఐఆర్ నమోదు చేయలేమని పోలీసు అధికారులు తనకు చెప్పారని పేర్కొన్నారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా న్యాయానికి

తరువాయి 8లో



## షావుకారు జానకి
# కన్నుమూత

సిఎం రేవంత్ రెడ్డి సహా పలువురు రాజకీయ, సినీ ప్రముఖులు సంతాపం

ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రముఖ నటి షావుకారు జానకి (94) కన్నుమూశారు. గత కొంత కాలంగా వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ చెన్నైలోని కావేరి ఆసుపత్రిలో శుక్రవారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచినట్లు ఆమె సన్నిహితులు పేర్కొన్నారు. జానకి మృతిపట్ల సిఎం రేవంత్‌రెడ్డి సహా పలువురు రాజకీయ సినీ ప్రముఖులు విచారం వ్యక్తం చేశారు. ఆమె మృతికి సంతాపం తెలిపారు. షావుకారు జానకిగా ప్రసిద్ధిచెందిన శంకరమంచి జానకి (జననం 1931 డిసెంబరు 12) అలనాటి రంగస్థల, సినీ కథానాయిక. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో 370కి పైగా సినిమాల్లో నటించింది. ఇందులో సుమారు 2 వందలకి పైగా కథానాయిక పాత్రలు పోషించింది. ఆమె రేడియో నాటికల ద్వారా కెరీర్ ప్రారంభించింది. తెలుగు, తమిళ భాషల్లో ఎన్. టి. రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, ఎం.జి.ఆర్, శివాజీ గణేశన్ మొదలైన నటుల సరసన కథానాయికగా చేసింది. ఆమె చెల్లెలు కృష్ణకుమారి కూడా సినిమా నటి. భారత ప్రభుత్వం ఆమెను 2022లో పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం రాజమండ్రిలో, కన్నడ మాధ్వ బ్రాహ్మణ కుటుంబంలో జన్మించింది. తండ్రి

తరువాయి 8లో

## కాంగ్రెస్‌కు నష్టం కలిగించేలా వ్యవహరిస్తే
# కఠిన చర్యలు తీసుకోవాలి

- పార్టీ అధిష్టానాన్ని కోరిన 20 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- కొండా సురేఖ కూతురు సుస్మిత వ్యాఖ్యలపై దుమారం
- షోకాజ్ నోటీసులపై క్రమశిక్షణ కమిటీకి అంతా చెప్పా : కొండా సురేఖ



ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ పార్టీలో దుమారం చెలరేగుతోంది. సుస్మిత ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై చేసిన వ్యాఖ్యలను పార్టీ ఎమ్మెల్యేలు, నాయకులు తీవ్రంగా ఖండించారు. సిఎల్‌పి వేదికగా దాదాపు 20 మంది ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు మీడియా సమావేశం నిర్వహించి పార్టీకి నష్టం కలిగించే విధంగా మాట్లాడే వారిపై చర్యలు తీసుకోవాలని అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. కుమార్తె వ్యాఖ్యలతో తనకు సంబంధంలేదని చెబుతున్న మంత్రి సురేఖ తన కుమార్తెకు వారసత్వ ఆస్థి ఇవ్వడంలేదా, అలా ఇచ్చినప్పుడు కుమార్తె చేసిన వ్యాఖ్యలకు తల్లి కూడా బాధ్యత వహించాలి కదా అని

తరువాయి 8లో

## ఎల్‌నినో సవాళ్లను
# సమష్టిగా ఎదుర్కొందాం

- విపత్తుగా కాకుండా అవకాశంగా మార్చుకోవాలి
- రాజేంద్రనగర్ టిజిఐఆర్‌డిలో రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో మంత్రులు తుమ్మల, సీతక్క, శ్రీహరి సూచన
- నీటి సంరక్షణ, ప్రత్యామ్నాయ పంటలు, గ్రామీణ ఉపాధిపై ప్రత్యేక దృష్టి సారించామని వెల్లడి

ప్రజాపక్షం/హైదరాబాద్

ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షా భావ పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉన్నందున, తెలంగాణ ప్రభుత్వం ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉందని రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క, వాకిటి శ్రీహరి అన్నారు. ఎల్‌నినో సవాళ్లను సమష్టిగా ఎదుర్కొందామని, దానినొక విపత్తుగా కాకుండా అవకాశంగా మార్చుకోవాలన్నారు. రాజేంద్ర నగర్‌లోని తెలంగాణ గ్రామీణాభివృద్ధి సంస్థ (టిజిఐఆర్‌డి)లో శుక్రవారం ఎల్‌నినో ప్రభావం, శాఖల సమన్వయంతో చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై నిర్వహించిన రాష్ట్రస్థాయి వర్క్‌షాప్‌లో మంత్రులు పాల్గొన్నారు. ఈ వర్క్‌షాప్‌లో రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ

తరువాయి 8లో





## యువతను విస్మరిస్తే
# పతనం తప్పదు

- 'దిమాగి నక్సల్స్' ప్రకటన అసహనానికి నిదర్శనం
- అధ్యయనం, పోరాటం అలవర్చుకోవాలి
- యువజన సమాఖ్య జిల్లా మహాసభలో కూనంనేని
- పోరాటాల కాణాచి యువజన సమాఖ్య : ధర్మేంద్ర, వల్లీ

ప్రజాపక్షం/ఖమ్మం

పాలకులు యువతను విస్మరిస్తే పతనం తప్పదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి , ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఉపాధి ఉద్యోగ రంగాలు వట్టి పోతున్నాయని తద్వారా దేశంలో నిరుద్యోగం పెరిగిపోతుందని ఉపాధి లేక యువశక్తి నిర్వర్యం అవుతుందని ఆయన తెలిపారు. అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) ఖమ్మం జిల్లా 25వ మహాసభలు శుక్రవారం చింతకాని మండలం కొదుమూరు గ్రామంలో పగడాల భరత్ ప్రాంగణంలో జరిగింది. మహాసభకు ముందు గ్రామంలోవందలాది మంది యువకులు భారీ ప్రదర్శన నిర్వహించారు.మహాసభ ప్రారంభ సూచికగా ఎఐవైఎఫ్ పతాకాన్ని కొండపర్తి గోవిందరావు , అమరవీరుల స్థూపాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. మహ్మద్ గౌస్ పాషా, అబ్బూరి మహేష్, దండి శ్రీజ, మామిడి కిరణ్, యుమున అధ్యక్షవర్గంగా వ్యవహరించిన మహాసభకు ముఖ్యఅతిథిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ యువజన సమాఖ్య కార్యకర్తలు సామాజిక కర్తవ్యాన్ని నెరవేర్చే క్రమంలో ముందు వరుసలో నిలబడాలని సూచించారు. దేశ జనాభాలో సగం కలిగిన యువత హక్కుల కోసం పోరాడాలని, పోరాడకుండా ఏ హక్కులు సాధించబడలేదన్నారు.సమాజాన్ని మార్చగలిగే శక్తి యువతరానికి ఉందని అందుకే

తరువాయి 12లో

## రాయదుర్గ్‌లో ఎకరా ధర
# రూ.264 కోట్లు

ప్రజాపక్షం/హైదరాబాద్

- వేలంలో రికార్డుస్థాయిలో ధరలు
- 5.25 ఎకరాల భూమి రూ.1,386 కోట్లకు విక్రయం



హైదరాబాద్ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో మరో సంచలన రికార్డు నమోదైంది. రాయదుర్గ్‌లోని టిజిఐఐసి ప్లాట్ నంబర్ పి1 ఎకరాకు ఏకంగా రూ.264 కోట్ల ధర పలికింది. 5.25 ఎకరాల ఈ భూమి ఈవేలంలో మొత్తం రూ.1,386 కోట్లకు విక్రయమైంది. హైదరాబాద్‌లో ఇప్పటి వరకు నమోదైన అత్యధిక భూమి ధరల్లో ఇది కీలక రికార్డుగా నిలిచింది. టిజిఐఐసి నిర్ణయించిన ఎకరాకు రూ.175 కోట్ల రిజర్వ్ ధరతో పోలిస్తే తుది ధర

తరువాయి 12లో

## రాజస్థాన్‌లో సిజెపి బృందంపై
# బిజెపి కార్యకర్తలు దాడి



- పాఠశాలలను తనిఖీ చేయనీయకుండా వెళ్లగొట్టిన కాషాయ మూకలు
- బిజెపి గూండాల పనేనని అభిజీత్ దీప్కే మండిపాటు
- రాజస్థాన్ ప్రజాస్వామ్యానికి ఇది ఒక చీకటి రోజు : రంకా

జైపూర్ : రాజస్థాన్‌లోని పాఠశాలల్లో నెలకొన్న దయనీయస్థితి, తమ బండారం ఎక్కడ బయటపడుతుందోన్న భయంతో అధికార పార్టీకి చెందిన కార్యకర్తలు కాక్రోచ్ జనతా పార్టీ (సిజెపి) బృందంపై ఓ గ్రామంలో దాడికి పాల్పడ్డారు. దీంతో ఆగ్రామంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. 'స్కూల్ ఠీక్ కరో' (పాఠశాలను బాగుచేయండి) ప్రచారంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలను పరిశీలించడానికి వెళ్ళిన

తరువాయి 12లో

### ఓరుగల్లు కాంగ్రెస్‌లో మళ్లీ ముసలం

పరకాల సభలో అభ్యర్థి ప్రకటనతో వివాదం

03

సిపిఐ అగ్రనాయకులు
సిపిఐ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ పార్లమెంట్ సభ్యులు
కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి
ప్రథమ వర్ధంతి సభ

2026 ఆగస్టు 22
ఉదయం 11.00 గంటలకు
సిపిఐ రాష్ట్ర కార్యాలయం
(ముఖ్దూం భవన్)
హిమాయత్‌నగర్, హైదరాబాద్
ముఖ్య అతిథులు
ప్రొఫెసర్ గంట చక్రపాణి
వైస్ చాన్సలర్ డా॥ బి.ఆర్. అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం
కామ్రేడ్ పల్లా వెంకట్ రెడ్డి
సిపిఐ జాతీయ కార్యదర్శి
విప్లవాభివందనములతో...
కామ్రేడ్ కూనంనేని సాంబశివ రావు
సిపిఐ రాష్ట్ర కార్యదర్శి
భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)
తెలంగాణ స్టేట్ కౌన్సిల్

నీట్ తదితర పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజి, పరీక్షల రద్దుపై నరేంద్రమోదీ ప్రభుత్వం మెడలు వంచటంలో ఢిల్లీలో సిజెపి పిలుపుపై విద్యార్థులు, యువత ఆందోళన సఫలం కావటాన్నుండి స్ఫూర్తిపొందిన ఝార్ఖండ్ రాష్ట్ర విద్యార్థులు చేబట్టిన ఆందోళన – విద్యార్థులు, ప్రభుత్వం మధ్య కుదిరిన ఒప్పందంతో ఈనెల 18న ముగిసింది. ఆ ఒప్పందానుసారం ప్రభుత్వం 22 రిక్రూట్మెంట్ పరీక్షలను, రిక్రూట్మెంట్‌ను రద్దుచేస్తూ, మరో 22పరీక్షలు అవకతవకలపై దర్యాప్తుకు ఆదేశిస్తూ 19వ తేదీన ఉత్తర్వులు చేసింది. దేవేంద్ర మహతో తన 16 రోజుల నిరాహార దీక్ష విరమించారు. ఢిల్లీ ఆందోళనలో దెబ్బతిన్న బిజెపి ఝార్ఖండ్ ఆందోళనలో చేరి ఢిల్లీ ఉద్యమాన్ని మించి దీనికి ప్రచారం ఇవ్వటానికి ప్రయత్నించింది. ఝార్ఖండ్ జెఎంఎం ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీ భాగస్వామిగా ఉన్నందున, రాహుల్‌గాంధిని అప్రతిష్ట పాల్జేయటానికి ప్రయత్నించి భంగపడింది. ప్రభుత్వం – విద్యార్థి నాయకుల ఒప్పందంతో విద్యార్థులు ఆందోళన విరమించటంతో శుభం కార్డు పడిందని భావించబడింది. అయితే గతంలో నోటిఫికేషన్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగాలు పొందినవారు తమ పొట్టకొట్టటం అన్యాయం, చట్టవిరుద్ధమంటూ హైకోర్టును ఆశ్రయించటం, రిక్రూట్మెంట్లను రద్దు చేసిన ప్రభుత్వ ఉత్తర్వుపై జస్టిస్ దీపక్ రోషన్ 20వ తేదీన స్టే విధించటంతో ప్రభుత్వ చర్యకు బ్రేకుపడింది. హైకోర్టు స్టే విధించిన ప్రభుత్వ ఉత్తర్వులు జెపిఎస్ఇ 11వ, 13వ పరీక్షల ద్వారా చేసిన నియామకాలు, ఆహార భద్రత అధికారుల నియామకానికి సంబంధించినవి. సమాధానం దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ,

## ఝార్ఖండ్ ఆందోళన పరిష్కారంలో చిక్కుముడి

తదుపరి విచారణను న్యాయమూర్తి సెప్టెంబర్ 15కు వాయిదా వేశారు. ఆ రోజున, ఒక వేళ తీర్పు యిస్తే అది మైలురాయి కాగలదు.

విచారణ సందర్భంలో న్యాయమూర్తి మౌఖికంగా చేసిన వ్యాఖ్యలు గమనార్హం. మొత్తం విషయాన్ని దర్యాప్తు చేయటానికి రాష్ట్రప్రభుత్వమే సిఐడిని ఆదేశించినపుడు, ఏ పర్మినెంట్ ఉద్యోగినీ సహజన్యాయం సూత్రాన్ని పాటించకుండా తొలగించటానికి వీల్లేదు. ఈ సమస్యకు సంబంధించి యదార్థ నిర్ధారణ రిపోర్టు ఏమైనా ఉందా, కేవలం ఒక ఉత్తర్వు జారీ చేయటం ద్వారా ప్రభుత్వం పర్మినెంట్ ఉద్యోగిని తొలగించగలదా? అని ప్రశ్నించారు. పరీక్షలు, నియామకాల రద్దుకు చట్టప్రకారం అనుసరించాల్సిన క్రమాన్ని పాటించలేదని వ్యాఖ్యానించారు. ఇదిచాలా సమంజసమైన ప్రశ్న. ఇది ఏ రాష్ట్రానికైనా వర్తిస్తుంది. ఆందోళన విరమింపజేసేందుకై రాష్ట్రప్రభుత్వం కుట్రపూరితంగా తమను దగా చేసిందని ప్రతిపక్ష బిజెపి, విద్యార్థి నాయకులు ఆరోపిస్తున్నారు.

ఢిల్లీ ఆందోళనకు విద్యార్థులు, యువత ఆన్‌లైన్ సందేశాలతో భావోద్వేగంతో తమంతటతాము సమీకృతులైనారు. ఝార్ఖండ్ ఆందోళన తద్భిన్నం, బహు నాయకత్వంతో నడిచింది. జెపిఎస్‌సి–జెఎస్ఎస్‌సి రిఫామ్ మంచ్ జులై 25న రాంచీలో జైపాల్ సింగ్ స్టేడియంలో ఆందోళన ప్రారంభించింది. కునాల్ ప్రతాప్‌సింగ్ దాని నాయకుడు. 14వ జెపిఎస్‌సి తదితర పరీక్షల రద్దు, సిబిఐచేత లేదా రాష్ట్రేతర రిటైర్డ్ జడ్జీలతో విచారణ వారి ప్రధాన డిమాండ్. ఆందోళన విస్తరించిన సమయంలో దేవేంద్రనాథ్ మహతో నిరాహారదీక్షవల్ల ఆయన గ్రూపు ప్రజల దృష్టిని ఆకర్షించింది. ఆయన కొత్త రాజకీయ పార్టీ లోక్‌తాంత్రిక్ క్రాంతికార్ మోర్చాకు చెందినవారు. టైగర్ మహతోగా పిలవబడే జైరాం మహతో గ్రూపు ఆగస్టు రెండవ వారంలో చురుకుదనం పొందింది. వీరు రిఫామ్ మంచ్‌కి వ్యతిరేకులు. మరికొన్ని స్వతంత్ర గ్రూపులు కూడా ఉన్నాయి. బిజెపి, దాని విద్యార్థి విభాగం ఎబివిపి వంటి రాజకీయ మద్దతుదారులు ఉండనే ఉన్నారు.

జులై 2న ప్రకటించిన జెపిఎస్‌సి పిటి ఫలితాల్లో అవకతవకల ఆరోపణలతో ప్రారంభమైన విద్యార్థుల ఆందోళన అనేక మలుపులు తిరిగి ఆగస్టు 18న ప్రభుత్వంతో ఒప్పందంతో ముగిసింది. ఆందోళన చేస్తున్న విద్యార్థులను సంతృప్తిపరిచేందుకై ప్రభుత్వం వారితో చేసుకున్న నియామకాల రద్దు ఒప్పందాన్ని అనుసరించి జారీ చేస్తున్న ఉత్తర్వులను – ఉద్యోగ నియామకం పొందినవారు హైకోర్టులో సవాలు చేయటం, ప్రభుత్వ ఉత్తర్వులను (ఇప్పటికి రెండు) కోర్టు నిలుపుచేయటంతో సమస్యకు మళ్లీ చిక్కుముడి పడింది. ఈ పరిణామం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు గమనించదగింది.



### బిజెపి గూండాలు దాడిచేయటం హేయం

రాజస్థాన్‌లో సిజెపి వలంటీర్లపై బిజెపి గూండాలు దాడిచేయటం హేయం. విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలని గళమెత్తిన విద్యార్థులను అడ్డుకుంటారా? చిన్నారులను నిరక్షరాస్యులను చేయాలని బిజెపి భావిస్తోందా? దేశంలో ఏం జరుగుతోంది? పాఠశాలలను తనిఖీ చేయటానికి వెళితే వారిపై భౌతిక దాడికి పాల్పడటం బిజెపి గూండాయిజాన్ని బట్టబయలు చేసింది.

– ఆమ్ ఆద్మీ పార్టీ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్




## గడప లోపలే మతం - గడప దాటితే విశ్వ బంధువులం

మతం, కులం, విశ్వాసాలను పాటించడానికి రాజ్యాంగం హక్కులను కల్పించింది. కులమతాలు మన వ్యక్తిగత అంశాలు. కులమతాలు మానవాళి ఐక్యతకు, ప్రపంచ శాంతికి అడ్డుపడరాదు. మాట్లాడడం, అభిప్రాయాలను వ్యక్తం చేయడం, విశ్వాసాలు పాటించడం, ఆచారాలను గౌరవించడం, పరమత సహనం కలిగి ఉండడం పౌర సమాజ కనీస కర్తవ్యం. మతం లేదా విశ్వాసం ఆధారంగా హింసాత్మక చర్యల బాధితులు లేదా వారి కుటుంబ సభ్యులను స్మరించుకోవడం లేదా సహాయం చేయడానికి ప్రతి ఏట 22 ఆగష్టు రోజున మతం లేదా విశ్వసం ఆధారంగా హింసాత్మక ఘటనల బాధితులను స్మరించుకునే అంతర్జాతీయ దినం పాటించాలని ఐరాస సర్వసభ్య సమావేశం తీర్మానించడం హర్షదాయకం. మతం ఆధారంగా ఒక వర్గానికి చెందిన గృహాలను ధ్వంసం చేయడం, హింసాత్మక ఘటనలకు పూనుకోవడం, ఆస్తులు/వ్యాపారాలు/విద్యాలయాలు/సాంస్కృతిక కేంద్రాలు/ప్రార్థనా స్థలాలపై పలు రకాలుగా హింసాత్మక చర్యలకు పూనుకోవడం లాంటి సంఘటనలను తీవ్ర స్థాయిలో వ్యతిరేకించాలి లేదా ఖండించాలి.

**పెహల్గామ్ హింసాత్మక దుర్ఘటన మతపరమైనదే :**

మైనారిటీల హక్కుల పరిరక్షణ, పరమత సహనం, మతం లేదా విశ్వాసాలను స్వేచ్ఛగా వినియోగించుకునే హక్కులను కల్పించడం మానవాళి కనీస కర్తవ్యం. భావ ప్రకటన, మత విశ్వాసాలు పాటించడం, అభిప్రాయాలను వ్యక్తం చేయడం, శాంతియుతంగా సమావేశాలు నిర్వహించుకోవడం లాంటి అంశాలకు పూర్తి స్వేచ్ఛ కల్పించబడింది. ఒకరి మత విశ్వాసం మరొకరికి అడ్డు పడరాదు. ఇతరుల మత విశ్వాసాలను గౌరవించడం అలవాటు కావాలి. ఇలాంటి హక్కులకు భంగం కలిగితే శాంతియుత వాతావరణం వేడెక్కి వివాదాస్పద హింసాత్మక ఘటనలకు దారితీస్తాయి. ఇటీవల 22 ఏప్రిల్ 2025 రోజున పెహల్గామ్ దుర్ఘటనలో హిందూ మతస్తులపై పాకిస్థాన్ ముస్లిమ్ ఉగ్రవాదులు భయంకరమైన దాడి చేసి 26 మంది ప్రాణాలు బలిగొనడం చూసాం. ఈ దుర్ఘటన మతపరమైన హక్కులకు భంగం కలిగించడమే కాకుండా ఒక మతానికి చెందిన వారిని ఏరి కోరి కాల్చి వేయడం జరిగింది. ఈ తీవ్రవాదుల దుశ్చర్యకు ప్రతీకారంగా 07 మే 2025 రోజున భారత త్రివిధ దళాలు ఆపరేషన్ సింధూర్ పేరుతో జరిపిన బాంబుదాడుల్లో పాకిస్థాన్ ఉగ్రవాద శిక్షణ కేంద్రాలు, మిలటరీ కేంద్రాలను ధ్వంసం చేయడంతో పాకిస్థాన్ చేతులు ఎత్తి, ఓటమిని అంగీకరించి, కాల్పుల విరమణ ప్రతిపాదన తేవడం జరిగింది.

మతం మానవత్వానికి అడ్డు కారాదు. ఒకరి విశ్వాసాలు మరొకరికి విశ్వాసాలకు భంగం కలిగించరాదు. ప్రపంచ మానవాళి శ్రేయస్సు కోరి మత విశ్వాసాలను వ్యక్తిగతంగా మాత్రమే పాటిస్తూ, మరొకరికి అడ్డు కాకుండా చూసుకోవాలి. జాతి, కులం, మతం, విశ్వాసం, ఆచారం లాంటివి గౌరవించబడాలి. మన విశ్వాసాలు మరొకరి హక్కులకు భంగం కలిగించరాదని గమనించాలి. హింసాత్మక ఘటనలు సమాజ అస్థిరతకు కారణం అవుతాయి. పరస్పర పరమత సహనం మన నిత్య మంత్రం కావాలి. ఒకరి మతం మరొకరి విశ్వాసాలను వ్యతిరేకించరాదు. అన్నీ మరిచి మానవత్వమే సాధనంగా ప్రపంచ సమైక్యతకు పునాదులు వేయాలి, హింస లేని ప్రపంచం నిర్మించబడాలి.

(22 ఆగష్టు మతం లేదా విశ్వాసం ఆధారంగా హింసాత్మక ఘటనల బాధితులను స్మరించుకునే అంతర్జాతీయ దినం సందర్భంగా)

# ప్రజా ఉద్యమాల దిశానిర్దేశకుడు సుధాకర రెడ్డి



మారుపాక అనిల్ కుమార్
9440482429

భారత కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో అనేక మంది నాయకులు కేవలం రాజకీయ పదవులను అలంకరించిన వ్యక్తులుగా కాకుండా, ఒక భావజాలానికి, ఒక విలువల రాజకీయానికి, ప్రజల పట్ల అచంచలమైన నిబద్ధతకు ప్రతీకలుగా నిలిచారు. అలాంటి నాయకుల్లో కామ్రేడ్ సురవరం సుధాకర రెడ్డి ఒకరు. ఆయన జీవితం వ్యక్తిగత విజయాల గాథ కాదు; అది భారత శ్రామికవర్గం, రైతాంగం, పేదలు, అణగారిన వర్గాల విముక్తి కోసం సాగిన నిరంతర రాజకీయ ప్రయాణం. 2025 ఆగస్టు 22న ఆయన మరణంతో భారత కమ్యూనిస్టు ఉద్యమం ఒక అనుభవజ్ఞుడైన నాయకుడిని కోల్పోయింది. అయితే ఆయన రాజకీయ వారసత్వం, సిద్ధాంత స్పష్టత, ప్రజల పట్ల అంకితభావం వామపక్ష ఉద్యమాలకు దిక్సూచిగా నిలుస్తున్నాయి. ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన జీవితాన్ని స్మరించుకోవడం అంటే ఒక నాయకుడిని మాత్రమే కాదు, ప్రజా రాజకీయాల అసలైన అర్థాన్ని గుర్తు చేసుకోవడం కూడా. సురవరం సుధాకర రెడ్డి యువకుడిగా ఉన్న రోజులే భారతదేశంలో తీవ్రమైన సామాజిక, రాజకీయ మార్పుల కాలం. స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ పేదరికం, భూమిలేని రైతులు, నిరుద్యోగం, కుల వివక్ష, సామాజిక అసమానతలు దేశాన్ని వెంటాడుతున్నాయి. రాజకీయ స్వాతంత్ర్యం మాత్రమే సరిపోదు; సామాజిక, ఆర్థిక సమానత్వం కూడా రావాలని భావించిన వేలాదిమంది యువకులలో ఆయన ఒకరు. విద్యార్థి దశలోనే ప్రజా సమస్యల పై ఆసక్తి పెంచుకున్న ఆయన, సామాజిక మార్పుకోసం సంఘటిత రాజకీయాల అవసరాన్ని గుర్తించారు. మార్క్సిస్టు సాహిత్యం, భారత స్వాతంత్ర్య ఉద్యమం, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం వంటి చారిత్రక సంఘటనలు ఆయన రాజకీయ అవగాహనకు మరింత పదును పెట్టాయి.

సురవరం సుధాకర రెడ్డి రాజకీయ జీవితంలో అత్యంత విశిష్టమైన అంశం ఆయన సిద్ధాంత నిబద్ధత. ఆయన వ్యక్తిగత జీవితం అత్యంత నిరాడంబరంగా ఉండేది. ఉన్నత రాజకీయ పదవుల్లో ఉన్నప్పటికీ ఆడంబరానికి దూరంగా ఉండేవారు. కార్యకర్తలతో సమానంగా కూర్చొని భోజనం చేయడం, వారి అభిప్రాయాలను శ్రద్ధగా వినడం, ప్రతి చిన్న కార్యకర్తను గౌరవించడం ఆయన నాయకత్వ శైలిలో ముఖ్య లక్షణాలు. నాయకుడు అంటే ఆదేశాలు ఇచ్చే వ్యక్తి కాదని, ప్రజలతో కలిసి నడిచే వ్యక్తి అని ఆయన తన ఆచరణతో నిరూపించారు.

సురవరం సుధాకర రెడ్డి దృష్టిలో ఎన్నికలు రాజకీయ జీవితంలో ఒక భాగం మాత్రమే. కానీ ప్రజల దైనందిన సమస్యలపై జరిగే ఉద్యమాలే అసలైన ప్రజాస్వామ్యానికి ప్రాణం అని ఆయన నమ్మారు. రైతుల భూమి సమస్యలు, కార్మికుల వేతనాలు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ, విద్య, వైద్యం, ఉపాధి, సామాజిక న్యాయం ఈ అంశాలన్నింటిపైనా ఆయన ఉద్యమాలకు నాయకత్వం వహించారు. యువజన ఉద్యమంలో కీలక నాయకుడిగా పనిచేశారు. ఆయన అఖిల భారత యువజన సమాఖ్య జాతీయ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో, యువతకు 18 సంవత్సరాలకే ఓటు హక్కు కల్పించాలని దేశవ్యాప్త ఉద్యమానికి నాయకత్వం వహించారు. ఈ ఉద్యమంలో కేరళ కు చెందిన సి.కె. చంద్రప్పన్ వంటి నాయకులతో కలిసి విస్తృత ప్రచారం, ఆందోళనలు నిర్వహించారు. ఆ ఉద్యమం ఫలితంగా తర్వాత భారత రాజ్యాంగంలోని 61వ రాజ్యాంగ సవరణ (1988) ద్వారా ఓటు హక్కు వయస్సు 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలకు తగ్గించబడింది. ఈ విజయానికి సురవరం సుధాకర రెడ్డి గారి దీర్ఘకాల పోరాటం కూడా ఒక ముఖ్యమైన కారణంగా గుర్తించబడుతుంది. విదేశాల్లో దాచిన నల్లధనం వల్ల దేశానికి భారీ ఆదాయ నష్టం జరుగుతుందని, అదే సమయంలో పేదలపై పన్నుల భారం పెరుగుతుందని ఆయన వాదించేవారు. ఈ సమస్యపై అన్ని రాజకీయ పార్టీలూ కలిసి పోరాడాలని కూడా పిలుపునిచ్చారు. విదేశీ బ్యాంకుల్లో భారతీయుల నల్లధనం అంశాన్ని పార్లమెంట్‌లో అనేక సందర్భాల్లో లేవనెత్తారు. 2జీ స్పెక్ట్రం కేటాయింపుల్లో అవినీతిపై పార్లమెంట్‌లో తీవ్రంగా స్పందించారు. ప్రజా సంపద ప్రజలకే దక్కాలని, సంపద కేటాయింపులో పారదర్శకత తప్పనిసరి అని, అవినీతి ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరగాలని పార్లమెంటు సాక్షిగా కేంద్ర ప్రభుత్వంపైన పోరాటాలు నిర్వహించారు సురవరం సుధాకర రెడ్డి. పార్లమెంట్‌లో మహిళల రిజర్వేషన్ హక్కులకు సంబంధించిన అంశాలపై నిరంతరం మాట్లాడారు. మహిళల సమాన హక్కులు, భద్రత, ఆర్థిక సాధికారత, రాజకీయ ప్రాతినిధ్యం కోసం ఆయన మద్దతు తెలిపారు. మహిళల సమస్యలను ఆయన కేవలం సంక్షేమ అంశాలుగా కాకుండా సామాజిక న్యాయం, లింగ సమానత్వం, రాజ్యాంగ హక్కుల కోణంలో ప్రస్తావించేవారు. ముఖ్యంగా పేద, దళిత, గిరిజన, శ్రామిక మహిళల సమస్యలను పార్లమెంట్ దృష్టికి తీసుకురావడంలో ఆయన చురుకైన పాత్ర పోషించారు.



కామ్రేడ్ సురవరం సుధాకర రెడ్డి గారి ప్రథమ వర్ధంతి సందర్భంగా

### నేటి తరానికి ఆయన స్ఫూర్తి

ప్రస్తుతం దేశంలో ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయి. నిరుద్యోగం, వ్యవసాయ సంక్షోభం, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, మత విద్వేష రాజకీయాలు, రాజ్యాంగ విలువలపై సవాళ్లు వంటి పరిస్థితుల్లో సురవరం సుధాకర రెడ్డి చూపిన రాజకీయ దారి మరింత ప్రాసంగికంగా కనిపిస్తోంది. ఆయన జీవితం మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తుంది. ప్రజల పక్షాన నిలబడే రాజకీయాలే శాశ్వతమైనవి; విలువల కోసం పోరాడే నాయకత్వమే చరిత్రలో నిలిచిపోతుంది.

భారత కమ్యూనిస్టు ఉద్యమం కేవలం ఎన్నికల రాజకీయాలకే పరిమితం కాకుండా ప్రజల నిత్యజీవిత సమస్యల పరిష్కారాన్ని లక్ష్యంగా పెట్టుకున్న ఉద్యమం. ఆ ఉద్యమానికి సైద్ధాంతిక బలం, రాజకీయ దిశ, ప్రజలతో నిరంతర అనుబంధం అవసరం. ఈ మూడు లక్షణాలు సమపాళ్లలో కలిగిన నాయకుడు కామ్రేడ్ సురవరం సుధాకర రెడ్డి. రాష్ట్ర స్థాయి నాయకుడిగా ప్రారంభమైన ఆయన రాజకీయ ప్రస్థానం క్రమంగా జాతీయ స్థాయికి చేరుకుంది. భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ప్రధాన కార్యదర్శిగా ఆయన పార్టీని క్లిష్ట రాజకీయ పరిస్థితుల్లో ముందుకు నడిపించారు.

సురవరం సుధాకర రెడ్డి పార్టీకి నాయకత్వం వహించిన కాలంలో భారత రాజకీయాలు వేగంగా మారుతున్నాయి. ఒకవైపు ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, ఉదారవాద ఆర్థిక విధానాలు వేగంగా అమలవుతుంగా, మరోవైపు మతతత్వ రాజకీయాలు బలపడుతున్నాయి. ఈ రెండు ధోరణులు దేశ సామాజిక నిర్మాణానికీ, ప్రజల జీవన ప్రమాణాలకూ ప్రమాదకరమని ఆయన విశ్లేషించారు. సిపిఐ ప్రధాన కార్యదర్శిగా దేశవ్యాప్తంగా పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడంపై ఆయన ప్రత్యేక దృష్టి పెట్టారు. రాష్ట్ర కమిటీలను బలోపేతం చేయడం, యువ నాయకత్వాన్ని ప్రోత్సహించడం, మహిళల భాగస్వామ్యాన్ని పెంచడం, కార్మిక–రైతు సంఘాలతో సమన్వయం సాధించడం వంటి అంశాలను ఆయన పార్టీ నిర్మాణంలో ప్రధాన ప్రాధాన్యంగా తీసుకున్నారు. పార్టీ బలం కార్యాలయాల్లో కాదు, ప్రజల మధ్య ఉంటుంది. ప్రజల పోరాటాల్లో భాగస్వామ్యం కాని పార్టీ బలపడదు.

### పార్లమెంట్‌లో ప్రజల సమస్యలకు స్వరం

సురవరం సుధాకర రెడ్డి పార్లమెంట్‌ను కేవలం చట్టాలు చేసే వేదికగా కాకుండా, ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే ప్రజాస్వామ్య వేదికగా ఉపయోగించారు. ప్రభుత్వ విధానాలను విమర్శించినప్పుడు కూడా ఆయన వ్యక్తిగత విమర్శలకు పోకుండా, గణాంకాలు, వాస్తవాలు, రాజ్యాంగ సూత్రాల ఆధారంగా తన వాదనను వినిపించేవారు. అందుకే రాజకీయ ప్రత్యర్థులు కూడా ఆయనను గౌరవించేవారు. భారత రాజ్యాంగంలోని లౌకికవాదాన్ని సుధాకర రెడ్డి భారత ప్రజాస్వామ్యానికి మూలస్తంభంగా భావించారు. భారత దేశం అనేక మతాలు, భాషలు, సంస్కృతులు, జాతులు కలిసిన దేశం. ఈ వైవిధ్యాన్ని కాపాడే శక్తి లౌకికవాదమేనని ఆయన విశ్వసించారు. మతం పేరుతో విద్వేషాన్ని రెచ్చగొట్టడం, ఎన్నికల ప్రయోజనాల కోసం సమాజాన్ని విభజించడం దేశ భవిష్యత్తుకు ప్రమాదకరమని ఆయన అనేక సభల్లో హెచ్చరించారు.

### రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య విలువల కోసం నిరంతర పోరాటం

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రూపొందించిన భారత రాజ్యాంగాన్ని సురవరం సుధాకర రెడ్డి అత్యంత గౌరవంతో చూసేవారు. రాజ్యాంగం ప్రతి పౌరుడికి సమాన హక్కులు కల్పించిందని, కానీ ఆ హక్కులు ఆచరణలో అమలుకావాలంటే ప్రజా ఉద్యమాలు అవసరమని ఆయన స్పష్టం చేసేవారు. భావ ప్రకటనా స్వేచ్ఛ, సంఘటిత హక్కు, కార్మిక హక్కులు, రైతుల హక్కులు, రాష్ట్రాల హక్కులు వంటి అంశాలపై ఎలాంటి దాడి జరిగినా ఆయన గట్టిగా వ్యతిరేకించారు. ఆర్థిక సంస్కరణల పేరుతో ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరించే విధానాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. ప్రభుత్వరంగ సంస్థలు కేవలం వ్యాపార సంస్థలు కావని, అవి దేశ అభివృద్ధికి, ఉపాధికి, సామాజిక సమానత్వానికి పునాది అని ఆయన వాదించారు. రైల్వేలు, బీమా, బ్యాంకింగ్, బొగ్గు, ఉక్కు, విద్యుత్ వంటి కీలక రంగాలను ప్రైవేటీకరించడం వల్ల సామాన్య ప్రజలపై భారాలు పెరుగుతాయని ఆయన హెచ్చరించారు.

ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షం అంటే ప్రభుత్వాన్ని అడ్డుకోవడం కాదని, ప్రజా ప్రయోజనాలను కాపాడటం అని ఆయన భావించేవారు. ప్రజలకు మేలు చేసే విధానాలకు మద్దతు ఇవ్వడం, ప్రజావ్యతిరేక విధానాలను నిరసించడం ఇదే బాధ్యతాయుతమైన ప్రతిపక్ష రాజకీయమని ఆయన ఆచరణలో చూపించారు. అందుకే ఆయన కేవలం సిపిఐ నాయకుడిగానే కాకుండా, భారత ప్రజాస్వామ్య ఉద్యమానికి చెందిన ఒక విలువైన రాజకీయవేత్తగా గుర్తింపు పొందారు. యువత రాజకీయాలకు దూరంగా ఉండకూడదని, సమాజ సమస్యలను అర్థం చేసుకోవాలని, చరిత్రను అధ్యయనం చేయాలని ఆయన పిలుపునిచ్చేవారు. రాజకీయ శిక్షణ, పుస్తక పఠనం, ప్రజల మధ్య పని, శాస్త్రీయ దృక్పథం ఈ నాలుగు అంశాలను ఆయన యువ కార్యకర్తలకు నిరంతరం సూచించేవారు.

**ఆయన మాటల్లో:** ఉద్యమానికి నినాదాలు మాత్రమే సరిపోవు. అధ్యయనం, ఆలోచన, ఆచరణ కలిసినప్పుడే శాశ్వత మార్పు సాధ్యమవుతుంది. ఈ ప్రథమ వర్ధంతి సందర్భంగా కామ్రేడ్ సురవరం సుధాకర రెడ్డికి మనం అర్పించే నిజమైన నివాళి – ఆయన ఆశయాలను ఆచరణలో పెట్టడం, రాజ్యాంగ విలువలను కాపాడడం, కార్మిక–రైతు–దళిత–ఆదివాసీ–మైనారిటీ ప్రజల హక్కుల కోసం ప్రజాస్వామ్య పద్ధతుల్లో నిరంతరం పోరాడడం.

### ఎర్రమందారం సురవరం

పల్లవి
అమరుడా !సురవరం అందుకో లాల్ సలామ్
సురవరం సుధాకర్ రెడ్డి అందుకో లాల్ సలామ్
గరిబోల్ల గొంతుకై గర్జించిన సింగమా..
అసమర్థుల పాలనపై గళమెత్తిన గానమా!

చరణం
కయ్యానికి సైయంటూ కాలు దువ్వి లేచినోడా!
నీ ఆశయ సాధనలో ఆటంకాలెన్నొచ్చిన
భయానికి తావు లేదు కమ్యూనిజం మార్గంలో
చివరి వరకు పోరినావు చెదర లేదు నీ శౌర్యం

సమసామజ స్థాపనకై నిరంతరం పోరినోడా!
నియంత పాలనపై నిప్పు కణిక వైనోడా!
పేగునిండ బువ్వ లేని పేదొల్లను కూడగట్టి
మతిలేని నాయకుల చెమటలు పట్టించినోడా!
అంతరాల సమాజాన్ని అంతు సూడ లేచినోడా!
అడ్డంకులు ఎన్నొచ్చిన అధిగమించి పోరినోడా!
జగ మెరిగిన నేతవై ప్రజా పోరు సలిపినోడా!
కడవరకు కమ్యూనిస్టు జెండ పట్టి సాగినోడా!

అనితర సాధ్యుడా!విజయ నాధుడా!
పోరులోన గెలిచినావు ఔరా అని నిల్చినోడ
మదిలోన సంకల్పం అవహించుకున్నోడా!
దెబ్బదిన్న చిరుతోలె ముందుండి కదిలినోడా!

నీ పోరును మరువ లేము నీ దారిని వీడలేము
నువు సూపిన దారిలోనే మేమంతా సాగుతాము
సమసమాజ స్థాపనకై ఏకమై పోరుతాము
ఎర్రజెండ నీడకింద కడవరకు చేరుతాము

గడ్డమీది చంద్రమోహన్ గౌడ్
9866510399

# శ్రమతో ఆర్జించే వారిదే ‘అర్జక్ సంఘ్’ : రామ్ స్వరూప్ వర్మ

ప్రొ.దేవరాజు మహారాజు

దేశంలోని ఉత్తర దక్షిణ రాష్ట్రాలను నిశితంగా పరిశీలిస్తే – దక్షిణాది రాష్ట్రాలలో విద్యావంతులు ఎక్కువ. పెరియార్, గోరా, కందుకూరి, త్రిపురనేని, కోవూర్ వంటి వారి కృషితో దక్షిణాన చైతన్యమెక్కువ. హేతువాదులెక్కువ. నిజమే! కానీ ఉత్తర భారత దేశంలోని రాష్ట్రాల నుంచి కూడా కొంతమంది సంఘ సంస్కర్తలు, హేతువాదులు, బౌద్ధ అనుయాయులు వచ్చారు. వారు చేయగలిగినంత చేశారు. సామాజిక, ఆర్థిక, రాజకీయరంగాలలో జనాన్ని చైతన్యవంతుల్ని చేశారు. అయినా కూడా వారి ప్రభావం ఏమాత్రం లేకుండా జనాన్ని మూఢత్వంలో ముంచి, దౌర్జన్యాలు చేస్తూ అక్రమ మార్గంలో అధికార పీఠాలు ఆక్రమించినవారిని మనం ఇటీవల చూస్తున్నాం. ఒకప్పుడు ఉత్తరప్రదేశ్ నుండే రామ్‌స్వరూప్ వర్మ, లల్లైసింగ్ యాదవ్‌లు వచ్చారు. బీహార్ నుండి బాబు జగదేవ్‌ప్రసాద్ వచ్చాడు. బ్రాహ్మణిజం ఆధిపత్యాన్ని తగ్గించడానికి, బహుజనులు అధికారం చేపట్టడానికి కావల్సిన నేపథ్యాన్ని వారు సమకూర్చారు. రామ్‌స్వరూప్‌వర్మ, బాబు జగదేవ్‌ప్రసాద్‌లు స్వయంగా రాజకీయాల్లోకి దూకి, ఆయా రాష్ట్రాల్లో మంత్రులుగా కొంతకాలం పరిపాలన సాగించారు కూడా! వీరిలో రామ్‌స్వరూప్ వర్మది ప్రత్యేమైన కృషి. జన్మ, పునర్జన్మ, ఆత్మ, పరమాత్మ కర్మఫలితం వంటి కల్పించిన మాటలతో, తప్పుడు సిద్ధాంతాలతో జనాన్ని భయానికి గురిచేసి, లేని దేవుణ్ణి ప్రతిష్టాపించి, వారు చెప్పిన మాటలన్నీ భగవంతుడు చెప్పాడని బొంకుతూ, కష్టపడకుండా దోచుకుతింటున్న బ్రాహ్మణ ఆధిపత్యాన్ని నిర్ద్వంద్వంగా నిరసించినవాడు రామ్‌స్వరూప్ వర్మ. మనుస్మృతిని చీల్చి చెండాడుతూ పుస్తకాలు రాసి, రామ్‌చరిత్‌మానస్‌ను (రామాయణాన్ని) బహిరంగంగా తగులబెట్టి, తన ఆలోచనలకు ఉద్యమ రూపమిచ్చిన క్రియాశీలి. ఇప్పటిదాకా మానవుడి కేంద్రంగానే విషయాలన్నీ వెలుగులోకి వచ్చాయని, ఇకముందు కూడా అలాగే జరుగుతుందనీ – దేనిలోనూ ఏ శక్తీ ఏ మహత్తూ లేదని, ఏ మతమూ ఏ దేవుడూ లేడని కరాఖండిగా చెప్పి, కష్టజీవుల పక్షాన నిలిచిన మేధావి, మానవవాది రామ్‌స్వరూప్ వర్మ.

కులాల్ని, వర్గాల్ని, వర్ణాల్ని, మతాల్ని అందులోని శాఖల్ని త్యజించి అన్నింటికీ అతీతంగా మానవీయ విలువల్ని నిలుపడం కోసం ఒక ప్రత్యేకమైన సంఘాన్ని ఏర్పాటు చేశాడు రామ్‌స్వరూప్ వర్మ. దానిపేరు అర్జక్ సంఘ్ – అంటే శారీరక శ్రమతో మాత్రమే డబ్బు సంపాదించుకుని జీవనం సాగించే వారి సంఘం. శారీరక శ్రమ సౌందర్యానికి అత్యున్నతమైన గౌరవమిచ్చే సంఘం. వర్ణవ్యవస్థను కాలరాసి, వైజ్ఞానిక అవగాహనతో జన్యుశాస్త్రం రుజువుపరిచిన – “మనుషులంతా ఒక్కటే” నన్న భావనతో అందరినీ కలుపుకుపోయే సంఘం – అర్జక్ సంఘ్! అర్జక్ – అంటే ఆర్జించేవాడు. కూర్చుని దొంగమాటలు చెప్పి, డబ్బు లాగేవారు కూడా ఆర్జిస్తున్నారు కదా? – అంటే.. వారు ఈ సంఘంలో సభ్యులు కారు. ఎంతటి మేధావి అయినా, ఎంత గొప్ప ప్రణాళికలు రూపొందించినా – అవి వాస్తవ రూపం దాల్చాలంటే శ్రమ శక్తి తోడు కావాల్సిందే! ఆలోచనలు ఆలోచనలుగా ఉంటే లాభం ఉండదు. అవి వాస్తవ రూపాలు సంతరించుకుంటేనే సమాజానికి ఉపయోగం! అందువల్ల, అర్జక సంఘంలో కష్టపడి, చెమటోడ్చి పనిచేసే కర్షక, కార్మిక వర్గాల వారికే ప్రాధాన్యత ఉంటుంది. శ్రమకూ, మానవీయ విలువలకూ ప్రాధాన్యమిచ్చే ఆలోచనాపరులు కూడా ఈ సంఘంలో భాగస్వాములు కావచ్చు. అయితే, వారు తమతమ కులమతాల్ని, ఆర్థి కస్థోమతల్ని పక్కకు నెట్టి, మానవ శ్రేయస్సు కోరుకునే స్వేచ్ఛా జీవులు కావాలి! అన్న విషయం రామ్‌స్వరూప్ వర్మ తన సంఘానికి సంబంధించిన ‘బైలాస్’లో రాసుకున్నాడు. 1970 తొలినాళ్ళలో ప్రారంభమైన ఈ సంఘాన్ని ఆయన అనుయాయులు ఈనాటికీ క్రియాశీలంగానే ఉంచారు. ఆ సంఘం వారు అధికారికంగా నిర్వహించుకుంటున్న యూట్యూబ్ ఛానెల్ ఇప్పటికీ పనిచేస్తూనే ఉంది. హేతువాదాన్ని, శాస్త్రీయ అవగాహనను, మానవ వాదాన్ని ప్రచారం చేస్తూనే ఉంది.

రామ్‌స్వరూప్ వర్మ చెప్పినదాన్ని బట్టి – “బ్రాహ్మణిజం ఒక చెట్టు లాంటిది. పునర్జన్మ దాని తల్లివేరు. మనిషి చేతిలో ఏమీలేదు. అంతా విధిరాత అని ప్రగాఢంగా నమ్మే ఆలోచనా ధోరణి (FATALISM) ఆ చెట్టు కాండమైతే, వర్ణ వ్యవస్థ ఆ వృక్షానికున్న శాఖలు. దానిమీదే కులం ఆకులుగా మొలుస్తాయి. అగ్రవర్ణం, నిమ్నవర్గం లాగా కొన్ని పుష్పాలు వృక్షం అగ్రభాగాన పూస్తే, కొన్ని పువ్వులు కింది భాగంలో అంచెలంచెలుగా పూస్తాయి. శ్రమదోపిడీ ఈ వృక్షపు ఫలాలు!”– భారతదేశంలో శతాబ్దాలుగా వేళ్ళూనుకుని ఉన్న బ్రాహ్మణిజపు స్వభావాన్ని రామ్‌స్వరూప్‌వర్మ సంకేతాత్మకంగా, సందేశాత్మకంగా ఇలా వర్ణించి చెప్పాడు. వైజ్ఞానిక అవగాహనతో సమాజాన్ని అవలోకించే వారికి వర్మ వర్ణన బాగా నచ్చుతుంది. ఇది మాత్రమేగాక, ఆయన మరొక విషయం కూడా నిర్మొహమాటంగా చెప్పాడు. మనకు కొందరు సంఘ సంస్కర్తలుంటారు. వారు ఆకులు – పూలు–పండ్లు పీకేద్దామని ప్రయత్నిస్తుంటారు. దానివల్ల ఫలితం ఉండదు కదా? ఆకులు మళ్ళీ మొలుస్తుంటాయి. పూలు మళ్ళీ పూస్తుంటాయి. శ్రమదోపిడి ఫలాలు కాస్తూనే ఉంటాయి. మరి ఎలాగా? అంటే–వేళ్ళతో సహా ఆ వృక్షాన్ని ఊడబెరికితే గాని, లేదా నరికితే గాని సమసమాజ స్థాపన జరగదు! రామ్ స్వరూప్ వర్మ (22 ఆగస్టు 1923 –19 ఆగస్టు 1998) యు.పి, కాన్పూర్ జిల్లా , గౌరి కరన్ గ్రామంలో కుర్మిజాతి వ్యవసాయ కుటుంబంలో పుట్టాడు. తండ్రి వంశ్ గోపాల్, తల్లి సుఖియా. విద్యార్థి దశలోనే వర్మకు సియాదులారీ అనే అమ్మాయి తో పెద్దలు పెండ్లి చేశారు. ఆ అమ్మాయి రెండేళ్ళకే చనిపోయింది. వర్మ మళ్ళీ పెళ్ళి చేసుకోలేదు. తనను తాను బహుజన ఉద్యమకారుడిగా, రాజకీయ నాయకుడిగా, మానవవాదిగా, రచయితగా, తత్త్వవేత్తగా తీర్చిదిద్దుకుంటూ, సమాజానికి దిశానిర్దేశం చేస్తూ ముందుకు సాగాడు. ఎం.ఎ.; ఎల్ఎల్‌బి డిగ్రీలు తీసుకున్నా లాయర్‌గా ప్రాక్టీసు చేయలేదు. ఐ.ఎ.ఎస్ పరీక్ష ఉత్తీర్ణుడై ఉండి కూడా ఇంటర్వ్యూకు పోలేదు. స్వేచ్ఛగా జనజీవితంతో మమేకమై పనిచేయాలనుకున్నాడు. తర్వాత కొంత కాలానికి ఆచార్య నరేంద్రదేవ్ తోనూ, డా.రామ్ మనోహర్ లోహియాతోనూ పరిచయాలు పెరిగి, సోషలిస్ట్ పార్టీ సభ్యుడయ్యాడు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీకి పలుమార్లు ఎన్నికయ్యాడు. చరణ్‌సింగ్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో 1967లో ఆయన మంత్రివర్గంలో ఆర్థిక మంత్రి అయ్యాడు. అప్పటికి ఆయనకు ఒక విషయం పూర్తిగా అర్థమైంది. సామాజిక, సాంస్కృతిక రంగాలలో సమానత్వం సాధించకుండా రాజకీయ, ఆర్థిక సమానత్వం సాధించడం కుదరదని! ఫలితంగానే అర్జక్ సంఘ్ స్థాపనకు పూనుకున్నాడు.

1972లో వర్మ సోషలిస్ట్ పార్టీ వదిలి, తనే ‘సమాజ్‌దళ్’ అనే కొత్త రాజకీయ పార్టీ ప్రారంభించాడు. దానికి అనుబంధంగా ‘అర్జక్ సాప్తాహిక్’ అనే హిందీ వారపత్రిక ప్రచురణ చేపట్టాడు. అదే సమయంలో బీహార్‌లో బాబు జగదేవ్ ప్రసాద్ సోషలిస్ట్ పార్టీ వదిలి ‘శోషిత్ దళ్’ పేరుతో కొత్త పార్టీనీ, అనుబంధంగా ‘శోషిత్ సాప్తాహిక్’ హిందీ వారపత్రికను ప్రారంభించాడు. ఈ ఇద్దరి ఆలోచనలు, వారు ప్రచురిస్తున్న పత్రికల కథనాలు, చేపట్టిన కార్యక్రమాలు ఒకే విధంగా ఉండడంతో 1972లో ఇద్దరూ కలిసిపోయారు. ఇద్దరూ కలిసి సంయుక్తంగా “శోషిత్ సమాజ్ దళ్” పేరుతో పార్టీ ప్రారంభించారు. దానికి రామ్‌స్వరూప్‌వర్మ చైర్ పర్సన్‌గా, జగదేవ్ ప్రసాద్ కార్యదర్శిగా పనిచేయనారంభించారు.

రామ్ స్వరూప్ వర్మ రచనలన్నీ హిందీలో ప్రకటించాడు. అందులో “ మానవ వాది ప్రశ్నోత్తం” “మానవ వాద్ వర్సెస్ బ్రాహ్మణ్‌వాద్ ”, “మనుస్మృతి రాష్ట్రీక కళింక్”, “నిరాదర్ కైసే మిటే”, “అఛూతోంకి సమస్యా అవుర్ సమాధాన్”, “అర్జక్ సంఘ్ సిద్ధాంత్ – కర్తవ్య విధాన్ కార్యక్రమ్ ” వంటి శీర్షికలతో చాలా పుస్తకాలు ప్రకటించారు. 1. పుట్టుక, పెళ్ళి, చావు వంటి వాటిల్లో బ్రాహ్మణ పురోహితుల ప్రమేయాన్ని పూర్తిగా తొలగించాలి. 2.ఆచారాల పేరుతో ఆర్భాటాలు ఆపేయాలి. 3.నిజాల్ని జీర్ణించుకుని వాస్తవంలో బతకాలి. 4. మొత్తానికి మొత్తంగా బ్రాహ్మణిజాన్ని తరిమికొట్టాలి. 5.అంత మాత్రం చేత అగ్రవర్ణం వారిని ద్వేషించకూడదు 6.అందరినీ సమాన స్థాయి గల మనుషులుగా గౌరవించుకోవాలి – వంటి విషయాలన్నీ రామ్‌స్వరూప్ వర్మ తన అర్జక్ సంఘ్ బైలాస్‌లో పొందుపరిచాడు. బుద్ధుడి ఆలోచనలకు, బోధనలకు ఆకర్షితుడైన రామ్‌స్వరూప్ వర్మ, వాటిని ఆధునిక వైజ్ఞానిక కాలానికి అనుగుణంగా మార్పులు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నాడు. తను అభిమానించే డా.బి.ఆర్.అంబేద్కర్ చివరి దశలో హిందూ మతం వదిలి బౌద్ధాన్ని స్వీకరించాడు. ఆయన ఇంకొంత కాలం జీవించి ఉంటే ‘నవయానం’లో అనువైన మార్పులు, చేర్పులు చేసి ఉండేవారేమోనన్నది వర్మ అభిప్రా యం.

**(22 ఆగస్టు రామ్ స్వరూప్ వర్మ జయంతి)**

# ఓరుగల్లు కాంగ్రెస్‌లో మళ్లీ ముసలం

- పరకాల సభలో అభ్యర్థి ప్రకటనతో వివాదం
- కొండా సుస్మిత వ్యాఖ్యలతో దుమారం
- మంత్రి సురేఖకు వ్యతిరేకంగా ఒక్కటైన ఎమ్మెల్యేలు





**ప్రజాపక్షం/హనుమకొండ :** ఉమ్మడి వరంగల్ జిల్లా కాంగ్రెస్ పార్టీలో మళ్ళీ ముసలం మొదలైంది. ఈసారి పరకాల కేంద్రంగా రాజుకున్న చిచ్చు.. ఏకంగా సిఎం రేవంత్‌రెడ్డి వరకు తాకింది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి వర్సెస్ మంత్రి కొండా సురేఖ కుటుంబంగా సాగుతున్న రాజకీయ పోరు సిఎం పర్యటన తర్వాత మరింత ముదిరింది. మంత్రి కొండా సురేఖ కుమార్తె సుస్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలు.. ఆ తర్వాత పార్టీ క్రమశిక్షణ సంఘం మంత్రి సురేఖకు నోటీసులు ఇవ్వడం.. దానికి ఆమె ఇచ్చిన వివరణ.. తాజాగా కొండా వ్యతిరేకవర్గం నేతలు మీడియా ముందుకొచ్చి ఆమెపై చర్యలు తీసుకోవాలని ఏఐసీసీ నేతలను డిమాండ్ చేయడంతో వ్యవహారం మరింత ముదిరింది. చివరికి ఢిల్లీ పెద్దల వరకు ఫిర్యాదులు చేరాయి. ఈ క్రమంలో హైదరాబాద్‌లో మంత్రి కొండా సురేఖపై చర్యలు తీసుకోవాలని కోరుతూ అధికార ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమావేశమై మీడియా ముందు డిమాండ్ చేయడంతో వివాదం తారాస్థాయికి చేరినట్లు అయింది.

**సిఎం పర్యటన తర్వాత వివాదం.. సుస్మిత వ్యాఖ్యలతో దుమారం**

ఈ నెల 16న పరకాలలో సిఎం రేవంత్‌రెడ్డి పర్యటించారు. ఈసందర్భంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ డ్డిని ప్రశంసిస్తూ, రాబోయే ఎన్నికల్లో ఆయనను గెలిపించాలని పార్టీ శ్రేణులకు సీఎం పిలుపునిచ్చారు. ఈపర్యటనకు మంత్రి కొండా సురేఖ హాజరు కాలేదు. తాను పిలిచినా సిఎం సభకు మంత్రి రాలేదని ఎమ్మెల్యే ప్రకాశ్ రెడ్డి బహిరంగంగానే ప్రకటించారు. ఈ సందర్భంగా బుధవారం గీసుకొండలో కొండా సుస్మిత పటేల్ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్‌లో వివాదానికి దారితీశాయి. సిఎం రేవంత్ రెడ్డి, ఆయన సోదరులు, మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యే రేవూరిపై ఆమె వ్యాఖ్యలు చేయడంతో పార్టీ నేతలు అభ్యంతరం వ్యక్తం చేశారు. సిఎం వచ్చినా, రేవూరి వచ్చినా పరకాల నుంచి తానే అభ్యర్థినని ఆమె ప్రకటించింది. దీంతో దుమారం రేపిన సుస్మిత వ్యాఖ్యలపై అధిష్టానం దృష్టి సారించింది. ఈ వ్యాఖ్యలకు మంత్రి కొండా సురేఖ బాధ్యత వహించాల్సి ఉంటుందన్న అభిప్రాయంతో టిపిసిసి క్రమశిక్షణ సంఘం నోటీసు జారీ చేయడం రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**మంత్రి సురేఖ వివరణ తీరుపై భగ్గు..**

టిపిసిసి క్రమశిక్షణ సంఘం చైర్మన్ మల్లు రవికి గురువారం వివరణతో కూడిన లేఖను అందజేసిన మంత్రి కొండా సురేఖ.. సుస్మిత చేసిన వ్యాఖ్యలు ఆమె వ్యక్తిగత అభిప్రాయాలని.. వాటిని తనకు ఆపాదించడం తగదని స్పష్టం చేశారు. బంధుత్వం కారణంగా ఒకరి వ్యక్తిగత అభిప్రాయాలకు మరొకరు రాజకీయంగా బాధ్యత వహించాలనడం సముచితం కాదని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో హనుమకొండ డిసిసి కార్యాలయంలో ప్రెస్‌మీట్ ఏర్పాటు చేసిన రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, రెండు జిల్లాల డిసిసి అధ్యక్షులు ఇనగాల వెంకట్రాంరెడ్డి, ఆయూబ్ తదితరులు కొండా సురేఖ వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమెను పార్టీ నుంచి బహిష్కరించాలని డిమాండ్ చేయడం కలకలంగా మారింది.

**అధిష్టానం నిర్ణయంపై ఉత్కంఠ..**

ఇటీవలి పరిణామాలు చూస్తే.. కొండా సురేఖ కుటుంబం వర్సెస్ ఒక్క రేవూరి వ్యవహారం కాదని స్పష్టమవుతోంది. సురేఖ వివరణ, పార్టీ కీలక నేతల తాజా డిమాండ్ల నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందన్నది. మారింది. సుస్మిత వ్యాఖ్యలపై చర్యలు తీసుకుంటా రా? సురేఖకు ఇచ్చిన నోటీసుపై పార్టీ ఏ నిర్ణయం తీసుకుంటుంది? కొండా వ్యతిరేకవర్గం రీ యూనియన్ నేతలు డిమాండ్లు ఏ మేరకు పరిష్కరించుకుంటారు? రాష్ట్రవ్యాప్తంగా చర్చకు దారితీసిన జిల్లా కాంగ్రెస్ రాజకీయాలు ఏవిధమైన మలుపులు తిరగనున్నాయి? అన్న చర్చ ఇటు రాజకీయ విశ్లేషకులు, అటు పార్టీ కేడర్‌లో సాగుతోంది.



# సమ్మెకు ఎఐటియుసి మద్దతు

- డ్రైవర్లకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి: ఎస్. బాల్‌రాజ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలోని ఆటో, క్యాబ్, వ్యాన్, స్కూల్ వాహన డ్రైవర్ల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎఐటియుసి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. డ్రైవర్ల సమ్మెకు ఎఐటియుసి సంపూర్ణ మద్దతు ప్రకటిస్తుందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఆటో, ఇతర రవాణా రంగ డ్రైవర్లకు సంవత్సరానికి రూ.12 వేల ఆర్థిక సాయం అందిస్తామని ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని కోరారు. మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించడంతో ఆటో డ్రైవర్ల ఆదాయం గణనీయంగా తగ్గిందని అన్నారు. పెరుగుతున్న పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలకు అనుగుణంగా ఆటో మీటర్ చార్జీలను పెంచి డ్రైవర్లను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల కోసం సమగ్ర సంక్షేమ చట్టాన్ని తీసుకురావాలని, ప్రమాదాలకు గురైనప్పుడు నష్టపరిహారం అందించడంతో పాటు ఆటోలకు ప్రభుత్వమే బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఓలా, ఊబర్, రాపిడో వంటి ప్రైవేట్ యాప్‌లకు ప్రత్యామ్నాయంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం ప్రత్యేక యాప్‌ను రూపొందించి డ్రైవర్లకు ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం జరుగుతున్న సమ్మెలో ఎఐటియుసి ప్రత్యక్షంగా పాల్గొంటుందని ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఆటో డ్రైవర్లు సమ్మెకు సంఘీభావం తెలిపి ఐక్యంగా పోరాడాలని బాల్‌రాజ్ పిలుపునిచ్చారు. పోరాటాలు, ఉద్యమాల ద్వారానే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని, డ్రైవర్లకు ఎఐటియుసి అండగా ఉంటుందని ఆయన భరోసా ఇచ్చారు.


**ఆటో, క్యాబ్‌ల నిరవధిక రాష్ట్రవ్యాప్త బంద్‌కు సంపూర్ణ మద్దతు: తెలంగాణ టాక్సీ డ్రైవర్స్, ఓనర్స్ జెఎసి**

దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర ఆటో, క్యాబ్, యాప్ ఆధారిత సంఘాల జెఎసి ఈ నెల 23 తేదీ అర్ధరాత్రి నుండి తలపెట్టిన నిరవధిక రాష్ట్రవ్యాప్త బంద్‌కు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని తెలంగాణ టాక్సీ డ్రైవర్స్, ఓనర్స్ జెఎసి నేతలు బైరగోని రాజు గౌడ్ (టిఎంటిడియు), సతీష్ కుమార్ (టిఆర్‌సిపిటియు), రవి గౌడ్ (టిఎస్‌సిపిఎ), కిరణ్ కుమార్ (సిసిడిఎ), వినయ్ భూషణ్ (అమ్మ క్యాబ్స్), మహేందర్ (టిఆర్‌పికె)లు ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది టాక్సీ, క్యాబ్ డ్రైవర్లు ఈ నిరవధిక రాష్ట్ర బంద్‌లో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సత్యనారాయణ రెడ్డి భవన్‌లో శుక్రవారం తెలంగాణ టాక్సీ డ్రైవర్స్, ఓనర్స్ జెఎసి రాష్ట్ర నేతల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆటో, క్యాబ్ డ్రైవర్లవి న్యాయమైన సమస్యలు అని, రాష్ట్ర ప్రభుత్వంపై ఎలాంటి ఆర్థిక భారం లేకుండానే పరిష్కరించవచ్చని తెలిపారు. లేనిపక్షంలో ఈనెల 23 తేదీ అర్ధరాత్రి నుండి జరిగే నిరవధిక రాష్ట్ర బంద్‌లో టాక్సీ, క్యాబ్ డ్రైవర్లు ప్రత్యేక్షంగా పాల్గొని రాష్ట్రంలో రవాణా వ్యవస్థను స్థంబింపజేస్తామని వారు హెచ్చరించారు.

# అర్హులైన ప్రతి పేద కుటుంబానికీ ఇందిరమ్మ ఇల్లు


- సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొన్న మంత్రులు

**ప్రజాపక్షం/జగిత్యాల :** అర్హులైన ప్రతి పేద కుటుంబానికి కులం, మతం, రాజకీయాలకు అతీతంగా ఇందిరమ్మ ఇల్లు అందించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. శుక్రవారం జగిత్యాల పట్టణంలోని పద్మనాయక ఫంక్షన్ హాల్‌లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, వయోవృద్ధులు, వికలాంగులు, ట్రాన్స్‌జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సిసిఎల్ఎ కమిషనర్ లోకేష్‌కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు, హౌసింగ్ ఎం.డి. గౌతమ్, వెలమ సంక్షేమ సంఘం కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడ నరసింగరావు, జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ తదితరులతో కలిసి మంత్రి పాల్గొన్నారు. అనంతరం మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. పేదల సంక్షేమానికి ప్రభుత్వం ఎల్లప్పుడూ కృషి చేస్తోందని, సంక్షేమ కార్యక్రమాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని తెలిపారు.గత ప్రభుత్వం నూకపల్లి 2బీహెచ్‌కే కాలనీలో అవసరమైన మౌలిక వసతుల కల్పనపై నిర్లక్ష్యం చేసిందని మంత్రి అన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి దశలో రూ.32 కోట్లతో తాగునీరు, డ్రైనేజీ, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించినట్లు తెలిపారు. నూకలపల్లి 2బీహెచ్‌కే కాలనీలో రేషన్ దుకాణం ఏర్పాటు చేయాలని, బస్సు సౌకర్యం కల్పించాలని జిల్లా కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు. కాలనీలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేసేందుకు కూడా చర్యలు తీసుకుంటామని తెలిపారు. 2008లో పునాది వేసిన కాలనీలో 18 సంవత్సరాల తర్వాత ప్రజలకు అవసరమైన సౌకర్యాలతో ఇళ్లు అందించగలిగామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం మరోసారి పత్రికా ప్రకటన ఇచ్చి అర్హుల నుంచి దరఖాస్తులు స్వీకరించి, క్షేత్రస్థాయిలో విచారణ అనంతరం అర్హులైన ప్రతి కుటుంబానికి ఇల్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నూకలపల్లి 2బీహెచ్‌కే కాలనీలో పెండింగ్ పనులు పూర్తి చేసి మౌలిక వసతులు కల్పించేందుకు రూ.72 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. ధర్మపురి ప్రజల చిరకాల కోరిక అయిన రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని, ధర్మపురిలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం మంజూరు చేయాలని మంత్రి పొంగులేటిని కోరారు. మల్యాల మండలంలో చెరువులో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఇద్దరు చిన్నారుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందిస్తున్నట్లు తెలిపారు. జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ మాట్లాడుతూ నూకపల్లి 2బీహెచ్‌కే కాలనీలో తాగునీరు, విద్యుత్ సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం రూ.18 కోట్లు మంజూరు చేసిందని తెలిపారు. ఎమ్మెల్సీ ఎల్. రమణ మాట్లాడుతూ పేదలకు గౌరవప్రదమైన ఇళ్లు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. జిల్లా కలెక్టర్ బి.సత్యప్రసాద్ మాట్లాడుతూ జగిత్యాల జిల్లాలో మొత్తం 10,365 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా, 2,208 ఇళ్లు నిర్మాణం పూర్తయ్యే దశలో ఉన్నాయని తెలిపారు. ఇప్పటివరకు 8,079 మంది లబ్ధిదారులకు రూ.227 కోట్ల 32 లక్షలు విడుదల చేసినట్లు వెల్లడించారు. చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ అర్హులైన పేద కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వెలమ సంక్షేమ సంఘం కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడ నరసింగరావు మాట్లాడుతూ పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను స్వాగతించారు. అనంతరం ఇటీవల చెరువులో ఈతకు వెళ్లి ప్రమాదవశాత్తు మృతి చెందిన ఇద్దరు చిన్నారుల కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందజేశారు. అనంతరం 12 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, అదనపు కలెక్టర్లు లత, రాజ గౌడ్, జగిత్యాల జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంఘనభట్ల దినేష్, జగిత్యాల, మెట్‌పల్లి, కోరుట్ల ఆర్డీవోలు మధుసూదన్, నరసింహారావు, జీవాకర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.



# అనుమతి నిరాకరణపై విహెచ్ ఫైర్

- తెలంగాణలో పెట్టుబడులకు కేంద్రం అడ్డంకులు సృష్టిస్తోంది



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటనకు అనుమతి ఇవ్వకపోవడం వెనుక బిజెపి నేతల కుట్ర ఉందని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ఆరోపించారు. తెలంగాణలో పెట్టుబడులు తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతుంటే కేంద్ర ప్రభుత్వం అడ్డంకులు సృష్టిస్తోందని విమర్శించారు. రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వి.హనుమంతరావు మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ చెబుతున్న 'వికసిత్ భారత్'లో తెలంగాణ భాగస్వామ్యం కాకుండా అడ్డుకోవాలనే కుట్ర జరుగుతోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి అమెరికా పర్యటన ద్వారా రాష్ట్రానికి పెట్టుబడులు, పరిశ్రమలు వచ్చే అవకాశం ఉన్నప్పటికీ అనుమతి నిరాకరించడం సరైన చర్య కాదన్నారు. తెలంగాణలో మెజారిటీగా ఉన్న బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ వర్గాలకు జనాభా దామాషా ప్రకారం న్యాయం జరగాలన్న కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ లక్ష్యం కోసం పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తోందని వి.హెచ్. తెలిపారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టనున్న జనగణనలో ఒబిసి జనాభా వివరాలను నమోదు చేయకుండా బిజెపి అడ్డంకులు సృష్టిస్తోందని ఆయన విమర్శించారు. జనాభా ప్రాతిపదికన సామాజిక న్యాయం అందాలంటే ఒబిసిలకు సంబంధించిన కచ్చితమైన గణాంకాలు అవసరమని పేర్కొన్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయం మేరకు ఈ నెల 25న ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఒబిసి మహాసభ నిర్వహించనున్నట్లు వి.హనుమంతరావు వెల్లడించారు.

# బకాయి మిల్లర్లపై ఉక్కుపాదం

- సివిల్ సప్లైస్‌లోకి గ్రేహౌండ్స్, ఆక్టోపస్ కమాండోలు
- 28 మందితో ప్రత్యేక టాస్క్‌ఫోర్స్.. రాష్ట్రవ్యాప్తంగా తనిఖీలు: ఎం.స్టీఫెన్ రవీంద్ర



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రభుత్వానికి బియ్యం అప్పగించకుండా బకాయిపడిన మిల్లర్లపై తెలంగాణ పౌరసరఫరాల శాఖ కఠిన చర్యలకు సిద్ధమైంది. ఎన్‌ఫోర్స్‌మెంట్, విజిలెన్స్ విభాగంలో గ్రేహౌండ్స్, ఆక్టోపస్‌కు చెందిన 28 మంది అత్యుత్తమ కమాండోలను నియమించి ప్రత్యేక టాస్క్ ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసింది. బకాయి మిల్లర్లపై రాష్ట్రవ్యాప్తంగా ముమ్మర తనిఖీలు చేపట్టేందుకు ఈ బృందాలు రంగంలోకి దిగనున్నాయి. సివిల్ సప్లైస్ కమిషనర్ ఎం.స్టీఫెన్ రవీంద్ర శుక్రవారం సివిల్ సప్లైస్ భవన్‌లో ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించి కొత్తగా విధుల్లో చేరిన కమాండోలకు దిశానిర్దేశం చేశారు. శాఖ నిబంధనలు, చట్టపరమైన అంశాలపై కమాండోలకు ఇప్పటికే మూడు రోజులపాటు ప్రత్యేక శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో నిత్యావసర వస్తువులకు సంబంధించిన చట్టాలపై వారికి అవగాహన కల్పించినట్లు చెప్పారు. కమాండోలకు ఆకస్మిక తనిఖీల్లో ఉన్న ప్రత్యేక నైపుణ్యాన్ని సివిల్ సప్లైస్ శాఖ వినియోగించుకోనుందని తెలిపారు. ప్రభుత్వ సొమ్మును పక్కదారి పట్టించినా, నిబంధనలు ఉల్లంఘించినా ఉపేక్షించేది లేదని కమిషనర్ హెచ్చరించారు. ప్రభుత్వానికి బియ్యం అప్పగించకుండా బకాయిపడిన మిల్లర్ల వద్ద ప్రత్యేక బృందాలు క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపడతాయని తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన మిల్లర్లపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

**154 లక్షల టన్నుల వడ్ల సేకరణ..**

గత సీజన్ (కెఎంఎస్2025–26)లో రాష్ట్ర చరిత్రలోనే అత్యధికంగా 154 లక్షల మెట్రిక్ టన్నుల వడ్లను సేకరించినట్లు కమిషనర్ తెలిపారు. రైతుల నుంచి వడ్ల కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం సుమారు రూ.40వేలకోట్లు ఖర్చు చేసిందని పేర్కొన్నారు.

# పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా

- ఆందోళన చేస్తున్న విద్యార్థులతో మంత్రి వివేక్ ముఖాముఖి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** పాలిటెక్నిక్‌లను శక్తి (కార్మిక, ఉపాధి, శిక్షణ, ఫ్యాక్టరీలు గనుల) శాఖ పరిధిలోకి తీసుకురావడంపై విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు. మాసబ్‌ట్యాంక్ పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థుల వద్దకు వెళ్లిన మంత్రి వారితో నేరుగా మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేశారు. పాలిటెక్నిక్‌ల శాఖ మారినప్పటికీ విద్యార్థుల చదువులు, పరీక్షలు, సిలబస్, డిప్లొమా సర్టిఫికెట్లు, ఫీజులు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇసెట్, లేటరల్ ఎంట్రీ వంటి అంశాల్లో ఎలాంటి మార్పులు ఉండవని మంత్రి హామీ ఇచ్చారు. ఇప్పటికే పాలిటెక్నిక్‌లలో చదువుతున్న విద్యార్థుల ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగదన్నారు.

**పాలిటెక్నిక్‌లను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదు..**

పాలిటెక్నిక్‌లను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని, అవి ప్రభుత్వ ఆధీనంలోనే కొనసాగుతాయని మంత్రి స్పష్టం చేశారు. పరిశ్రమల భాగస్వామ్యం కేవలం ఆధునిక సాంకేతిక శిక్షణ, సిఎస్ఆర్ నిధులు, ఉపాధి అవకాశాల పెంపునకు మాత్రమేనని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల విద్య, పరీక్షలు, ఫీజులు, ఇతర ప్రయోజనాలకు పూర్తి బాధ్యత వహిస్తుందన్నారు. పాలిటెక్నిక్‌లను ఆధునికీకరించేందుకు సుమారు రూ.600 కోట్ల నుంచి రూ.800 కోట్ల వరకు నిధు లు ఖర్చు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి తెలిపారు. ఆధునిక పరికరాలు, మెరుగైన మౌలిక సదుపాయాలు, కొత్త సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థులకు శిక్షణ అందించనున్నట్లు చెప్పారు. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా కొత్త కోర్సులను ప్రవేశపెట్టి ఉద్యోగ అవకాశాలను పెంచుతామని తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలల సిబ్బంది జీతాలు, ప్రమోషన్లు, సర్వీస్ కండిషన్లలో ఎలాంటి మార్పులు ఉండవని మంత్రి స్పష్టం చేశారు. వారు ప్రభుత్వ ఉద్యోగులుగానే కొనసాగుతారని తెలిపారు. భవిష్యత్తులో పాలిటెక్నిక్‌ల అభివృద్ధికి అనుగుణంగా మరిన్ని పోస్టులు, ప్రమోషన్ అవకాశాల కల్పనపైనా పరిశీలిస్తామని చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వం పూర్తి బాధ్యత వహిస్తుందని, శాఖ మార్పుపై ఎలాంటి భయాలు, అపోహలు పెట్టుకోవద్దని మంత్రి వివేక్ వెంకటస్వామి కోరారు. విద్యార్థుల సందేహాలు, సమస్యలను నేరుగా విని పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

# షావుకారు జానకి మృతిపై ప్రముఖుల సంతాపం

**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రముఖ నటి, పద్మశ్రీ షావుకారు జానకి మృతి పట్ల రాజకీయ, సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. అలాగే తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి తీవ్ర విచారం వ్యక్తం చేశారు. చిన్నతనం నుంచే నాటకాల్లో వివిధ పాత్రలు పోషిస్తూ కెరీర్‌ను ప్రారంభించిన షావుకారు జానకి దాదాపు ఏడు దశాబ్దాల పాటు చలనచిత్ర రంగంలో తనదైన ముద్ర వేశారని ఒక సందేశంలో సిఎం పేర్కొన్నారు. 'షావుకారు' సినిమాలో అసమాన ప్రతిభ కనబరిచి షావుకారు జానకిగా స్థిరపడ్డారని గుర్తు చేస్తూ, తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో దాదాపు 400 చిత్రాల్లోనే కాకుండా హిందీ, మలయాళ చిత్రాల్లో కూడా నటించి ప్రేక్షకులను మెప్పించారని సిఎం తెలిపారు. పలు మేటి చిత్రాల్లో షావుకారు జానకి పోషించిన పాత్రలు ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలుస్తాయని కొనియాడారు. చలనచిత్ర రంగంలో ఆమె లేని లోటు పూడ్చలేనిదని అన్నారు. ఆమెకు శాంతి చేకూర్చాలని భగవంతుడు ప్రార్థిస్తూ, అమె కుటుంబ సభ్యులకు, అభిమానులకు ముఖ్యమంత్రి సంతాపాన్ని, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

**బి.మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాంతి**


పద్మశ్రీ షావుకారు జానకి గారి మృతి పట్ల టిపిసిసి అధ్యక్షులు బి.మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర దిగ్భ్రాం తి వ్యక్తం చేశారు. దక్షిణ భారత చలనచిత్ర రంగంలో ఏడు దశాబ్దాలకుపైగా తన నటనా ప్రతిభతో ప్రేక్షకులను అలరించిన షావుకారు జానకి మరణం తెలుగు, తమిళ చిత్ర పరిశ్రమలకు తీరని లోటని ఆయన పేర్కొన్నారు.

**షావుకారు జానకి మృతి సినీ రంగానికి తీరని లోటు: కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి**

ప్రముఖ సీనియర్ నటి, పద్మశ్రీ షావుకారు జానకి మృతి పట్ల సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి, విచారం వ్యక్తం చేశారు. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో వందలాది చిత్రాల్లో నటించి తన సహజ నటనతో కోట్లాది మంది ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని కొనియాడారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు, అభిమానులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

**జానకి ఇకలేరనే వార్త ఎంతో బాధ కలిగించింది: చిరంజీవి**

షావుకారు జానకి ఇకలేరనే వార్త ఎంతో బాధ కలిగించిందని మెగాస్టార్ చిరంజీవి ఆవేదన వ్యక్తం చేశారు. 'షావుకారు' చిత్రంతో మొదలైన ఆమె సుదీర్ఘ సినీ ప్రస్థానం తెలుగు, తమిళంతో పాటు పలు భాషల్లో దాదాపు ఏడు దశాబ్దాలపాటు కొనసాగింది. భారతీయ చిత్ర పరిశ్రమకు ఆమె అందించిన సేవలు చిరస్మరణీయం. షావుకారు జానకి ఆత్మకు శాంతి చేకూరాలని

భగవంతుణ్ణి ప్రార్థిస్తూ, వారి కుటుంబ సభ్యులకు, అభిమానులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను అని చిరంజీవి పేర్కొన్నారు.

**షావుకారు జానకి ఆత్మకు శాంతి చేకూరాలి: పవన్ కళ్యాణ్**

ప్రముఖ నటి షావుకారు జానకి కన్నుమూశారని తెలిసి చింతించాను. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నాను అని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, సినీ నటుడు పవన్‌కళ్యాణ్ అన్నారు. సినిమా పేరునే ఇంటి పేరుగా మార్చుకున్న నటి జానకి. షావుకారు జానకి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను అని తెలిపారు.

**తీరని లోటు : తమ్మారెడ్డి భరద్వాజ**

షావుకారి జానకి మరణం ముఖ్యంగా సౌత్ సినిమా ఇండస్ట్రీకి తీరని లోటని ప్రముఖ దర్శక, నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ అన్నారు. ఆమె గొప్పనటి అని చెప్పారు. మొదటి సినిమానే ఆమె ఇంటిపేరుగా మారిపోయిందని తెలిపారు. షావుకారి జానకి ఆత్మకు శాంతి కలగాలని తమ్మారెడ్డి భరద్వాజ ప్రగాఢ సంతాపం తెలిపారు.

**ఆమెకు బాగా నచ్చిన సినిమా 'శ్రీకారం': అంకురం ఉమా మహేశ్వర్ రావు**

షావుకారి జానకి మరణం చాలా కలచి వేసిందని అంకురం సినిమా దర్శకుడు ఉమా మహేశ్వర్ రావు అన్నారు. ఆమె మరణ వార్త విని చాలా బాధ పడ్డానని చెప్పారు. నేను తీసిన శ్రీకారం సినిమా ఆమెకు చాలా ఇష్టమైన సినిమా అని ఒకటి రెండుసార్లు కలిసినప్పుడు చెప్పిందని అన్నారు. ఆమె ఆత్మకు శాంతి కలగాలని, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు.

**ఆమె పాత్రలు గుర్తుండిపోతాయి : జూనియర్ ఎన్టీఆర్**

షావుకారి జానకి మరణం ఎంతో బాధ కల్గించిందని జూనియర్ ఎన్టీఆర్ తన సోషల్ మీడియాలో పేర్కొన్నారు. భారతీయ సినిమా రంగంలో షావుకారు జానకి తనదైన ముద్ర వేశారని అన్నారు. వారి ఆత్మకు శాంతి కలగాలని ప్రతిస్తున్నానని చెప్పారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.


సూపరింటెండింగ్ ఇంజనీర్ కార్యాలయం, వెస్ట్ సర్కిల్, హైదరాబాద్.
తెలంగాణ వైద్య సేవల మరియు మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ (TGMSIDC)
జిల్లా ఆసుపత్రి ప్రాంగణం, కింగ్ కోఠి, హైదరాబాద్ - 500 001.

టెండర్ నోటీసు నం: 04/SE/TGMSIDC/West Cir-Hyd/2026-27/172, తేదీ:21.08.2026

హైదరాబాద్‌లోని కోఠిలో గల DM & HS క్యాంపస్ ప్రాంగణంలో ఉన్న పాత APVVP-2 RCC ఫ్రేమ్డ్ స్ట్రక్చర్ భవనం యొక్క గ్రౌండ్ ఫ్లోర్ మరియు మొదటి అంతస్తుల మరమ్మతులు మరియు పునరుద్ధరణ పనుల కోసం ఇ-ప్రొక్యూర్‌మెంట్ వేదిక ద్వారా టెండర్లు ఆహ్వానించడమైనవి. ఉప-పనులు: A) AV సిస్టమ్ సరఫరా మరియు ఏర్పాటు. B) ఫర్నిచర్ వస్తువుల సరఫరా. ఇతర వివరాలను www.tender.telangana.gov.in వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

సం/-
సూపరింటెండింగ్ ఇంజనీర్

DIPR R.O. No. : 8381-PP/CL/ADVT/2026-27, Date: 21-08-2026

GHMC గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్

టెండర్ నోటీస్

| Sl. No. | NIT No. | ప్రొడక్ట్స్ / పనుల పేరు | బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేదీ / ఆఖరి తేదీ & సమయం | అధికారి పేరు & చిరునామా, సెల్ నెం. |
|---|---|---|---|---|
| 1 | 1/SE/SWM/GHMC/2026-27, తేది: 21.08.2026 | 2026 వినాయక చవితి ఉత్సవాల కోసం GHMCకి 8 అంగుళాలు, 1 అడుగు మరియు 1.5 అడుగుల పరిమాణంలో మట్టి వినాయక విగ్రహాల సరఫరా మరియు పంపిణీకి సంబంధించి, 'L1' ధరను ఖరారు చేయడానికి ఏజెన్సీలను ఎంపిక చేయడం. | బిడ్ డాక్యుమెంట్ డౌన్‌లోడ్ ప్రారంభ తేది: 22.08.2026 ఉ.10.00గం.లకు, ఆఫ్‌లైన్ బిడ్స్ స్వీకరణకు ఆఖరి తేదీ & సమయం: 29.08.2026 ఉ.10.30గం.ల వరకు | ఒ/ఒ. ఎస్ఇ (ఎస్‌డబ్ల్యుఎం), 4వ అంతస్తు, సిసి కాంప్లెక్స్, జిహెచ్‌ఎంసి హెచ్ఒ, ట్యాంక్‌బండ్ రోడ్, హైదరాబాద్. సెల్: +91-8179221424 |

https://www.ghmc.gov.in లోని "downloads" - "Tender Notification" సెక్షన్ నుండి టెండర్ పత్రాన్ని డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

సం/- సూపరింటెండింగ్ ఇంజనీర్ (ఎస్‌డబ్ల్యుఎం), జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 8409-PP/CL/ADVT/2026-27, Date: 21-08-2026

## ఆల్ఫోర్స్ విద్యార్థి జాతీయస్థాయి రాకెట్‌బాల్ పోటీలకు అర్హత




ప్రజాపక్షం / కొత్తపల్లి : ఆల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలకు చెందిన విద్యార్థి జాతీయస్థాయి రాకెట్‌బాల్ పోటీలకు అర్హత సాధించారని ఆల్ఫోర్స్‌విద్యా సంస్థల చైర్మన్ డా.వి.నరేందర్ రెడ్డి అన్నారు. కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇ–టెక్నో పాఠశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు క్రీడల పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని వివిధ క్రీడల పోటీలలో పాల్గొని వారి యొక్క సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని అ న్నారు. ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందిన రాకెట్బాల్ పోటీల లో పాల్గొనడమే కాకుండా ప్రతిభను చాటాలని కోరారు. రాష్ట్రస్థాయిలో నిర్వహించిన ఈ పోటీలలో అసమాన ప్రతిభను చాటి త్వరలో నిర్వహి ం చే జాతీయస్థాయి పోటీలకు ఎంపికవ్వడం చాలా గొప్ప విషయమని అ న్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్, వ్యాయామ ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ధర్మపురిలో ఘనంగా 'నషా ముక్త్ యువ వికసిత్ భారత్' ర్యాలీ




ప్రజాపక్షం/ధర్మపురి : ధర్మపురి పట్టణంలోని మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పురుషుల డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో 'నషా ముక్త్ యువవికసిత్ భారత్ సంకల్ప్ అభియాన్' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు, అధ్యాపక బృందం ధర్మపురి ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహిస్తూ మత్తు పదార్థాల వల్ల కలిగే నష్టాలు,వాటి దుష్ప్రభావాలపై చైతన్యం కల్గించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎలగందుల రాధాకృష్ణన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సిద్దార్థ మల్లే, వైస్ ప్రిన్సిపల్ రేణు ప్రసాంత్,కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎఐటియుసి పెద్దపల్లి జిల్లా నూతన కమిటీ



ప్రజాపక్షం/పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లా ఎఐటియుసినాలుగవ మహాసభలు సుల్తానాబాద్ యశోద నరహరి ఫంక్షన్ హాల్లో జరిగిన సందర్భంగా జిల్లా నూతన కమిటీ 35 మంది కౌన్సిల్, 17 మంది కార్యవర్గం, 9 ఆఫీస్ బేరర్స్. మొత్తం 35 మందితో జిల్లా నూతన కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని ఎఐటియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బాలరాజ్ ప్రకటించారు. అధ్యక్షులుగా కామ్రేడ్ వైవి రావు జిల్లా ప్రధాన కార్యదర్శిగా కామ్రేడ్ కదారి సునీల్ వర్కింగ్ ప్రెసిడెంట్ గా కామ్రేడ్ పూసల రమేష్ ఉపాధ్యక్షులుగా కే రాజారత్నం జూపాక రామచందర్.సహాయ కార్యదర్శులుగా నాంసాని శంకర్ శనిగరపు చంద్రశేఖర్ నూనేటి రాధమ్మ. కోశాధికారిగా రెడ్డపాక లక్ష్మ ణ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని కామ్రేడ్ బాలరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

## ఎరువుల పంపిణీలో నూతన విధానం

ప్రజాపక్షం/ముత్తారం : రైతులకు ఎరువుల పంపిణీని మరింత పారదర్శకంగా, సులభతరంగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వం సరికొత్త డిజిటల్ విధానాన్ని తీసుకు వచ్చిందని మండల వ్యవసాయ అధికారి అనూష ఒక ప్రకటన ద్వారా తెలిపారు.''ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్''పేరుతో రూపొందించిన ప్రత్యేక యాప్ ద్వారానే ఇకపై ఎరువుల పంపిణీ జరగనుంది.దేశవ్యాప్తంగా అమలు చేయనున్న ఈ నూతన విధానంలో భాగంగా,ముత్తారం మండలంలోని రైతులకు ఆగస్టు 21 నుండి పూర్తిగా ఈ ఎఫ్.ఎఫ్.ఎస్ యాప్ ద్వారానే ఎరువులను పంపిణీ చేయనున్నారు. రైతుల అవసరాలకు అనుగుణంగా,ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు అందించడమే ఈ డిజిటల్ విధానం ముఖ్య ఉద్దేశమని మండల వ్యవసాయ అధికారి అనూష అన్నారు.

## నాంపల్లి గుట్టపై పనులు పరిశీలించిన కలెక్టర్



ప్రజాపక్షం/వేములవాడ: వేములవాడ అర్బన్ మండలం నాంపల్లిగుట్టపై వేములవాడ టెంపుల్ ఏరియా డెవలప్మెంట్ అథారిటీ విటిఎడిఎ ఆధ్వర్యంలో చేపడుతున్న సుందరీకరణ పనులను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ శుక్రవారం పరిశీలించారు.విటిఎడిఎఆధ్వర్యంలో నాంపల్లి గుట్టపై ఇండియన్ ఎయిర్ ఫోర్స్ విమానం ఏర్పాటు చేసేందుకు ఇప్పటికే ఇక్కడికి తరలించారు. విమానం ఏర్పాటు చేసే, ఇతర సుందరీకరణ పనులు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆ పనులను పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు. విమానం ఏర్పాటు, సుందరీకరణ పనులను గడువులోగా పూర్తి చేసి.. భక్తులు, పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. నాంపల్లి గుట్టపై ఉన్న శ్రీ లక్ష్మి నరసింహస్వామి ఆలయంలో జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ప్రత్యేక పూజలు చేశారు. వేములవాడ ఆర్‌డిఒ కెఎస్ బి కుమారి, తహసీల్దార్ , అధికారులు, సిబ్బంది ఉన్నారు.

## జిఒ 97 రద్దు కోసం నిరసన



ప్రజా పక్షం/ వేములవాడ టౌన్: జీవో 97ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ వేములవాడ అర్బన్ మండలంలోని అగ్రహారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల వద్ద బిఆర్ఎస్‌వి నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. కళాశాల ప్రాంగణంలోకి వెళ్లేందుకు యత్నించిన విద్యార్థి నాయకులను ప్రిన్సిపాల్, పోలీసులు నిరోధించడంతో వారు కళాశాల ఎదుట రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ క్రమంలో ఆందోళన చేస్తున్న బిఆర్ఎస్‌వి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని వేములవాడ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం నిరసన తెలిపిన తమను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం అగ్రహారం పాలిటెక్నిక్ కళాశాల బంద్‌కు పిలుపునిస్తున్నట్లు బిఆర్ఎస్‌వి ప్రతినిధులు తెలిపారు. కాగా, పోలీస్ స్టేషన్‌లో ఉన్నబిఆర్ఎస్‌వి నాయకులను వేములవాడ పట్టణ బిఆర్ఎస్ నాయకులు పరామర్శించి, వారి విడుదల గురించి పోలీసులతో మాట్లాడారు.

# లబ్ధిదారులకు మౌలిక వసతులు కల్పిస్తాం

### లబ్ధిదారులతో కలిసి నూతన గృహప్రవేశం చేసిన మంత్రులు పొంగులేటి ,అడ్లూరి





ప్రజాపక్షం/జగిత్యాల : నూకపల్లి 2బిహెచ్‌కె గృహ సముదాయంలో నివసిస్తున్న లబ్ధిదారులకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పించి, వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రెవెన్యూ,గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.శుక్రవారం జగిత్యాల పట్టణ సమీపంలో ఉన్న నూకపల్లి 2బిహెచ్‌కె గృహ సముదాయాన్ని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి, వయోవృద్ధులు,వికలాంగుల, ట్రాన్స్‌జెండర్ సాధికారిత శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్‌తో కలిసి పొంగులేటి సందర్శించారు. ఈ సందర్భంగా మిషన్ భగీరథ ట్యాంక్ పైకి వెళ్లి అక్కడి నుంచి నూకపల్లి గృహ సముదాయాన్ని పరిశీలించిన అనంతరం మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి లబ్ధిదారులతో కలిసి నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి కాలనీలో ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకుని మాట్లాడారు.నూకపల్లి 2బీహెచ్‌కే కాలనీలో ఇళ్లతో పాటు అవసరమైన మౌలిక వసతుల పనులను కూడా చేపట్టినట్లు మంత్రి తెలిపారు. 4,000 ఇళ్ల ప్రాంతంలో సెప్టిక్ ట్యాంకులు, సీవరేజ్ లైన్లు, సిసి రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణ పనులు పూర్తి చేసినట్లు తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టిన సిసి రోడ్లు, డ్రెయిన్ల పనులకు రూ.5 కోట్లు మంజూరు చేసి రూ.4 కోట్లు వ్యయం చేసినట్లు వివరించారు.రోడ్లు, సెల్ టవర్, నీటి వసతులు, పాఠశాల, ఆసుపత్రి వంటి అవసరమైన మౌలిక సదుపాయాలను మూడు నెలల్లోగా అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు చేపడతామని మంత్రి హామీ ఇచ్చారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కేంద్రంలో ఉన్న చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. చిన్నారులకు మెరుగైన వాతావరణం కల్పించేలా అవసరమైన సౌకర్యాలను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రమణ, ఎమ్మెల్యేలు సంజయ్ కుమార్,మెడిపెల్లి సత్యం,వెలమ కార్పొరేషన్ చైర్మన్ నర్సింగరావు, కలెక్టర్ సత్యప్రసాద్ తదితరులు ఉన్నారు.

### నూతన ప్రభుత్వ కార్యాలయాలతో ప్రజలకు మెరుగైన సేవలు

నూతనంగా మంజూరైన ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణంతో ప్రజలకు మెరుగైన, వేగవంతమైన సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని మంత్రి పొంగులేటి అన్నారు. శుక్రవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని ధరూర్ క్యాంప్‌లో నూతనంగా మంజూరైన పలు ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణానికి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మంత్రి అడ్లూరి లక్ష్మ ణ్ కుమార్,జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్,సి.సి.ఎల్. ఎ. కమిషనర్ లోకేష్ కుమార్, స్పెషల్ సెక్రటరీ స్టాంప్స్ , రిజిస్ట్రేషన్ శాఖ రాజీవ్ గాంధీ హనుమంతు, ఎం .డి. హౌసింగ్ గౌతం, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ లతో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జగిత్యాల,మెట్ పెల్లి రెవెన్యూ డివిజనల్ కార్యాలయాల భవన నిర్మాణానికి రూ.2.25 కోట్ల చొప్పున, భీమారం, ఎండపెల్లి తహసీల్దార్ కార్యాలయాల భవన నిర్మాణానికి రూ.2.25 కోట్ల చొప్పున అంచనా వ్యయంతో, మాల్యాల, మెట్ పెల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల భవన నిర్మాణానికి రూ.1.40 కోట్ల అంచనా మొత్తంగా ఆరు ప్రభుత్వ కార్యాలయ భవనాల నిర్మాణానికి రూ.11.80 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. నూతన భవనాల నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు. జిల్లాలో పరిపాలనా సౌకర్యాలను మరింత బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు పారదర్శకమైన, సమర్థవంతమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాల్లో శాసన మండలి సభ్యుడు ఎల్ .రమణ, చొప్పదండి శాసనసభ్యుడు మేడిపెల్లి సత్యం,వెలమ సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్ జువ్వాడి నర్సింగారావు, అదనపు కలెక్టర్ లు లత,రాజ గౌడ్,జగిత్యాల జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంఘనభట్ల దినేష్,సుడా చైర్మన్ కోమటి రెడ్డి,నరేందర్ రెడ్డి,తదితరులు ఉన్నారు.

## మానసిక వికలాంగుల పాఠశాలలో ఉచిత నేత్ర వైద్య శిబిరం

### ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి



ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్ జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్టు ఆధ్వర్యంలో ఎల్.ఎం.డి కాలనీలో మహాత్మా నగర్ గ్రామపంచాయతీ పరిధిలో నిర్వహించబడుతున్న మానసిక వికలాంగుల ప్రత్యేక పాఠశాలలో నేడు ఎల్.వి. ప్రసాద్ కంటి ఆసుపత్రి వారిచే ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి తెలిపారు. ఈ అవకాశాన్ని చుట్టుపక్కల ప్రజలంతా ఉపయోగించుకోవాలని ట్రస్ట్ చైర్మన్,మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి తెలిపారు. ట్రస్ట్ పాఠశాలలో వెంకటరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుల ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న మానసిక వికలాంగుల పాఠశాల ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, ఈ శిబిరాన్ని చు ట్టుపక్కల ప్రజలే కా కుండా విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు ఉపయోగించుకోవాలని వెంకటరెడ్డి కోరా రు. ఈ కా ర్యక్రమానికి ముఖ్యమం త్రి కార్యాలయంలో ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేస్తున్న వేముల శ్రీనివాస్, జిల్లా క లెక్టర్, నిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ రాహుల్, జిల్లా సంక్షేమ అధికారితో పాటు ఇ తర అధికారులు ప్రజా ప్రతినిధు లుపాల్గొంటారని తెలిపారు.

## వేగంగా పెండింగ్ భూసేకరణ పూర్తి

### రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి



ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల : రాష్ట్రంలో నీటిపారుదల ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్‌లో ఉన్న భూ సేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాల ని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమా ర్ రెడ్డి జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. నీటి పారుద ల ప్రాజెక్టుల పరిధిలో పెండింగ్ భూసేకరణపై రా ష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం ఉదయం హైదరాబాద్ నుంచి అన్ని జి ల్లాల కలెక్టర్లు, నీటి పారుదల శాఖ అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష ని ర్వహించారు. జిల్లా సమీకృత కార్యాలయాల స ముదాయం నుంచి జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరయ్యారు.

**పనులు పూర్తి చేయాలి..**

జిల్లాలో శ్రీ పాద ఎల్లంపల్లి, మధ్య మానేరు, కాళేశ్వరం ప్రాజెక్టులకు సంబంధించిన పెండింగ్ భూ సేకరణ పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ గ రిమ అగ్రవాల్ ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఆర్‌డిఒలు శ్రీధర్ బాబు, కెఎస్ బి కుమా రి, జిల్లా నీటి పారుదల శాఖ అధికారి దయాకర్, ఎస్‌డిసి శ్రీనివాస్, ఇరిగేషన్ అధికారి ప్రశాంత్, కలెక్టరేట్ పర్యవేక్షకులు శ్రీకాంత్ పాల్గొన్నారు.

## కమ్యూనిటి పోలీసింగ్ బలోపేతం కోసం' మన పోలీస్,మన ఊరు'

### సిద్దిపేట పోలీస్ కమిషనర్ రశ్మీ పెరుమాళ్



ప్రజాపక్షం/ సిద్దిపేట : ప్రజలకు, పోలీసులకు మధ్య దూరాన్ని తగ్గించి, కమ్యూనిటీ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా సిద్దిపేట పోలీస్ శాఖ ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ''మన పోలీస్, మన ఊరు''కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట పోలీస్ కమిషనర్ రష్మి పెరుమాళ్ శుక్రవారం సిద్దిపేట త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వెల్కటూరు గ్రామాన్ని.. సందర్శించారు. ఈసందర్భంగా సిపిరష్మీ పెరుమాళ్ మాట్లాడుతూడబ్బులు ఇస్తే ప్రభుత్వ ఉద్యోగం ఇప్పిస్తామని ఎవరైనా చెప్తే నమ్మకండి, అది పూర్తిగా మోసం అని తెలిపారు. ఫోన్లలో ఉచిత బహుమతులు అని వచ్చే లింకులను ఎట్టి పరిస్థితుల్లోనూ క్లిక్ చేయవద్దు అని, ఒకవేళ పొరపాటున క్లిక్ చేస్తే వెంటనే 1930 సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ సంఖ్యకు కాల్ చేసి ఫిర్యాదు చేస్తే మీ డబ్బును ఫ్రీజ్ చేసే అవకాశం ఉంటుందని సిపి పేర్కొన్నారు. స్మార్ట్‌ఫోన్‌ను కేవలం జ్ఞానాన్ని పెంచుకోవడానికి, ఆన్‌లైన్ ఈలైబ్రరీ ద్వారా చదువుకోవడానికి మాత్రమే ఉపయోగించండి అని సూచించారు. ఆడపిల్లలపై ఎలాంటి వివక్ష చూపకూడదు, వారి కలలను, ప్రతిభను గుర్తించి తల్లిదండ్రులు ప్రోత్సహించాలి అని విజ్ఞప్తి చేశారు . సైబర్ క్రైమ్, డ్రగ్స్ రహిత సురక్షిత సిద్దిపేట నిర్మాణంలో పోలీసు శాఖకు ప్రజలందరూ సహకరించాలి. పోలీసు శాఖ ఎల్లప్పుడూ మీకు అందుబాటులో ఉంటుంది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు డిసిపి అడ్మిన్ కుశాల్కర్ గారు, అదనపు డీసీపీ ఎఆర్ సుభాష్ చంద్రబోస్ గారు , సిద్దిపేట ఏసిపి రవీందర్ రెడ్డి, సిద్దిపేట త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ లక్ష్మి బాబు పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో కౌలు రైతు మృతి



ప్రజాపక్షం /జగిత్యాల రూరల్ : వ్యవసాయ పొలానికి నీరు పెట్టేందుకు వెళ్లిన కౌలు రైతు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై బావిలో పడి మృతి చెందిన విషాద ఘటన మోతె గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. మోతె గ్రామానికి చెందిన చిర్ర సత్తయ్య (50), తండ్రి రోశయ్య, కౌలు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం ఉదయం సుమారు 9 గంటల సమయంలో పొలానికి నీరు పెట్టేందుకు వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. అయితే 11 గంటల వరకు ఇంటికి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన అతని భార్య చిర్ర పోచవ్వ బావి వద్దకు వెళ్లి వెతికింది. అక్కడ సత్తయ్యకు చెందిన సెల్‌ఫోన్ బావి గడ్డ పక్కన కనిపించడంతో వెంటనే బంధువులకు సమాచారం అందించింది.సమాచారం అందుకున్న జగిత్యాల రూరల్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్ల సహాయంతో బావిలో గాలింపు చేపట్టగా కొద్దిసేపటి అనంతరం సత్తయ్య మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పరిశీలించగా కుడి కా లుకు విద్యుత్ షాక్ తగిలిన ఆనవాళ్లు, కాలి వేళ్ల మధ్య కాలిన గాయం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. విద్యుత్ శాఖ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించగా బావి వద్ద ఉన్న విద్యుత్ మోటార్‌కు విద్యుత్ సరఫరా జరుగుతున్నట్లు నిర్ధారించారు.దీంతో విద్యుత్ షాక్‌కు గురై సత్తయ్య బావిలో పడిపోయి మృతి చెందినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు సత్తయ్యకు భార్యతో పాటు ఒక కుమారుడు,ఒక కుమార్తె ఉన్నారు.

## హత్య కేసులో ఒకరికి జీవిత ఖైదు

ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్ జిల్లా దేశరాజ్‌పల్లి గ్రామంలో 2023 మార్చి 13న జరిగిన మామిడిపల్లి అనిత, 50 అనే మహిళా హత్య కేసులో రామడుగు మండలం తిరుమలాపూర్ కు చెందిన నిందితుడు ఏ1 తాడగొండ దామోదర్ (34) (ప్రస్తుతం కిసాన్‌నగర్) కరీంనగర్ డిజె కోర్టు జీవిత ఖైదుతో పాటు రూ.3 వేల జరిమానా విధించింది. ఇదే కేసులోకరీంనగర్ రూరల్ మండలం దుర్శేడ్ గ్రామానికి జాంబోజి శివ కుమార్ (ఏ2)ని కోర్టు నిర్దోషిగా ప్రకటించింది. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం, మృతురాలు పగటి సమయంలో ఇంట్లో ఒంటరిగా ఉంటుందనే విషయాన్ని తెలుసుకున్న ఏ1 తాడగొండ దామోదర్ తనకు , ఏ2 జాంబోజి శివ కుమార్‌కు డబ్బు అవసరం ఉండటంతో మృతురాలి వద్ద రూ. 30 వేలు అప్పుగా ఇవ్వాలని కోరాడు. ఆమె డబ్బు ఇవ్వడానికి నిరాకరించడంతో, ఆమెను హత్య చేసి బంగారు ఆభరణాలు దోచుకోవాలని నిందితులు పథకం రూపొందించినట్లు కేసు దర్యాప్తులో వెల్లడైంది.2023 మార్చి 13న మృతురాలి ఇంటికి వెళ్లిన ఏ1 తాడగొండ దామోదర్, ఏ2 జాంబోజి శివ కుమార్‌లు ఆమెను హత్య చేసి, ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలు, ఇతర వస్తువులను తీసుకుని అక్కడి నుంచి పరారైనట్లు ప్రాసిక్యూషన్ కోర్టుకు వివరించింది. ఈ కేసులో నేరాన్ని నిరూపించేందుకు పోలీసుల తరపున సమర్థవంతమైన దర్యాప్తు, ఆధారాల సేకరణ చేపట్టారు. కోర్టులో ప్రాసిక్యూషన్ తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్యాల ప్రతాప్ వాదనలు వినిపించారు. దర్యాప్తు ,సిసిఆర్బి ఎసిపి శ్రీనివాస్ ఆధ్వర్యంలో కోర్టు ప్రక్రియలో కోర్టు డ్యూటీ అధికారి శ్రీధర్ (రామడుగు), ఎఎస్సై సత్తయ్య, సిఎంఎస్ తదితరులు సమన్వయంతో విధులు నిర్వహించారు. కేసును విచారించిన పిడీజే కోర్టు న్యాయమూర్తి ఎస్. శివకుమార్ తీర్పు వెలువరించారు. ఏ1 తాడగొండ దామోదర్‌కు జీవిత ఖైదుతో పాటు రూ.3 వేలు జరిమానా విధించగా, ఏ2 జాంబోజి శివ కుమార్‌ను నిర్దోషిగా విడుదల చేశారు. నేర నిరూపణలో సమర్థవంతమైన దర్యాప్తు, పకడ్బందీ ఆధారాల సేకరణకు కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బంది మరియు ప్రాసిక్యూషన్ బృందాన్ని పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం అభినందించారు.

## భావితరాలకు ఆదర్శంగా నిలిచేలా అభివృద్ధి

### అసెంబ్లీ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు



ప్రజాపక్షం / కొత్తపల్లి : కరీంనగర్ నియోజకవర్గంలోని అన్ని గ్రామాలను కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చేసి భావి తరాలకు ఆదర్శంగా నిలిచేలా తీర్చిదిద్దుతానని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్ రావు అన్నారు. శుక్రవారం కరీంనగర్ రూరల్ మండలం జూబ్లీనగర్‌లో సిసి రోడ్డు నిర్మాణ పనులకు గ్రామ సర్పంచ్ సుద్దాల కమలాకర్ గౌడ్, ఉప సర్పంచ్ కచ్చు రజితతో కలిసి శంకు స్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకురల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధిపై తనకు పూర్తి స్పష్టత ఉందన్నారు. గ్రామాలను అభివృద్ధి చేయడమే కాకుండా చిరస్థాయిలా గుర్తుండిపోయేలా ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని అన్నారు.సర్పంచ్‌లు ఏ అవసరం ఉన్నా తనను సంప్రదిస్తే చెప్పిన పనిని త్వరగా చేసిపెడతానని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి గ్రామాల అవసరాలను తీసుకెళ్లి పెద్దఎత్తున నిధులు సాధించి మౌళిక వసతులను మెరుగుపరిచేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కా ర్యక్రమంలో ఎఎంసి చైర్మన్ ఆకుల నరసన్న, బోగోండ ఐల య్య, బొద్దుల లక్ష్మి నారాయణ, తిరుపతి రెడ్డి, జగ్గాని కనుకయ్య, జక్కం నర్సయ్య, గంగయ్య, మీసాల శంకర్, దావు మల్లయ్య, కాశిపాక రాకేశ్, అనంతుల రమేశ్, మూల కృష్ణారెడ్డి, అట్టెపు వేణు, పోరండ్ల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆడుతున్న ప్రభుత్వం

### ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్



ప్రజాపక్షం/కరీంనగర్: తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన ది యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ద్వారా ప్రభుత్వ సాంకేతిక విద్యను ప్రైవేటీకరించే ప్రయత్నం చేయవద్దని, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీకి అప్పగించవద్దని, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ లో ఐటిఐ, ఎటిసిలతో కలిసి డిప్లొమా కోర్సులను అనుసంధానం చేసే విధంగా ప్రభుత్వం తీసుకువచ్చిన జిఒనెంబర్ 97 ను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లాటరల్ ఎంట్రీ విధానం రద్దు చేయవద్దని ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మచ్చ రమేష్ మాట్లాడుతూ మాట్లాడుతూ స్కిల్ యూనివర్సిటీ పేరిట కొత్త పాలసీ తీసుకువచ్చి ప్రభుత్వ పాలిటెక్నిక్ విద్యను నిర్వీర్యం చేసే కుట్ర సరికాదని, దీని ద్వారా పాలిటెక్నిక్ విద్యావ్యవస్థ పూర్తిగా అధ్యాపకుల నియామకాల నుంచి మొదలుకొని అడ్మిషన్ల వరకు కూడా మొత్తం ప్రైవేట్ కార్పొరేట్ శక్తుల్లోకి వెళుతుందని, పాలిటెక్నిక్ కాలేజీలను సాంకేతి క విద్యాశాఖ పరిధి నుంచి తొలగించి, ఉద్యోగులను శక్తి శాఖలో విలీనం చేస్తే ఇంజనీరింగ్ కాలేజీలు అనుమతులెలా ఇస్తారని ప్రశ్నించారు. అదే విధంగా లాటరల్ ఎ ంట్రీ విధానంతో పాలిటెక్నిక్ పూర్తి చేసిన విద్యార్థులకు ఇంజనీరింగ్ లో 2వ సంవత్సరంలోకి అవకాశం ఉండేద ని, దీనితో పాలిటెక్నిక్ 3 సంవత్సరాలు, ఇంజనీరింగ్ 3 సంవత్సరాలు మొత్తం 6 సంవత్సరాలలో ఇంజినీరింగ్ పూర్తి అయ్యేదని, కానీ లాటరల్ ఎంట్రీ విధానం రద్దు చే స్తే 7 సంవత్సరాల్లో ఇంజనీరింగ్ చదవాల్సి ఉంటుందని ఆందోళన వ్యక్తం చేశారు. దశాబ్దాలుగా పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు తక్కువ ఖర్చుతో నాణ్యమైన సాంకేతిక విద్యను అందిస్తున్న ప్రభుత్వ పాలిటెక్నిక్ వ్యవస్థను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, దీనికి వ్యతిరేకంగా నిర్ణయం తీసుకోవడం సరికాదని ప్రశ్నించారు? ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో తక్కువ ఫీజుతో విద్య ను అందిస్తున్నప్పుడు వాటికి అవసరమైన నిధులు, ల్యా బ్‌లు, సిబ్బంది కల్పించకుండా కొత్తగా ప్రభుత్వ రం గాన్ని ప్రైవేట్ వ్యవస్థలో విలీనం చేయడానికి ఎందుకు ప్రోత్సహిస్తున్నారనీ, స్కిల్ యూనివర్సిటీ కౌన్సిల్ లో ఏ డుగురు కూడా పారిశ్రామిక వేత్తలు ఉన్నారని, వారే ప్ర భుత్వ విద్యను అందులో పాలిటెక్నిక్ విద్యను వ్యాపారమాయం చేసే కుట్ర చేస్తున్నారని, ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన పాలసీ ద్వారా విద్యార్థులు కార్మికులుగా మారే అవకాశం ఉందని, వేలాది మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాసి పాలిటెక్నిక్ లో జాయిన్ అవుతే నేడు ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని చూసి విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారని, లక్షలాది మంది విద్యార్థులు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో చదువుతున్నారని ప్రభుత్వం వారికి అధిక సదుపాయాలు కల్పించి, అధ్యాపకుల భర్తీ, ల్యాబ్ ల ఆధునీకరణ, వర్క్ షాప్ ల నిర్వహణ, హాస్టల్ అభివృద్ధి చేయాలి కానీ ప్రైవేటీకరణ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయడం సరికాదని, వెంటనే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేయాలని, జీవో నెంబర్ 97 ను వెంటనే వెనక్కి తీసుకోవాలని, లాటరల్ ఎంట్రీ విధానం రద్దు చేయవద్దని, పాలిటెక్నిక్ కాలేజీలను సాంకేతిక విద్యాశాఖ పరిధి నుంచి తొలగించి, ఉద్యోగులను శక్తిశాఖలో విలీనం చేయవద్దని, పాలిటెక్నిక్ కళాశాలలనుయంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ కి అనుసంధానం చేయద్దని డిమాండ్ చేశారు. లేని పక్షంలో విద్యార్థుల ఆగ్రహనికి ప్రభుత్వం గురికాక తప్పదని మచ్చ రమేష్ హెచ్చరించారు.

## ఎసిబి వలలో పంచాయతీ కార్యదర్శి



ప్రజాపక్షం/జన్నారం : ఇంటి నిర్మాణ అనుమతి కోసం లంచం తీసుకు ంటూ లింగయ్యపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి ఎసిబి అధికారులకు పట్టుబడ్డారు. శుక్రవారం ఆదిలాబాద్ ఎసిబి డిఎస్‌పి జి. మ ధు ఆధ్వర్యంలో అధికారులు దాడి చేసి ఆమెను అదుపులోకి తీసుకున్నారు. లింగయ్యపల్లి గ్రామానికి చెందిన సందేవేణి తిరుపతి ఇంటి ని ర్మాణ అనుమతి కోసం దరఖాస్తు చేసుకోగా, పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి రూ.15 వేలు లంచం డిమాండ్ చేశారు. బాధితుడు ఎసిబి అధికారులను ఆశ్రయించగా, వారి సూచనల మేరకు కార్యదర్శి సూచించిన మరో వ్య క్తికి ఫోన్‌పే ద్వారా రూ.13 వేలు బదిలీ చేశారు.పంచాయతీ కార్యాలయానికి చేరుకున్న ఎసిబి అధికారులు రికార్డులను పరిశీలించి కార్యదర్శి వరలక్ష్మి ని అదుపులోకి తీసుకున్నారు.అధికారులు ఎవరైనా లం చం డిమాండ్ చేస్తే ఎసిబి అధికారులను సంప్రదించాలని, సమాచారం ఇచ్చిన వివరాలను గోప్యంగా ఉంచుతామని డిఎస్‌పి మధు తెలిపారు.

## నేడు ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక

ప్రజాపక్షం / మందమర్రి : మండలంలో చేపట్టిన ఉపాధి హామీ పనుల 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక శనివారం జరగనుందని ఎంపిడిఒ ఎన్.రాజేశ్వర్ తెలిపారు. 10 గ్రామ పంచాయతీల్లో చేపట్టిన పనులపై బృందాలు క్షేత్రస్థాయి పరిశీలన పూర్తి చేశాయని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో వెలుగుచూసిన అంశాలు, రికార్డులపై చర్చించేందుకు శనివారం ఉదయం 10 గంటలకు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పంచాయతీ కార్యదర్శులు, సాంకేతిక, ఫీల్డ్ సహాయకులు తప్పనిసరిగా హాజరుకావాలని స్పష్టం చేశారు. పథకం అమలులో పారదర్శకత కోసమే ఈ ప్రజావేదిక ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

## గిరిజన గ్రామాల అభివృద్ధికి చర్యలు



ప్రజాపక్షం/తిర్యాణి/ ఆసిఫాబాద్ రూరల్ : మారుమూల గిరిజన గ్రామాల సమస్యల పరిష్కారానికి, మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటామని ఉట్నూర్ ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి మంద మకరందు తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని పలు మారుమూల గ్రామాల్లో విస్తృతంగా పర్యటించి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దంతన్‌పల్లి గ్రామాన్ని సందర్శించిన పిఓకు గతంలో ముంపునకు గురైన ఆశ్రమ పాఠశాలను తిరిగి ప్రారంభించాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన ఆయన పాఠశాల పునరుద్ధరణపై సమగ్ర నివేదిక ఇవ్వాలని డిడిని ఆదేశించారు. పంగడి మాదన ఆశ్రమ పాఠశాలను సందర్శించి పదో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థుల ప్రతిభను మెరుగుపరిచేందుకు నెల రోజుల ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. తర్వాత చింతల మాదార జలపాతం పరిసర ప్రాంతాలను పరిశీలించి స్థానికుల సమస్యలను తెలుసుకున్నారు. ఐటిడిఎ డిడి జాదవ్ అంబాజీ, ఎసిఎంఒ ఉద్ధవ్, ఎంపిడిఒ, తహసీల్దార్, సర్పంచ్ రాధాబాయి, ఉపాధ్యాయులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌తోనే ప్రజా సంక్షేమం, అభివృద్ధి

### డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణ

ప్రజాపక్షం/వాంకిడి: కాంగ్రెస్ పార్టీతోనే ప్రజా సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని నమ్మి ఇతర పార్టీల నాయకులు పెద్ద సంఖ్యలో కాంగ్రెస్‌లో చేరుతున్నారని డిసిసి అధ్యక్షురాలు ఆత్రం సుగుణ అన్నారు. శుక్రవారం వాంకిడి మండలం గణేష్‌పూర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో గొయగావ్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు షేక్ జమీర్, షేక్ నబి, షేక్ ఖాజా, సైద్ జలాని, షేక్ ఎస్. షిప్, ఫెరోజ్, దినేష్, చంద్, రఫీక్, వాజీద్, మొహమ్మద్ ఖాన్‌లతో పాటు సుమారు 100 మంది కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి ఆత్రం సుగుణ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గురునులే మెంగాజీ, మాజీ అధ్యక్షుడు గురునులే నారాయణ, డిసిసి ఉపాధ్యక్షులు తారీఖ్, భీమ్రావ్, సెల్వట్కర్ పెంట్టు, కడప మారుతి, జాడే ప్రభాకర్, సామల రమేష్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ డికొండ మహేష్, టౌన్ ప్రెసిడెంట్ ధన్వల్కర్ కమలేష్, మండల కార్యదర్శి ఉపే ధర్మాజీ, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉప్పుల కృష్ణ, సీనియర్ నాయకులు చిదుపూడి వెంకట్‌రెడ్డి, దుర్గం హంసరాజ్, శంకర్, కోబ్రాగాడే విలాస్, బోట్టిపెల్లి జైరామ్, పందిర్ల గుండయ్య, సర్పంచులు బెండారే కృష్ణాజీ, జబ్రే గణేష్, వడుగురే సంతోష్, సెద్మకి అమృత అంబారావు, పోలే జ్యోతి పత్రు, ఉప సర్పంచ్ దీపక్ ముండే పాల్గొన్నారు.

## అడల్లి భూముల అన్యాక్రాంతంపై సర్వే

### ఆలయానికి ప్రభుత్వ భూమికేటాయించాలని వినతి



ప్రజాపక్షం/సారంగాపూర్ : ప్రసిద్ధిగాంచిన శ్రీ అడల్లి మహా పోచమ్మ ఆలయ భూములు గత కొంతకాలంగా ఆక్రమిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నా యి. గతంలో ఆలయానికి విరాళంగా ఇచ్చిన భూములు తమ వారసులు ఆక్రమించుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇట్టి భూముల్లో కొందరు నిర్మాణాలు కూడా చేపట్టినట్టు తెలుస్తోంది.ఆలయానికి ప్రతివారం ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల నుండే కాకుండా పొరుగున ఉన్న మహారాష్ట్ర నుండి కూడా భక్తులు దాదా పు 20 నుండి 30 వేల మంది దర్శనం చేసుకుంటారు.దీనిపై సర్వే నిర్వహించి ఆలయ భూములు కాపాడాలని అధికారులకు వినతులు అందాయి. మండల సర్వేయర్ యువన్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ నరసయ్య, జిపిఓ వరలక్ష్మి సిబ్బంది ఉన్నారు.

**ఆలయానికి రెవెన్యూ భూమిని కేటాయించాలి :** శ్రీ మహా పోచమ్మ ఆలయానికి పెరుగుతున్న భక్తుల రద్దీ దృష్ట్యా ఆలయానికి గల ఎడమవైపున ఉన్న రెవెన్యూ భూమి8.20 ఎకరాలను కేటాయించాలని కోరుతూ ఈవో భూమయ్య తహసిల్దార్ విజయకాంత్ రావుకు వినతి పత్రం అందజేశారు.

## రూపారెడ్డి హత్య హేయమైన చర్య

### ఎఐటియుసి జిల్లా కార్యదర్శి గడపాలి పరమేష్

ప్రజా పక్షం/భైంసా : నల్గొండ జిల్లా కొండమల్లేపల్లిలోని నాగార్జున పాఠశాల ప్రిన్సిపాల్ రూపారెడ్డి మేడమ్ హత్యను నిరసిస్తూ ఎఐటియుసి నిర్మల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్మల్ పట్టణంలోని SC బాలుర వసతి గృహంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి, ఆమెకు ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు.ఈ నెల 11న ప్రిన్సిపల్ రూపారెడ్డి హత్యకు గురవడం పట్ల తీవ్ర దిగ్భ్రాంతి, నిరసన వ్యక్తం చేశారు.సమాజానికి విద్యాబుద్ధులు నేర్పిస్తూ, భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయురాలిపై ఇటువంటి అమానుష దాడి జరగడం అత్యంత హేయమైన చర్య అని ఆయన తీవ్రంగా ఖండించారు.ఈ ఘటనకు బాధ్యులైన నిందితులను పోలీసులు వెంటనే గుర్తించి,చట్టపరంగా శిక్షించాలని డిమాండ్ చేశారు



## నిర్మల్ నియోజకవర్గంలో రహదారుల అభివృద్ధికి

# రూ.12 కోట్లతో ప్రతిపాదనలు

### రూ.2 కోట్ల నిధులు మంజూరు



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : నిర్మల్ నియోజకవర్గాన్ని రహదారుల పరంగా మోడల్ ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకత్వం ముమ్మర యత్నాలు చేస్తోంది. మౌలిక వసతుల కల్పనలో భాగంగా గ్రామీణ, ప్రధాన రహదారుల అభివృద్ధికి రూ.12 కోట్లతో ప్రతిపాదనలు సమర్పించడంతో పాటు, రూ.2 కోట్ల విలువైన పనులకు ఇప్పటికే నిధులు మంజూరు చేయించడంలో నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి కూచాడి శ్రీహరి రావు కీలక పాత్ర పోషించారు.నిర్మల్ నియోజకవర్గంలోని వాడ్యాల్ లక్ష్మణ్ చందా ప్రధాన రహదారి అభివృద్ధి, విస్తరణ పనుల కోసం రూ.10 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన నివేదికను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి శ్రీహరి రావు సమర్పించారు. కనకాపూర్ ఎక్స్‌రోడ్ నుంచి కామల్కోట వద్ద ఉన్న గోదావరి వంతెన మీదుగా జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలను కలిపే ఈ రహదారి అత్యంత ప్రాధాన్యమైనదని తెలిపారు. ఇందులో లక్ష్మణచందా పరిధిలోని కనకాపూర్ చింతల్‌చందా రహదారి విస్తరణకు రూ. 4.80 కోట్లు, వాడ్యాల్ పరిధిలోని పనులకు రూ.4 కోట్లు, వాడ్యాల్ గ్రామ పరిధిలో కొత్త బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.2 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు అందించారు. ప్రజల రాకపోకల కష్టాలను తీర్చేందుకు ఈ నిధులను త్వరితగతిన మంజూరు చేసి పనులకు అనుమతులు ఇవ్వాలని మంత్రిని కోరారు.మరోవైపు జాతీయ రహదారి ఎన్‌హెచ్44 నుంచి మేడిపల్లి గ్రామానికి వెళ్లే రహదారి అభివృద్ధికి రూ.2 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో రహదారిని డబుల్ లైన్‌గా విస్తరించడంతో పాటు మధ్యలో సెంటర్ లైటింగ్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. నిధులు మంజూరు చేసినందుకు నిర్మల్ కాంగ్రెస్ ఇన్‌చార్జ్ కూచాడి శ్రీహరి రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీమ్ రెడ్డి గార్లు మంత్రి కొమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని కలిసి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు ప్రారంభిస్తామని నేతలు స్పష్టం చే శారు.అదేవిధంగా మామడ మండలంలోని జై రాం తాండా గ్రామానికి బీటీ రోడ్డు నిర్మించాల ని కోరుతూ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్కకు శ్రీహరి రావు వినతిపత్రం అందజేశారు. తాండావాసుల సుదీర్ఘకాల రహదారి సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా, సమస్యను పరిశీలించి బీటీ రోడ్డు నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకుంటామని మం త్రి సీతక్క హామీ ఇచ్చినట్లు కాంగ్రెస్ నాయకులు వెల్లడించారు.

## నేడు నిజామాబాద్‌లో మంత్రి పొంగులేటి పర్యటన

### ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

ప్రజాపక్షం/నిజామాబాద్ : తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ గృహనిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి శనివారం నిజామాబాద్‌లో పర్యటించనున్నారు. ఉదయం 7 గంటలకు నాగారంలోని నిర్మితి కేంద్రం వద్ద హౌసింగ్ టవర్స్ నిర్మాణం కోసం స్థల పరిశీలన జరపనున్నారు. అనంతరం 43వ డివిజన్ పాములబస్తీలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించి లబ్ధిదారులతో భేటీ కానున్నారు. ఉదయం 10 గంటలకు రాజీవ్‌గాంధీ ఆడిటోరియంలో లబ్ధిదారులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కేటాయింపు పత్రాలను పంపిణీ చేయనున్నారు.అదేవిధంగా దుబ్బలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 11.45 గంటల ప్రాంతంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)కు చేరుకుని హౌసింగ్, రెవెన్యూ అంశాలపై నిజామాబాద్, కామారెడ్డి ఉమ్మడి జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించనున్నారు. మంత్రితో కలిసి జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ప్రభుత్వ సలహాదారులు సుదర్శన్‌రెడ్డి, షబ్బీర్‌అలీ, పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులను పాల్గొననున్నారు. మంత్రి పర్యటనను పురస్కరించుకుని కలెక్టర్ భవేష్ మిశ్రా శుక్రవారం సంబంధిత అధికారులతో సమావేశమై చేపట్టాల్సిన ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రేనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, నగరపాలక సంస్థ కమీషనర్ దిలీప్‌కుమార్, ఆర్డీఓ రాజేంద్రకుమార్, ట్రేనీ ఆర్డీఓ సందీప్ తదితరులున్నారు.



## నూతన చేయూత పింఛన్లకు దరఖాస్తు

### మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్

ప్రజాపక్షం/మెదక్ : అర్హులైన లబ్దిదారులు నూతన చేయూత పింఛన్ల కోసం ఆగస్టు 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. శుక్రవారం ఆమె ఒక ప్రకటనలో మాట్లాడుతూ నూతన చేయూత పింఛన్ల దరఖాస్తులను మండల, గ్రామపంచాయతీ కార్యాయాల్లో స్వీకరిస్తున్నట్లు తెలిపారు. దరఖాస్తుదారులకు కలెక్టరేట్‌లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమస్యల పరిష్కారం కోసం 8008556112 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు. పింఛన్ దరఖాస్తులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాలు లేని వారు సంబంధిత అధికారులను సంప్రదించి వాటిని పొందేలా జిల్లా యంత్రాంగం సహకరిస్తుందని తెలిపారు.

### దివ్యాంగులకు ప్రత్యేక యుడిఐడి శిబిరం

యూడీఐడి ధ్రువీకరణ పత్రం లేని దివ్యాంగులు ముందుగా మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని, అనంతరం ఆగస్టు 26న మెదక్ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి (జీజీఏచ్)లో ప్రత్యేక యూడీఐడీ శిబిరం నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. లబ్దిదారుల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సకాలంలో పరిశీలించి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సంబంధిత ఎంపీడీఓలను కలెక్టర్ ఆదేశించారు.

## సౌకర్యాలు కల్పించి నాణ్యమైన విద్య అందించాలి

### కలెక్టర్ కుమార్ దీపక్



ప్రజాపక్షం / దండేపల్లి, జన్నారం : ప్రభుత్వ విద్యా సంస్థలలో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించి నాణ్యమైన విద్యను అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన దండేపల్లి, జన్నారం మండలాల్లో విస్తృతంగా పర్యటించారు. దండేపల్లి మండలం ద్వారకలో నిర్మాణంలో ఉన్న ఎస్‌టి బాలుర వసతి గృహం, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో అదనపు తరగతి గదుల నిర్మాణ పనులను పరిశీలించి, నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాల, జూనియర్ కళాశాలతో పాటు జన్నారం మండలం కిష్టాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. తరగతుల్లో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అర్థమయ్యే రీతిలో బోధన సాగించాలని, విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని స్పష్టం చేశారు. కళాశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. దండేపల్లి, జన్నారం మండల కేంద్రాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను కలెక్టర్ తనిఖీ చేశారు. ఒపి రిజిస్టర్, ల్యాబ్, మందుల నిల్వలు, ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో జరిగిన కాన్పుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది విధుల్లో సమయపాలన పాటించాలని, వర్షాకాలం దృష్ట్యా అంటువ్యాధులు ప్రబలకుండా ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. రెండు మండలాల తహసీల్దార్ కార్యాలయాలను సందర్శించి ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా నో మ్యాపింగ్, అనుమలిస్ వారికి నిబంధనల ప్రకారం నోటీసులు జారీ చేసి నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. దండేపల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి ప్రసాద్,శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ‘సురవరం’ స్ఫూర్తితో ప్రజా పోరాటాలు


### బద్రి సత్యనారాయణ



ప్రజాపక్షం / ఆసిఫాబాద్ : కామ్రేడ్ సురవరం సుధాకర్ రెడ్డి స్ఫూర్తితో ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం ఉద్యమించాలని సిపిఐ సీనియర్ నాయకుడు బద్రి సత్యనారాయణ పిలుపునిచ్చారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని రోజ్ గార్డెన్‌లో జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి అధ్యక్షతన సిపిఐ జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. కుమురం భీం ప్రాజెక్టు మరమ్మతులు చేపట్టడంతో పాటు వట్టివాగు ప్రాజెక్టు నుంచి పంటలకు సాగునీరు అందించాలని, గుండి వాగు, లక్మాపూర్ బ్రిడ్జిల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. నేషనల్ హైవే నిర్మాణంలో నిర్లక్ష్యం వహించిన డిబిఎల్ కంపెనీని బ్లాక్‌లిస్ట్‌లో పెట్టాలని, పిఎం శ్రీ నిధుల వినియోగం, ఆసిఫాబాద్ జ్యోతిరావు పూలే గురుకులంలో అక్రమ అడ్మిషన్లు, వ్యవసాయ శాఖ అధికారిపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. గురుకులాలు, హాస్టళ్లలో మెరుగైన వసతులు కల్పించాలని, డైట్ కళాశాలలో అడ్మిషన్లు ప్రారంభించి గిరిజన డిగ్రీ కళాశాలకు సొంత భవనం కేటాయించాలని తీర్మానించారు. పోలీస్ రిక్రూట్‌మెంట్‌లో గిరిజనులకు న్యాయం చేయాలని, రేషన్ బియ్యం అక్రమాలను అరికట్టాలని అన్నారు. సింగరేణి ఓపెన్‌కాస్ట్‌లలో స్థానికులకే ఉపాధి కల్పించాలని, మిషన్ భగీరథ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరారు. సింగరేణి డిఎంఎఫ్‌టి నిధులపై 2014 నుంచి ఇప్పటివరకు జరిగిన ఖర్చులపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బద్రి సాయికుమార్, జిల్లా సహాయ కార్యదర్శి ఆత్మకూరి చిరంజీవి, జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్. తిరుపతి, మారం శ్రీనివాస్, బోయిరే ప్రకాష్, కౌన్సిల్ సభ్యులు కొదురుపాక మహేష్, వర్కోల్ రాకేష్, ఆత్రం సీతారాం, దిలీప్, అంబారావు పాల్గొన్నారు.

## నూతన కమిటీ సభ్యులను సన్మానించిన ఎంపి

ప్రజాపక్షం/పాపన్నపేట: నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్ నివాసంలో శుక్రవారం రోజు పాపన్నపేట మండల అధ్యక్షులు సంతోష్ చారి ఆధ్వర్యంలో సన్మానించారు. మండల ముఖ్య నాయకులు కలిసి ఏడుపాయల వన దుర్గామాత జ్ఞాపిక అందజేసినట్లు ఆయన తెలిపారు. సంతోష్ చారి మాట్లాడుతూ పాపన్నపేట మండలంలోని పలు సమస్యలు ఎంపి దృష్టికి తీసుకువెళ్లి సంబంధిత అధికారులతో ఫోన్లో మాట్లాడి పరిష్కరించారన్నారు. జిల్లా అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్, ధార్మిక సెల్ సెక్రెటరీ సంతోష్ గౌడ్,ప్రధాన కార్యదర్శులు లక్ష్మణరావు, నాగభూషణం, మండల ఉపాధ్యక్షుడు బొక్కల భాగేష్, ఒబిసి మోర్చా అధ్యక్షుడు వడ్లభాగేష్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు జిన్నగోపాల్, యువమోర్చా అధ్యక్షుడు జగదీష్, మహిళా మోర్చా అధ్యక్షుడు మన్నె సుమలత, ఎస్‌సి మోర్చా అధ్యక్షుడు బాబు, ఎస్‌టి మోర్చా అధ్యక్షుడు వెంకట్ నాయక్, బిజెవైఎం శ్రవణ్, బూత్ అధ్యక్షుడు సాయిలు, మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి నాయి కోటి మహేశ్వరి, పాల్గొన్నారు.



## షిర్డీ ట్రైన్‌లో గంజాయి రవాణా

ప్రజాపక్షం /నిజామాబాద్ అర్బన్ : శుక్రవారం షిరిడి ట్రైన్‌లో గంజాయి రవాణా అవుతుందన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఆర్‌పిఎఫ్, నిజామాబాద్ పోలీసులు ఛేదించి ఇట్టి గంజాయిని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే గణేష్ పోలి (20), దీపక్ సాహు లు గంజాం జిల్లా, ఒరిస్సాకు చెందిన వీరు శుక్రవారం తెల్లవారుజామున ఉదయం 12.35 సాయి షిర్డీ ట్రైన్‌లో ఒక సూట్ కేసులో 24 కిలోల ఎండు గంజాయిని రవాణా చేస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు ఆర్‌పిఎఫ్ పోలీస్, ఎస్‌హెచ్‌వో నిజామాబాద్ కలిసి సంయుక్తంగా ట్రైన్ తనిఖీ చేయగా, వారి సీటు కింద రెండు సూట్‌కేసులతో ప్రయాణిస్తుండగా, అనుమానంతో తనిఖీ చేయగా, సూట్ కేసుల్లో 24.3 కిలోల ఎండు గంజాయి లభించింది. అట్టి ఎండు గంజాయిని ఒడిశా నుండి షిర్డీకి రవాణా చేస్తున్నామని, ఇట్టి రవాణాకు ఒక వ్యక్తి (పేరు తెలియదు) మాకు పదివేల రూపాయలు ఇచ్చి షిర్డీలో ఒక ప్లేస్ వద్ద ఆటో ఆగి ఉంటుంది, ఆ ఆటోలో పెట్టి రావాలి అని చెప్పినట్టుగా చెప్పారు.24.3 కిలోల ఎండు గంజాయిని రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పరిచి, రిమాండ్‌కు తరలించారు.

## రూ.3కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



ప్రజాపక్షం/పటాన్‌చెరు : సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గం ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి శంకుస్థాపన చేశారు. ప్రజలకు మెరుగైన మౌళిక వసతులు కల్పించాలనే ఉన్నతమైన ఉద్దేశంతో దాదాపు రూ. 3 కోట్ల అంచనా వ్యయంతో ఈ అభివృద్ధి పనులను చేపట్టినట్లు తెలిపారు.పాశమైలారం ,రుద్రారం, చిట్కుల్, గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణం ,అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ ,బోర్‌వేల్స్ ఏర్పాటు అలాగే రుద్రారం గ్రామంలో ప్రజల తాగునీటి అవసరాల కోసం ఆర్ఓ ప్లాంట్ ఇతర మౌళిక వసతుల కల్పన పనులను అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సామాన్య స్థానిక ప్రజల సమస్యలపై పరిష్కారానికి ప్రతి కౌన్సిలర్ నిరంతరం అధికారులతో సమన్వయం చేసుకుం టూ మమేకమై పనిచేయాలని సూచించారు. వార్డులోని స్థానిక సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు. మున్సిపల్ చైర్మన్, కౌన్సిలర్లు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సహకారంతో ఇస్నాపూర్ మున్సిపాలిటీ పరధిలో రూ. 3 కోట్ల వ్యయంతో ప్రజలకు అవసరమైనఅనేక అభివృద్ధి పనులను ప్రారంభించడం చాల సంతోషకరమని తెలిపారు. మున్సిపాలిటీని అన్ని రంగాల్లో వేగంగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తామని స్పష్టం చేశారు. కౌన్సిలర్లు, పాండు, ఎల్లయ్య, వెంకట్,సందీఫ్ గౌడ్ ,అంజనేయులు,గోపాల్, వెంకటేష్‌లతోస్థానిక బిఆర్ఎస్ నాయకులు అధికారులు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

# ఎకరంన్నర అటవీ భూమి ‘హాంఫట్’

## మామడ అటవీ అధికారులు చోద్యం



ప్రజాపక్షం/నిర్మల్ : మామడ మండలంలో అటవీ శాఖ అ ధికారుల పక్షపాత వైఖరి, ద్వంద్వ విధానాలు స్థానికంగా తీవ్ర ఆగ్రహజ్వాలలను రగిలిస్తున్నాయి. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిని ఆనుకుని, హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో ఉన్న అత్యంత విలువైన మామడ బీట్, కాంపార్ట్‌మెంట్ నంబర్ 946 పరిధిలోని సర్వే నంబర్ 81లో దాదాపు ఎకరంన్నరకు పైగా రిజర్వ్ ఫారెస్ట్ భూమి ఆక్రమణకు గురైంది. సనా రైస్ మిల్ యజమాని ఈ అట వీ భూమిని అక్రమంగా స్వాధీనం చేసుకుని, చుట్టూ 53 సిమెంట్ స్తంభాలను నాటి కంచె ఏర్పాటు చేసుకోవడమే కాకుండా, అందులో వరి ధాన్యం బస్తాలను నిల్వ చేయడానికి పక్కా భవనాలు, భారీ వే బ్రిడ్జి వంటి వాణిజ్య కట్టడాలను నిర్మించారు. సమాచార హక్కు చట్టం ద్వారా వెలుగులోకి వచ్చిన అధికారిక పత్రాలు ఈ అక్రమ ఆక్రమణల గుట్టును పూర్తి ఆధారాలతో బట్టబయలు చేశాయి.ఈ ఆక్రమణపై అటవీ శాఖ అధికారులు 2019 ఫిబ్రవరి 14న పిఓఆర్ నంబర్ 6794/272 ద్వారా తెలంగాణ అటవీ చట్టం 1967, ఐపీసీ సెక్షన్ 447 కింద కేసు నమోదు చేసి, నిర్మల్ ప్రథమ శ్రేణి మేజిస్ట్రేట్ కోర్టులో చార్జ్ షీట్ కూ డా దాఖలు చేశారు. అయితే కేసు నమోదై ఏళ్లు గడుస్తున్నా ఆక్రమిత భూమిని స్వాధీనం చేసుకోవడంలో గానీ, అక్రమ నిర్మాణాలను కూల్చివేయడంలో గానీ అధికారులు ఎలాంటి చొరవ చూపలేదు. కేవలం 2024 జులై 05, నవంబర్ 06 తేదీల్లో నామమాత్రపు షోకాజ్ నోటీసులు జారీ చేసి తమ బాధ్యత తీరిపోయినట్లు ప్రవర్తిస్తున్నారు. స దరు యజమాని నోటీసులను స్వీకరించి కూడా ఎలాంటి వివరణ ఇవ్వకపోయినా అధికారులు తదుపరి కఠిన చర్యలకు ఉపక్రమించకపోవడం వెనుక పెద్ద ఎత్తున ముడుపులు మారాయనే బలమైన అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు మామడ గ్రామ పంచాయతీ కూడా రంగంలోకి దిగి, సదరు రైస్ మిల్, వాణిజ్య సముదాయాలకు ఎలాంటి గ్రామ పంచాయతీ అనుమతులు లేవని, అవి పూర్తిగా అక్రమ నిర్మాణాలని నోటీసులు జారీ చేసినప్పటికీ అటవీ శాఖ అధికారులు మాత్రం చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

**ఆందోళన బాటలో ఆదివాసీ సంఘాలు :** కళ్లముందే ఎకరంన్నర అటవీ భూమిని మింగేసి వ్యాపారం చేసుకుంటుంటే మౌనం వహిస్తున్న అధికారుల వెనుక ఉన్న అసలు కారణాలను వెలికితీయాలని గిరిజన సంఘాలు మండిపడుతున్నాయి. అక్రమాలకు సహకరించిన అధికారులపై ఉన్నతాధికారులు తక్షణమే వి చారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నా రు.సంయుక్తంగా స్పందించి, రిజర్వ్ ఫారెస్ట్ భూమిలో నిర్మించిన సనా రైస్ మిల్ అక్రమ నిర్మాణాలను తక్షణమే కూల్చివేసి, ఆ భూమిని స్వాధీనం చేసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## 3వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం

### ఎస్ఐ అనిల్ కుమార్

ప్రజాపక్షం/పెంచికలపేట్: నిషేధిత గుడుంబా తయారీ, రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ అనిల్ కుమార్ హెచ్చరించారు. కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా మండలంలోని చేడ్వాయి గ్రామంలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు.10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకోవడంతో పాటు సుమారు 3,000 లీటర్ల బెల్లం పానకాన్ని ధ్వంసం చేశారు. అక్రమంగా గుడుంబా తయారీ, నిల్వ, రవాణాపై ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజలు తమ పరిసరాల్లో ఇలాంటి అక్రమ కార్యకలాపాలను గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించి సహకరించాలని కోరారు. హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణ్, కానిస్టేబుల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వృద్ధులకు గౌరవ ప్రదమైన జీవనం కల్పించడమే ధ్యేయం




డిఎల్ఎస్ఎ కార్యదర్శి పి. దేవి మానస

**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్:** వృద్ధులకు గౌరవ ప్రధమైన జీవనం కల్పించడమే న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డిఎల్ఎస్ఎ) కార్యదర్శి పి. దేవి మానస తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వయో వృద్ధుల సంఘం సహకారంతో ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎల్ఎస్ఎ కార్యదర్శి పి. దేవి మానస మాట్లాడుతూ వయో వృద్ధుల కోసం ఉన్న చట్టాలు, సంక్షేమ పథకాలు, నాల్స పథకాల గురించి వివరించారు. వృద్ధులకు గౌరవ ప్రధమైన జీవితం, న్యాయం అందుబాటులో ఉండటం, భరణం, వేధింపులు లేని జీవితం కల్పించడమే ప్రధాన లక్ష్యమన్నారు. వయో వృద్ధుల సంరక్షణ చట్టం, ఉచిత న్యాయ సహాయం, హెల్ప్ లైన్ సేవల గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, వయో వృద్ధుల సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్మాణంలో ఉన్న ఇంటి వైర్ల చోరీ

**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం జిల్లా వైరా మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులోని నిర్మాణంలో ఉన్న ఇంట్లో వైరింగ్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లను గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. చెరుకూరి చలపతిరావుకు చెందిన వెంచర్‌లో నిర్మాణంలో ఉన్న ఇంటిని లక్ష్యంగా చేసుకున్న దుండగులు, వైరింగ్ బాక్సుల్లో ఏర్పాటు చేసిన వైర్లను ఎత్తుకెళ్లారు. ఇంటిని పరిశీలించిన సమయంలో వైరింగ్ బాక్సుల్లో వైర్లు కనిపించకపోవడంతో చోరీ జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ఇదే ప్రాంతంలో గతంలో కూడా చోరీ జరిగినట్లు పేర్కొన్నారు. నిర్మాణ ప్రాంతాల్లో వరుసగా చోరీలు జరుగుతుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు గస్తీ పెంచి దొంగతనాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

## స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండల పరిధిలోని ముత్తారం గ్రామంలో శుక్రవారం నూతన స్మార్ట్ రేషన్‌కార్డులను సర్పంచి, ఉప సర్పంచులు లంజపల్లి మమత, చింతకాయల వెంకటరమణ చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం అందించే రేషన్ సరుకులు మరింత సులభంగా, పారదర్శకంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికీ రేషన్‌కార్డు అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు తాళ్ల కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కొప్పుల రామయ్య, నాయకుడు లంజపల్లి బుచ్చయ్య, పంచాయతీ కార్యదర్శి వీర బాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొదుమూరులో ఎఐవైఎఫ్ ప్రదర్శన




**ప్రజాపక్షం/చింతకాని:** అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్)ఖమ్మం జిల్లా 25వ మహాసభల సందర్భంగా శుక్రవారం యువజనులు కదం త్రొక్కారు. చింతకాని మండలం కొదుమూరు గ్రామంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన యువత చేతిలో ఏఐవైఎఫ్ జెండాతో ప్రదర్శనలో పాల్గొన్నారు. 25వ మహాసభ ప్రారంభ సూచికగా 25 మంది యువకులు పతాకాలను చేబూని ప్రదర్శన అగ్రభాగాన నిల్చారు. ప్రదర్శన అగ్రభాగాన ఏఐవైఎఫ్ మాజీ నాయకులు ఆహ్వాన సంఘం భాధ్యులు కొండపర్తి గోవిందరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలీఉల్లా ఖాద్రీ, ధర్మేంద్ర , జిల్లా నాయకులు నానబాట రామకృష్ణ, చింతల రమేష్, శ్రావణ్, శ్రీనాథ్ రెడ్డి, ఉపేదర్, జిల్లా కార్యవర్గ సభ్యులు కూచిపుడి రవి, సిపిఐ చింతకాని మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శి అబ్బూరి మహేష్, దొబ్బల వెంకరావు, కొల్లి శ్రీనివాసరావు తదితరులు నడవగా ప్రదర్శన కొదుమూరు పుర వీధుల గుండా సాగి మహాసభ ప్రాంగణానికి చేరుకుంది. యువజన సమాఖ్య పతాకాన్ని కొండపర్తి గోవిందరావు ఆవిష్కరించగా మృతవీరుల స్మారక స్థూపం వద్ద సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్,పూలమా వేసి నివాళులర్పించగా నాయకులు కార్యకర్తలు నివాళులర్పించారు.

## సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఉద్యోగాలకు 'ఎస్‌బిఐటి' విద్యార్థుల ఎంపిక



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** స్వర్ణ భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఆఫ్ టెక్నాలజీ (అటానమస్) విద్యార్థులు బహుళ జాతి సంస్థ ఫ్యూర్ ఇంటర్నేషనల్ ఎల్ఎల్‌సి సంస్థలో సాఫ్ట్‌వేర్ డెవలపర్ అసోసియేట్ ఉద్యోగాలు సాధించి కళాశాలకు గర్వకారణంగా నిలిచారని కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. అమెరికా కేంద్రంగా నిర్వహించబడుతూ మలేషియా, ఒమన్, ఖతార్, భారత్ వంటి దేశాల్లో విస్తృతంగా వ్యాపిస్తున్న బహుళ జాతి సంస్థలో తమ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమాలు, సాంకేతిక నైపుణ్యాభివృద్ధి, కమ్యూనికేషన్ స్కిల్స్, అప్టిట్యూడ్, కోడింగ్ శిక్షణలను సద్వినియోగం చేసుకున్న 10 మంది సిఎస్ఈ, సిఎస్ఎం, సిఎస్‌డి విద్యార్థులు ప్రతిభ కనబర్చి ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫ్యూర్ సంస్థ ప్రతినిధులు, చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ వివేక్, సీనియర్ హెచ్ఆర్ పూజ, అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, టిపివో సవిత, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం జిల్లాలో పుట్టగొడుగుల సాగుకు

# ఆదాయానికి రాజ మార్గం

- తక్కువ స్థలం... ప్రత్యామ్నాయ ఆదాయం
- యువ రైతులకు సరికొత్త ఉపాధి బాట



**ప్రజాపక్షం/తల్లాడ:** సంప్రదాయ పంటల సాగుతో పాటు ప్రత్యామ్నాయ వ్యవసాయంపై దృష్టిసారిస్తున్న రైతులకు పుట్టగొడుగుల సాగు ఆసక్తికరమైన అవకాశంగా మారుతోంది. ముఖ్యంగా తక్కువ భూమి ఉన్న రైతులు గ్రామీణ యువత, మహిళా సంఘాలు ఇంటి వద్దే లేదా చిన్న షెడ్లలో పుట్టగొడుగుల ఉత్పత్తి చేపట్టి అదనపు ఆదాయం పొందే అవకాశం ఉంది. పుట్టగొడుగుల సాగు భూమిపై ఆధారపడే వ్యవసాయం కాకపోవడంతో చిన్న, సన్నకారు రైతులకు కూడా అనుకూలంగా ఉంటుందని ఐసిఏఆర్ పేర్కొంది.

**తక్కువ స్థలంలో సాగు :**
పుట్టగొడుగుల పెంపకానికి పెద్ద ఎత్తున వ్యవసాయ భూమి అవసరం లేదు. నియంత్రిత వాతావరణం కలిగిన గది లేదా షెడ్‌లో సాగు చేయవచ్చు. అయితే ఉష్ణోగ్రత, తేమ పరిశుభ్రత, గాలి ప్రసరణ వంటి అంశాలను శాస్త్రీయంగా నిర్వహించాల్సి ఉంటుంది. సాగు విధానం, పుట్టగొడుగు రకాన్ని బట్టి అవసరమైన ఉష్ణోగ్రతలు మారుతాయి.

**యువతకు ఉపాధి అవకాశం :**
ఖమ్మం జిల్లాలో గ్రామీణ యువత పుట్టగొడుగుల సాగును స్వయం ఉపాధి మార్గంగా ఎంచుకోవచ్చు. మొదట చిన్న యూనిట్‌తో ప్రారంభించి అనుభవం వచ్చిన తర్వాత ఉత్పత్తిని పెంచుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. పుట్టగొడుగుల సాగులో శిక్షణ, నాణ్యమైన స్పాన్ లభ్యత, మార్కెటింగ్ కీలకమైన అంశాలుగా ఉన్నాయి.

**లాభాలతో పాటు నష్టాలు :**



తక్కువ స్థలంలో ఉత్పత్తి చేయడం, అదనపు ఆదాయం పొందడం వ్యవసాయ అవశేషాలను వినియోగించుకోవడం ఈ సాగులోని ప్రధాన ప్రయోజనాలు. మరో వైపు నాణ్యత లేని స్పాన్, సరైన ఉష్ణోగ్రత, తేమ లేకపోవడం, పరిశుభ్రత లోపించడం వల్ల పంట దెబ్బతినే అవకాశం ఉంది. పుట్టగొడుగులు త్వరగా పాడయ్యే ఉత్పత్తి కావడంతో మార్కెట్ ముందుగానే సిద్ధం చేసుకోవాలి. తక్కువ ఉత్పత్తి పరిమాణం, రవాణా ఖర్చులు ధరల్లో హెచ్చు తగ్గులు కూడా రైతులకు సవాళ్లుగా మారవచ్చు.

**పోషకాల భాండాగారం :**
పుట్టగొడుగులు పోషక విలువలున్న ఆహారంగా గుర్తింపు పొందుతున్నాయి. రకాన్ని బట్టి వీటిలో ప్రోటీన్, పీచు, పోటాషియం, కాల్షియం, ఐరన్ వంటి పోషకాలు లభిస్తాయి. ఐసిఏఆర్ పరిశోధనల్లో పుట్టగొడుగుల పోషక, ఆర్థిక ప్రాధాన్యాన్ని ప్రత్యేకంగా ప్రస్తావించారు. మార్కెటింగ్‌పై ముందు చూపు అవసరం. పంట సాగు ప్రారంభించే ముందే మార్కెట్‌ను గుర్తించడం యువ రైతులకు అత్యంత ముఖ్యం. ఖమ్మం నగరంతో పాటు మండల కేంద్రాల్లోని హోటళ్లు, రెస్టారెంట్లు, కూరగాయల దుకాణాలు, సూపర్ మార్కెట్లు, నేరుగా వినియోగదారులకు విక్రయించే విధానాలను పరిశీలించాలి. ఉత్పత్తి, ప్యాకింగ్, రవాణా ఖర్చులను లెక్కలోకి తీసుకుని విక్రయ ధర నిర్ణయించుకోవాలి.

**శిక్షణ లేకుండా పెట్టుబడి వద్దు :**
పుట్టగొడుగుల సాగుపై పూర్తి అవగాహన లేకుండా పెద్ద మొత్తంలో పెట్టుబడి పెట్టడం ప్రమాదకరం. వ్యవసాయ ఉద్యాన శాఖల అధికారులను సంప్రదించి అందుబాటులో ఉన్న శిక్షణ, సాంకేతిక మార్గదర్శకత్వం, ప్రభుత్వ సహాయ పథకాల వివరాలను తెలుసుకోవాలి. ఐసిఏఆర్ అనుభవాలు కూడా శిక్షణ, నాణ్యమైన స్పాన్, సాంకేతిక సహాయం, మా ర్కెట్ అనుసంధానం ఉంటే గ్రామీణ కుటుంబాలకు పుట్టగొడుగుల సాగు ఆదాయ మార్గంగా ఉపయోగపడుతుందని సూచిస్తున్నాయి.

**జిల్లాలో ప్రోత్సాహం అవసరం :**
ఖమ్మం జిల్లాలో పుట్టగొడుగుల సాగును ప్రోత్సహించేందుకు గ్రామీణ యువతకు శిక్షణా కార్యక్రమాలు, ప్రదర్శనా యూనిట్లు, నాణ్యమైన స్పాన్ అందుబాటు, మార్కెటింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, మహిళా స్వయం సహాయక సంఘాలు, యువజన సంఘాలు కలిసి యూనిట్లు ఏర్పాటు చేస్తే ఈ రంగంలో ఉపాధి అవకాశాలు మరింత పెరిగే అవకాశం ఉంది. సంప్రదాయ పంటలపై పూర్తిగా ఆధారపడకుండా అదనపు ఆదాయం కోసం ప్రయత్నిస్తున్న ఖమ్మం జిల్లా యువ రైతులకు పుట్టగొడుగుల సాగు ఒక ప్రత్యామ్నాయ మార్గం. అయితే లాభాలపై మాత్రమే దృష్టిపెట్టకుండా శాస్త్రీయ సాగు, నాణ్యత, పరిశుభ్రత, మార్కెటింగ్, నిల్వ వ్యవస్థలను సమన్వయం చేసుకున్నప్పుడే ఈ సాగు నిజమైన లాభసాటి వ్యాపారంగా మారుతుంది.

## కార్మికుడిని మేయర్ చేయడం

# కమ్యూనిస్టులకే సాధ్యం

- సమస్యల పరిష్కారానికి ఆటో కార్మికులు ఐక్యంగా పోరాడాలి
- ఎపి రాష్ట్ర మహాసభల్లో మేయర్ మూడ్ గణేష్




**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం:** విశాఖపట్నంలోని పబ్లిక్ లైబ్రరీ హాల్ నందు గురు, శుక్రవారాల్లో ఆంధ్రప్రదేశ్ ఆటో అండ్ మోటార్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్ (ఎఐటియుసి) రాష్ట్ర నాల్గవ సహాసభలు ఘనంగా జరిగాయి. ఈ మహాసభలకు ఆహ్వాన సంఘం పిలుపు మేరకు కొత్తగూడెం మున్సిపల్ కార్పోరేషన్ మేయర్ మూడ్ గణేష్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గతంలో తాను స్వయంగా ఆటో కార్మికుడిగా పనిచేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన సభలో గుర్తుచేసుకున్నారు. క్షేత్రస్థాయిలో రవాణా రంగ కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, కష్టనష్టాలు తనకు పూర్తిగా తెలుసునని ఆయన పేర్కొన్నారు. ఒక సాధారణ ఆటో కార్మికుడి స్థాయి నుంచి కార్పోరేషన్ మేయర్‌గా అవకాశం కల్పించడం కేవలం కమ్యూనిస్టు పార్టీలకే సాధ్యమని స్పష్టం చేశారు. అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్లు నిరంతరం ప్రజల్లో ఉంటూ గళం విప్పాలని సూచించారు. కార్మికుల పక్షాన నిలిచే నాయకులకు సమాజంలో ఎల్లప్పుడూ సముచిత స్థానం, ఆదరణ లభిస్తాయని ఈ సందర్భంగా వివరించారు. కార్మిక వర్గాల సంక్షేమానికి తన వంతు సహకారం ఎల్లవేళలా కొనసాగుతుందని మేయర్ మూడ్ గణేష్ హామీ ఇచ్చారు.

## 'సర్' ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ గౌడ్



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ రెండవ దశను పకడ్బందీగా చేపట్టాలని కాంగ్రెస్ నేతలకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ సూచించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవ రెడ్డి భవన్‌లో శుక్రవారం నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన మండల, పట్టణ అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ మొదటి దశను విజయవంతంగా నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులకు అభినందనలు తెలిపారు. రెండవ దశను కూడా పకడ్బందీగా చేపట్టాలని ఆయన సూచించారు.

## అర్హత గల ఓటరు పేరు తుది జాబితాలో ఉండాలి

అనామలీస్, నో మ్యాపింగ్‌కు నోటీసులు జారీ చేయాలి : కలెక్టర్ దివాకర టిఎస్




**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** ఎస్ఐఆర్ 2026 ప్రక్రియలో ప్రతి అర్హత గల ఓటరు పేరును తుది జాబితాలో కొనసాగించడమే లక్ష్యంగా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. ఎస్ఐఆర్ 2026పై ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వో, బిఎల్‌వో, సూపర్‌వైజర్లతో కలెక్టర్ దివాకర టిఎస్ శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత మూడు, నాలుగు నెలలుగా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమిష్టిగా కృషి చేయడం వల్ల ఖమ్మంజిల్లాలో అనామలీస్, నో మ్యాపింగ్ కేసులు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. ఇతర జిల్లాల్లో ఒక్కో నియోజక వర్గంలో 50వేల వరకు అనామలీస్, నో మ్యాపింగ్ కేసులు నమోదయ్యాయన్నారు. ప్రస్తుతం రెండు ప్రధాన అంశాలపై అధికారులు దృష్టిసారించాలని సూచించారు. మొదటిది అనామలీస్, నో మ్యాపింగ్ కేసులకు నోటీసులు జారీ చేయడం, రెండవది రెండు నెలల్లో క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించాలన్నారు. నోటీసు అందజేసిన ప్రతి విషయాన్ని బిఎల్‌వో యాప్‌లో ఫోటోతో సహా నమోదు చేయాలన్నారు. విచారణకు సంబంధించిన వివరాలతో పాటు ఓటర్లు సమర్పించిన ఆధారాలను కూడా యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. నోటీసులు జారీ చేసే సమయంలో ఓటర్ల వద్ద 11 రకాల ధృవపత్రాల్లో ఏమైనా ఉన్నాయా అనే విషయాన్ని పరిశీలించాలన్నారు. ధృవపత్రాలు లేని అర్హులైన ఓటర్లకు కుల ధృవపత్రం జారీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సర్ ప్రక్రియలో ప్రజాప్రతినిధులు బిఎల్ఏలను భాగస్వామ్యం చేసి నోటీసులు, విచారణ ప్రక్రియపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు తుది జాబితాలో ఉండేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఖమ్మం కార్పోరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్‌డిసి సదానందం, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డిటి అన్సారీ, ఎఇఆర్‌ఒలు, మున్సిపల్ కమిషనర్లు, బిఎల్‌ఒలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దు



ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం:** పాలిటెక్నిక్ కళాశాలలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి అనుసంధానం చేసి విద్యార్థుల జీవితాలతో పాలకులు ఆడుకోవడం సరైంది కాదని ఎఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వియన్ డిమాండ్ చేశారు. శుక్రవారం పాలిటెక్నిక్ కళాశాల వద్ద ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వినయ్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్థులు జీవితాలను తీర్చి దిద్దే లాటరల్ ఎంట్రీ విధానం రద్దు చేస్తే వారి భవిష్యత్ అంధకారంలో పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన విద్యావిధానం పేరుతో విద్యార్థుల జీవితాలతో ఆటలాడటం ఎంత వరకు సరైందని ప్రశ్నించారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివరిస్టీ పేరుతో సాంకేతిక విద్యను ప్రైవేటీకరించే ప్రయత్నాలను ఇప్పటికైనా విరమించుకోవాలన్నారు. పాలిటెక్నిక్, ఐటిఐ కళాశాలలను ప్రైవేటు శక్తులకు అప్పగించే చర్యలు విద్యార్థుల భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేస్తాయన్నారు. పాలిటెక్నిక్ విద్యద్వారా ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగారని, ఈ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయడం ద్వారా విద్యార్థులకు ఉన్నత విద్య ఉద్యోగ అవకాశాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. లాటరల్ ఎంట్రీ విధానాన్ని కొనసాగించాలని, పాలిటెక్నిక్ విద్యను బలోపేతం చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కొరిమి సంజయ్ పాలిటెక్నిక్ కమిటి సభ్యులు సలిగంటి జయదీప్ రామ్‌చరణ్ సాయిరామ్ వడ్డెబోయిన యశ్వంత్‌స్నేహిత్ తదితరులు పాల్గొన్నారు.

## సర్కారు దవాఖానకు కార్పొరేట్ వైద్యం

- త్వరలో క్యాథ్‌ల్యాబ్
- జిజిహెచ్‌కు రూ.3 కోట్ల నిధులు
- రూ.12 కోట్లతో పోస్టాఫీస్ హేమచంద్రాపురం రోడ్డు పనులు

**ప్రజాపక్షం/భద్రాద్రికొత్తగూడెం:** నియోజకవర్గ ప్రజలతో పాటు జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యం కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అ ందించేందుకు స్థానిక ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు చేసి విశేష కృషి ఎట్ట కేలకు ఫలించింది. పేద, మధ్య తరగతి ప్రజలకు అ ధునాతన వైద్యం అందుబాటులో ఉంచాలనే స ంకల్పంతో ఆయన ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తె చ్చి ప్రత్యేకంగా రూ.3 కోట్ల నిధులను మంజూరు చేయించారు. ఈ నిధులతో కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి(జిహెచ్)లో అత్యాధునిక సౌకర్యాలు సమకూరనున్నా యి. ప్రధానంగా గుండె సంబంధిత వ్యాధులతో బాధపడే రోగుల ప్రాణాలను కాపాడేందుకు కీలకమైన అధునాతన క్యాథ్ ల్యాబ్ సేవలను ఇక్కడ త్వరలోనే ప్రారంభించనున్నారు. దీంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన చికిత్స అందించేందుకు ప్రత్యేకంగా క్రిటికల్ కేర్ యూనిట్ (సిసియూ)ను ఏర్పాటు చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం పేదలు ప్రైవేటు కేంద్రాలకు వెళ్లి వేలకు వేలు ఖర్చు చేయకుండా ఆస్పత్రిలో అత్యాధునిక ఎంఆర్ఐ స్కానింగ్ సౌకర్యాన్ని అందుబాటులోనికి తీసుకురానున్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడే రోగుల కోసం అన్ని హంగులతో కూడిన 20 పడకల ఐసియు విభాగాన్ని కూడా సిద్ధం చేస్తున్నారు. గతంలో గుండె పోటు లేదా తీవ్రమైన అత్యవసర పరిస్థితులు ఏర్పడితే మెరుగైన వైద్యం కోసం సుదూర ప్రాంతాలైన హైదరాబాద్,ఖమ్మం వంటి నగరాలకు పరుగులుతీయాల్సి వస్తోంది. సకాలంలో వైద్యం అందక మార్గ మధ్యలో ఎందరో నిస్సహాయ స్థితిలో ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పుడు జిజిహెచ్‌లోనే కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా ఈ అన్నిరకాల అత్యున్నత వైద్య సేవలు సమకూరనుండటంతో స్థానిక ప్రజలకు ఎంతో మేలు జరగనుంది. ప్రజా సమస్యల పరిష్కారంలో నిరంతరంముందుంటూ సర్కారు దవాఖానను సూపర్ స్పెషాలిటీ స్థాయిలో తీర్చిదిద్దుతున్న ఎంఎల్ఏ కూనంనేని చొరవపై నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఆ ధునిక ఐసియూ సేవల ద్వారా అత్యవసర విభాగంలో కా ర్పొరేట్ స్థాయి వైద్యం ప్రభుత్వ పరిధిలోనే అందించే అవకాశం కలుగుతుందని తెలిపారు. సామాన్య మధ్య తరగతి వర్గాల వారికి మెరుగైన వైద్య సేవలు కల్పించే అస్పత్రి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.

## 'నేడు' ఎంప్లాయిమెంట్ రిజిస్ట్రేషన్ మేళా

**ప్రజాపక్షం/ఖమ్మంఅర్బన్:** వైరా పరిసర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, నిరుద్యోగ యువతకు సౌకర్యంగా ఉండేందుకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఖమ్మం ఆధ్వర్యంలో నేడు వైరాలో ఎంప్లాయిమెంట్ కార్డు రిజిస్ట్రేషన్ మేళా, కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎన్.మాధవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైరాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఎంప్లాయిమెంట్ కార్డు కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆన్‌లైన్ విధానంలోనే కొనసాగుతున్నప్పటికీ వైరా పరిసర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, నిరుద్యోగ యువతకు సౌకర్యంగా ఉండేందుకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

## అనాథ బాలికల శరణాలయంలో సౌకర్యాలు ఏర్పాట్లు

భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట



**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరులోని బాలికల అనాథ శరణాలయంలో చిన్నారులకు ఇబ్బందులు కలగకుండా వారికి కావలసిన సౌకర్యాలు కల్పించడం జరిగిందని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట అన్నారు. ఈ నెల 20 తేదీ నాడు బాలికల అనాథ శరణాలయాన్ని ఆకస్మిక తనకి సమయంలో అక్కడ పిల్లలకు సరిపడా భోజన బల్లలు (డైనింగ్‌కుర్చీలు లేవని, శరణాలయంలో కనీస వసతులను మెరుగుపరచడానికి మరికొన్ని ఫ్యాన్లు,ట్యూబ్ లైట్లు అవసరమని గమనించానని, వెంటనే పరిగణనలోకి తీసుకొని అవసరమైన భోజన బల్లలు, కుర్చీలు, ఫ్యాన్లు,ట్యూబ్ లైట్లను సాయంత్రం నాటికి ఏర్పాటు చేయాలని మణుగూరు తహశీల్దార్ నరేష్‌ను ఆదేశించ డం జరిగిందని, అదే రోజు పిల్లల ఇష్టానుసారం వారికి ప్రత్యేక విందును ఏర్పాటు చేయాలని కూడా ఆయన తహశీల్దార్‌కు సూచించడం జరిగిందనన్నారు. తక్షణమే స్పందించిన మణుగూరు తహశీల్దార్ నరేష్, ఆయన బృందం, సాయంత్రం కల్లా అవసరమైన వసతులను ,ప్రత్యేక విందును ఏర్పాటు చేశారని అన్నారు. సమస్యలను ఆలస్యం లేకుండా పరిష్కరించడంలోనూ, పిల్లలకు అందుబాటులో ఉన్న వసతులను మెరుగుపరచడంలోనూ తహశీల్దార్ మరియు ఆయన బృందం చూపిన అంకిత భావం, త క్షణ స్పందన,వేగవంతమైన చర్యలను పరిగణలోకి తీసుకొని వారిని అభినందించడం జరిగిందని అన్నారు. సబ్ కలెక్టర్ డివిజన్ పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గురుకుల పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్లు, ఇతర ప్రభుత్వ సంస్థలలోని చిన్నవైనప్పటికీ ముఖ్యమైన సమస్యలను గుర్తించి, తక్షణమే పరిష్కరించేందుకు తమ పరిధిలో ఇదే తరహా చొరవ చూపాలని ఆయన ఇతర అధికారులను కోరారు. సకాలంలో జోక్యం చేసుకోవడం, బాధ్యతాయుతమైన యంత్రాంగం ద్వారా పిల్లలు, విద్యార్థుల సంక్షేమాన్ని, వసతులను మెరుగుపరచడంలో అర్థవంతమైన మార్పును తీసుకురావచ్చని ఆయన అన్నారు.

## కామేపల్లిలో అధికారులు మకాం ఎక్కడో?

- ఏజెన్సీ అలవెన్సులు పొందుతూ అప్‌అండ్‌డౌన్
- అటకెక్కిన మండల సమస్యలు




**ప్రజాపక్షం/కామేపల్లి:** కామేపల్లి మండలంలో పని చేస్తున్న పలు శాఖల అధికారులు, సిబ్బంది స్థానికంగా నివాసం ఉండకుండా పట్టణ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏజెన్సీ అలవెన్సులు పొందుతున్నప్పటికీ స్థానికంగా మకాం ఉండకపోవడంతో ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందడం లేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులతో పాటు కొందరు సిబ్బంది సైతం అప్‌అండ్‌డౌన్ చేస్తుండటంతో కార్యాలయాలకు వచ్చే విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటున్నారు. కొన్ని శాఖల్లో అధికారులు సమావేశాలు, పర్యటనల పేరుతో అందుబాటులో ఉండటం లేదనే విమర్శలు ఉన్నాయి. గ్రామాల్లో పంచాయితీ సిబ్బంది సక్రమంగా అందుబాటులో లేకపోవడంతో పారిశుద్ధ్య సమస్యలు పేరుకుపోతున్నాయని ప్రజలు చెబుతున్నారు. విధులు నిర్వహించే ప్రాంతంలోనే అధికారులు, సిబ్బంది నివాసం ఉండాల్సిన నిబంధనలు అమలయ్యేలా చూడాలని, ఏజెన్సీ అలవెన్సులు, గృహ అద్దె భత్యాల చెల్లింపులపై కూడా పరిశీలన జరపాలని కోరుతున్నారు.

**కలెక్టర్ చర్యలు తీసుకోవాలి....**
మండలంలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది స్థానికంగా నివాసం ఉండేలా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ పెంచాలని కామేపల్లి మండల ప్రజలు కోరుతున్నారు.

# యువ అంతరిక్ష రంగంలో వ్యవస్థాపకులకు
# ప్రభుత్వం పూర్తి మద్దతు

ప్రధాని మోదీ హామీ



**న్యూఢిల్లీ :** 'యువ అంతరిక్ష రంగంలో వ్యవస్థాపకుల (ఎంటర్‌ప్రెన్యూర్స్)కు ప్రభుత్వం పూర్తి మద్దతు ఇస్తుంది' అని శుక్రవారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హామీ ఇచ్చారు. వ్యవసాయం, పశు సంపద నిర్వహణ, పాడి, పర్యావరణం ప్రజల దైనందిన జీవితాలను ప్రభావితం చేసే ఇతర రంగాలలో అంతరిక్ష రంగంసాంకేతికతను ఎలా ఉపయోగించవచ్చో అన్వేషించాలని ఆయన వారిని కోరారు. ప్రధానమంత్రి మోదీ ఇక్కడ 20 అంతరిక్ష స్టార్టప్‌ల సిఇఓలు, వ్యవస్థాపకులతో సంభాషిస్తూ, అంతరిక్ష స్టార్టప్‌ల వంటి కొత్త సవాల్‌తో కూడిన రంగంలోకి ప్రవేశించి, రిస్క్‌లు తీసుకుని, సంస్కరణల ప్రక్రియను విశ్వసించి, తమ ప్రయత్నాలతో నిలకడగా ఉంటూ అద్భుతమైన ధైర్యాన్ని ప్రదర్శించినందుకు మోదీ వారిని ప్రశంసించారు. ప్రభుత్వ పూర్తి మద్దతు యువ అంతరిక్ష వ్యవస్థాపకులకు తప్పక ఉంటుందనే హామీ ఇవ్వడంతోపాటు, తమ సాంకేతిక పరిజ్ఞానాల వినియోగాన్ని విస్తరించడానికి అంతరిక్ష రంగం సంస్థలు, ఇతర రంగాల సంస్థల మధ్య మరింత సహకారం ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. 'భవిష్యత్తు కోసం భారతదేశ సామర్థ్యాలను పెంపొందించే క్రమంలో అంతరిక్ష స్టార్టప్‌లకు భారత ప్రభుత్వం అండగా నిలుస్తుందని నేను హామీ ఇచ్చాను. అంతరిక్ష రంగంలో భారతదేశం ప్రపంచానికి బలమైన, వినూత్నమైన, వాణిజ్యపరంగా లాభదాయకమైన నమూనాను అందించగలదు' అని ఆశాభావం వ్యక్తం చేశారు.

అంతరిక్ష శిథిలాలపై పనిచేస్తున్న కంపెనీలు తమ సాంకేతికతలను విస్తరించడానికి పర్యావరణ సంస్థలతో కలిసి పనిచేయవచ్చని, వ్యవసాయ రంగంతో కలిసి పనిచేస్తున్న అంతరిక్ష సాంకేతిక కంపెనీలు,రైతులు మరింత సమాచారంతో కూడిన నిర్ణయాలు తీసుకుని, తమ ఉత్పత్తిని గరిష్ఠ స్థాయికి చేర్చుకోవడంలో సహాయపడటానికి వ్యవసాయ విశ్వవిద్యాలయాలు, విభాగాలతో సహకరించుకోవచ్చన్నారు. స్టార్టప్‌లు తమ పనిపై విపులమైన ప్రెజెంటేషన్లు ఇచ్చాయని, ప్రభుత్వ స్థల సంస్కరణలను, పరిశ్రమ అభివృద్ధికి వారు కల్పించిన అవకాశాలను అభినందించారని ప్రధాని మోదీ చెప్పారు. భారతదేశ ప్రైవేట్ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థ దేశానికి, ప్రపంచానికీ ఒక ప్రధాన శక్తిగా మారగలదని ఆయన అభిలషించారు. అలాగే అంతరిక్షం గురించి ఆలోచించేటప్పుడు, ప్రపంచం భారతదేశం వైపు చూసేలాంటి పర్యావరణ వ్యవస్థ ఉండేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. భారతదేశ అంతరిక్ష రంగం ప్రపంచ స్థాయి కంపెనీలను, పెట్టుబడులను దేశానికి ఆకర్షించే అయస్కాంతంలా పనిచేయగలదన్న విశ్వాసం వ్యక్తం చేశారు. ప్రపంచ వ్యాప్తంగా భారతదేశం స్థానాన్ని వేగంగా, బలోపేతం చేయాలని ఆయన పరిశ్రమ వర్గాలను కోరారు. ప్రైవేట్ అంతరిక్ష రంగం చూపిన విశ్వాసం, ఈ పరిశ్రమలో ప్రైవేట్ భాగస్వామ్యాన్ని కల్పించాలనే దార్శనికతను మరింత బలోపేతం చేసిందని మోదీ తెలియజేశారు. ప్రైవేట్ అంతరిక్షపరిశ్రమ సాధిస్తున్న వేగవంతమైన పురోగతిని సిఇఓలు ప్రముఖంగా ప్రస్తావించి, దాని భవిష్యత్తుపై తమ దార్శనికతను పంచుకున్నారు. ఈ సంభాషణలలో పాల్గొన్న స్టార్టప్‌లలో స్కైరూట్, ఏరోస్పేస్, అగ్నికుల్ కాస్మోస్, పిక్సెల్, ధ్రువ స్పేస్, గెలాక్స్ ఐ, పియర్ సైట్, బెల్లాట్రిక్స్ ఏరోస్పేస్, దిగంతర, శాట్ స్యూర్, సుహోరా టెక్నాలజీస్, మనస్తు స్పేస్, ఆస్ట్రో బేస్, టేక్ టూ స్పేస్, వ్యోమిక్, కాస్మోసెర్వ్ స్పేస్, ఆర్బిట్ ఎయిడ్ ఏరోస్పేస్, స్కై సెర్వ్ (హై స్పేస్), సెరెండిపిటి స్పేస్, వాస్సర్‌ల్యాబ్స్, మిస్ట్ ఈవో ఉన్నాయి.

## ప్రజా వ్యతిరేక ఇంధన విధానం
# దేశానికి ఆమోదయోగ్యం కాదు

ఇ-20 విధానాన్ని తక్షణమే సమీక్షించాలి

కేంద్రాన్ని డిమాండ్ చేసిన కాంగ్రెస్



**న్యూఢిల్లీ:** నరేంద్ర మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ పార్టీ విమర్శల పర్వం కొనసాగుతోంది. పలు సమస్యలు, ప్రజా వ్యతిరేక విధానాలపై నిత్యం దుమ్మెత్తి పోస్తున్న ప్రతిపక్ష పార్టీ తాజాగా ఇ–20 విధానాన్ని తక్షణమే సమీక్షించాలని డిమాండ్ చేసింది. వాహనాల నిర్వహణ, వంటగది ఖర్చులను పెంచే ఈ ప్రజా వ్యతిరేక ఇంధన విధానం దేశానికి ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది. దేశంలో మూడు నెలల వ్యవధిలో చక్కెర ధరలు 40 శాతం, బెల్లం ధర 24శాతం, బియ్యం ధర 16 శాతం, మొక్కజొన్న పిండి ధర 11 శాతం పెరిగాయని పేర్కొన్న ఒక హిందీ దినపత్రిక కథనానికి సంబంధించిన స్క్రీన్‌షాట్‌ను కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్ వేదికగా పంచుకున్నారు. 'మోదీ ప్రభుత్వ దూరదృష్టి లేని, ప్రజా వ్యతిరేక ఇ–20 విధానం కారణంగా, ఒకవైపు ద్రవ్యోల్బణం పెరుగుతుండగా, మరో వైపు వాహన యజమానులు తగ్గిన మైలేజీ, వాహనాలకు కలిగే నష్టాల భారాన్ని మోయాల్సి వస్తోందన్నారు. దీనివల్ల ప్రజలు రోడ్లపైన, తమ వంటగదులలో రెండింటిలోనూ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని జైరామ్ మండిపడ్డారు. పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్‌ను కలపడానికి చెరకు, ధాన్యాన్ని మళ్లించడం వల్ల ఆయా సరుకుల కొరత ఏర్పడటం అనివార్యమని, అలాగే 20 శాతం ఇథనాల్ మిశ్రమాన్ని తట్టుకునేలా రూపొందించని వాహనాలు దెబ్బతినే ప్రమాదం ఉందని రమేశ్ ఆందోళన వ్యక్తం చేశారు. సరైన పరీక్షలు లేకుండా ఈ విధానాన్ని అమలు చేయడం వల్ల వాహనాల మైలేజీ తగ్గుతోందని ఆయన ఎత్తి చూపారు. చక్కెర తయారీకి ఉపయోగపడే 25 లక్షల టన్నుల చెరకును ఇథనాల్ ఉత్పత్తికి మళ్లించిన విషయం ఇప్పుడు స్పష్టమైందని, దీని ఫలితంగా గత మూడు నెలల్లోనే చక్కెర ధర కిలోకు రూ. 48 నుండి రూ. 67కి, బెల్లం ధర రూ. 50 నుండి రూ. 65కి పెరిగిందని ఆయన తెలిపారు. బియ్యం 16 శాతం, మొక్కజొన్న పిండి ధరలు 11 శాతం పెరిగాయని, అలాగే పశుగ్రాసం ధర 10.34 శాతం పెరిగిందని ఆయన పేర్కొన్నారు. 'ఇథనాల్ ఉత్పత్తిలో నిమగ్నమైన తమ సన్నిహితుల లాభాలను గరిష్ఠం చేసే తొందరపాటు చర్యలో భాగంగా, వాహన యజమానులకు ఇంధన ఎంపికలు పరిమితం చేయబడ్డాయి; అయినప్పటికీ, వాహన మైలేజీ, ఇ–20 ఇంధనంతో వాహనాల అనుకూలతకు సంబంధించి తీవ్రమైన ఆందోళనలు కొనసాగుతూనే ఉన్నాయి' అని రమేశ్ అన్నారు. అంతర్జాతీయ ముడి చమురు ధరలు తగ్గడం, 20 శాతం ఇథనాల్ కలపడం ద్వారా ఖర్చు ఆదా అవుతున్నప్పటికీ, పెట్రోల్ ధరలలో ఎలాంటి తగ్గింపు లేకపోవడం ఆశ్చర్యకరమని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పేర్కొన్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడైన రాహుల్ గాంధీ, ఇ–20 విధానం చుట్టూ ఉన్న అవినీతిని నిరంతరం ఎత్తి చూపుతున్నారని ఆయన అన్నారు.

# గుజరాత్ సిఎంగా 'వందేమాతరం' పూర్తిగా పాడారా?

**న్యూఢిల్లీ:** 'వందేమాతరం' గేయం లో కేవలం రెండు చరణాలను మాత్రమే పాడాలన్న కాంగ్రెస్ నిర్ణయంపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన 'దేశ వ్యతిరేక' వ్యాఖ్యలను రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ శుక్రవారం తిప్పికొట్టారు. గుజరాత్ ముఖ్యమంత్రిగా నరేంద్ర మోదీ లేదా ప్రధాన మంత్రిగా అటల్ బిహారీ వాజ్‌పేయి ఈ గేయాన్ని పూర్తిగా పాడారా అని ఆయన ప్రశ్నించారు. 'వందేమాతరం' గేయాన్ని పూర్తిగా పాడని బిజెపి నాయకులు కూడా 'దేశ వ్యతిరేకులు' అవుతారా అని సిబల్ నిలదీశారు. 'వందేమాతరంపై రెండు చరణాల నిర్ణయం తీసుకున్న కాంగ్రెస్ పనితీరును అమిత్ షా దేశ వ్యతిరేకం అని అభివర్ణించారు. నా ప్రశ్న ఏమిటంటే: 1950 నుండి జరిగిన ప్రైవేట్ లేదా అధికారిక కార్యక్రమాల్లో బిజెపి నాయకులు, గుజరాత్ సిఎంగా మోదీజీ లేదా ప్రధాని వాజ్‌పేయి ఈ గేయంలోని అన్ని చరణాలను పాడారా? అని స్వతంత్ర ఎంపి సిబల్ ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. బిజెపి ఓటు బ్యాంకు రాజకీయాలు బయటపడుతున్నాయన్నారు. జాతీయ గేయంలో కేవలం రెండు చరణాలను మాత్రమే పాడాలన్న కాంగ్రెస్ నిర్ణయం చట్టానికి విరుద్ధమని, ఓటు బ్యాంకును ప్రసన్నం చేసుకోవడమే దీని ఉద్దేశమని ఆరోపిస్తూ అమిత్ షా కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించడంతో గురువారం 'వందేమాతరం' వివాదం ముదిరింది. దీనికి ప్రతిగా కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ స్పందిస్తూ, బిజెపి నాయకులను కపట దేశభక్తులు అని విమర్శించారు. జాతీయ గేయాని పూర్తిగా కాకుండా కేవలం రెండు చరణాలను మాత్రమే పాడాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ బుధవారం తీసుకున్న నిర్ణయం నేపథ్యంలో ఈ మాటల యుద్ధం మొదలైంది.

# చక్కెర ధరల పెరుగుదలకు.. ఇథనాల్‌తో సంబంధం లేదు

కేంద్ర ప్రభుత్వం స్పష్టీకరణ



**న్యూఢిల్లీ :** దేశీయ అవసరాలకు సరిపడా నిల్వలు ఉన్నప్పటికీ, ఇథనాల్ ఉత్పత్తి కోసం చక్కెరను మళ్లిస్తున్న కారణంగానే దాని ధరలు విపరీతంగా పెరుగుతున్నాయన్న ఆరోపణలను శుక్రవారం కేంద్ర ప్రభుత్వం తోసిపుచ్చింది. బదులుగా, ఆ పరిశ్రమే ధరలను పెంచిందని ఆరోపించింది. తీపి పాదార్థన్ని నిల్వచేయడం, బ్లాక్ మార్కెటింగ్ చేయడంపై చర్యలు తీసుకోవాలని, అలాగే, అక్టోబరు 15వ తేదీనాటికి మిల్లుల ద్వారా క్రషింగ్ సీజన్‌ను ముందుగానే ప్రారంభించేందుకు సన్నాహాలు మొదలు పెట్టాలని రాష్ట్రాలను కోరినట్లు కేంద్రం తెలిపింది. ప్రస్తుతం డీలర్లు నిల్వ ఉంచుకోగల స్టాక్‌ను తగ్గించే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు వివరించింది. చక్కెర లభ్యత, ధరలపై మీడియా సమావేశంలో ఆహార కార్యదర్శి సంజీవ్ చోప్రా మాట్లాడుతూ అక్టోబరు 31నాటికి 10 లక్షల టన్నుల చక్కెర దిగుమతులకు అనుమతించడం, డీలర్లతోపాటు శీతలపానీయాలు, ఐస్‌క్రీముల తయారీదారుల వంటి బల్క్ వినియోగదారులపై నిల్వల పరిమితులను విధించడం ద్వారా ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకుందని తెలియజేశారు.2025–26 మార్కెటింగ్ సంవత్సరానికి (అక్టోబరు–సెప్టెంబరు) ఉత్పత్తి మునుపటి అంచనాలైన 343 లక్షల టన్నుల నుంచి 306 లక్షల టన్నులకు పడిపోయినప్పటికీ, దేశంలో చక్కె ర నిల్వలు పుష్కలంగా ఉన్నాయని ఆయన నొక్కిచెప్పారు. వార్షి దేశీయ చక్కెర డిమాండ్ సుమారు 280 నుంచి 285 లక్షల టన్నులుగా ఉంది. చెరుకు పంటలో రెడ్ రాట్, టాప్ బోరర్ తెగుళ్లు, అలాగే, వర్షాల వల్ల ఏర్పడిన నీటి నిల్వ కారణంగా ఉత్పత్తి దెబ్బతిన్నదని సంజీవ్ చోప్రా చెప్పారు.

ప్రభుత్వం ఇటీవల తీసుకున్న చర్యల ఫలితంగా, రాబోయే రోజుల్లో చిల్లర ధరలు తగ్గుతాయని ఆహార కార్యదర్శి వివరించారు. జులై 20న కిలోకు రూ.48గా ఉన్న అఖిల భారత సగటు చిల్లర ధర ప్రస్తుతానికి రూ.56కు పెరిగిందని, కేవలం 7నుంచి 10 రోజుల వ్యవధిలోనే మిల్లుల వద్ద చక్కెర ధరలు కిలోకు రూ. 47–48నుంచి రూ.62కు పెరిగాయని, ఈ విధమైన పెంపు పూర్తిగా అన్యాయమని చోప్రా చెప్పారు. శుక్రవారం ఆహార కార్యదర్శి సంజీవ్ చోప్రా, ఐఎస్ఎంఎ, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ కో–ఆపరేటివ్ షుగర్ ఫ్యాక్టరీస్ (ఎన్ఎఫ్ఎస్ సిఎఫ్)పారిశ్రామిక సంస్థల ప్రతినిధులను పిలిచి , మిల్లు వెలుపలి ధరలలో ఈ ఆకస్మిక, తీవ్రమైన పెరుగుదల ఆమోదయోగ్యం కాదని ఆక్షేపించారు. ఇటీవల చక్కెర ధరల పెరుగుదలకు, ఇథనాల్ ఉత్పత్తి కోసం చక్కెరను మళ్లించడమే కారణమని చెప్పడం సరికాదని చోప్రా అన్నారు.ఈ వైవిధ్యీకరణ చక్కె ర రంగం ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచిందని, అలాగే, రైతులకు సకాలంలో చెల్లింపులు చేయడానికి కూడా సహాయపడిందని తెలిపారు. నిల్వలు సౌకర్యవంతంగా ఉన్నప్పటికీ, అత్యంత ముందు జాగ్రత్త చర్యగా సుమారు 10లక్షల టన్నుల ముడి చక్కెరను సుంకం లేకుండా దిగుమతి చేసుకోవడానికి ప్రభుత్వం ఆమోదం తెలిపిందని సంజీవ్ చోప్రా వివరించారు. తాను రెండు చక్కెర సంఘాలతో సమావేశాలు నిర్వహించి, గత కొన్ని రోజులుగా జరిగింది సరైనది కాదని వారికి చెప్పినట్లు ఆహార కార్యదర్శి చోప్రా తెలిపారు.

# నియామకాల రద్దు తాజా నోటిఫికేషన్‌పై జార్ఖండ్ హైకోర్టు స్టే

రాష్ట్ర ప్రభుత్వానికి తలనొప్పిగా ఉద్యోగాల వ్యవహారం



**రాంచి:** జార్ఖండ్‌లో విద్యార్థులు, యువత నిరసనలకు తలొగ్గి 2014 నుంచి జరిగిన అన్ని ఉద్యోగ నియామక పరీక్షలను రద్దు చేసిన ప్రభుత్వానికి హైకోర్టు తీర్పులు తలనొప్పిగా మారాయి. ప్రభుత్వం పరీక్షను రద్దు చేస్తూ జారీ చేసిన నోటిఫికేషన్లలో ఒక్కొక్కదానిపై స్టే విధిస్తూ వస్తోంది. తాజాగా బాలల అభివృద్ధి ప్రాజెక్ట్ అధికారుల (సిడిపిఒ) నియామకాలను, అలాగే జెఎస్ఎస్‌సి–సిజిఎల్ పరీక్ష ద్వారా నియమితులైన వారి నియామకాలను రద్దు చేస్తూ జారీ చేసిన నోటిఫికేషన్లపై జార్ఖండ్ హైకోర్టు శుక్రవారం స్టే విధించింది. 11వ, 13వ జార్ఖండ్ పిఎస్‌సి పరీక్షలను రద్దు చేస్తూ జారీ చేసిన నోటిఫికేషన్లపై బుధవారం కోర్టు స్టే విధించడంతోపాటు, ఆహార భద్రతా అధికారుల నియామకాలను రద్దు చేస్తూ జారీ చేసిన ఉత్తర్వుపై కూడా అడ్డుకట్ట వేసింది. 'జార్ఖండ్ స్టాఫ్ సెలక్షన్ కమిషన్–కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ పరీక్ష (జెఎస్ఎస్‌సి–సిజిఎల్) ద్వారా జరిగే నియామకాలను రద్దు చేస్తూ జారీ చేసిన నోటిఫికేషన్‌తో పాటు, సిడిపిఒల నియామకాలను రద్దు చేస్తూ జారీ చేసిన నోటిఫికేషన్ అమలుపై కూడా జస్టిస్ దీపక్ రోషన్ నేతృత్వంలోని ధర్మాసనం శుక్రవారం స్టే విధించింజని పిటిషనర్ తరఫు న్యాయవాది ఇంద్రజిత్ సిన్హా పిటిఐకి తెలిపారు. సెప్టెంబర్ 7న రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేస్తుందని, 14లోగా పిటిషనర్లు రిజాయిండర్ సమర్పిస్తారని ఆయన చెప్పారు. అంతేకాకుండా, సెప్టెంబర్ 15న షెడ్యూల్ ప్రకారం మధ్యాహ్నం 2.15 గంటలకు బదులుగా, మధ్యాహ్నం 12.15 గంటలకే ఈ విషయాన్ని విచారిస్తామని కోర్టు చాలా స్పష్టంగా చెప్పిందని, ఈ విషయాన్ని ప్రాధాన్యతా ప్రాతిపదికన తీసుకున్నట్లు కూడా కోర్టు తెలిపినట్లు ఆయన అన్నారు. పిటిషనర్ల తరఫున వాదించిన న్యాయవాది అమృతాంశ్ వాట్స్ మాట్లాడుతూ, అవసరమైతే సెప్టెంబర్ 16 నుంచి రోజువారీ విచారణలు జరిపి ఈ విషయాన్ని పరిష్కరిస్తామన్న అభిప్రాయంలో కోర్టు ఉందని చెప్పారు. నియామకాలలో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ 25 రోజుల పాటు జరిగిన ఆందోళనల నేపథ్యంలో, జెఎంఎం నేతృత్వంలోని ప్రభుత్వం ఈనెల 18న 22 పరీక్షలను రద్దు చేయగా, 2014 నుంచి నిర్వహించిన మరో 23 పరీక్షలపై విచారణకు ఆదేశించింది.

**సచివాలయం వద్ద ఉద్యోగుల నిరసనలు**

జార్ఖండ్ ప్రభుత్వం రద్దు చేసిన నియామక పరీక్షలలో ఉత్తీర్ణులైన అభ్యర్థులు శుక్రవారం కూడా రాష్ట్ర సచివాలయం బయట ప్రదర్శన నిర్వహించారు. గిరిజన నాయకుడు బిర్సా ముండా, జెఎంఎం వ్యవస్థాపకుడు శిబు సోరెన్ చిత్రపటాలు, ప్లకార్డులతో నిరసన తెలిపారు. వీరిలో జెఎస్ఎస్‌సి కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ (సిజిఎల్) పరీక్ష ద్వారా ఎంపికైన వారు కూడా ఉన్నారు. 'న్యాయ్ దో యా ఫాన్సీ దో (మాకు న్యాయం చేయండి లేదా మమ్మల్ని ఉరితీయండి)', 'షర్మ్ కరో, షర్మ్ కరో (సిగ్గుపడండి)' వంటి నినాదాలు చేశారు. దేవ్‌గఢ్‌కు చెందిన, సంక్షేమ అధికారిగా ఎంపికైన రమేశ్ మండల్ మాట్లాడుతూ తాము ఈనెల 19 నుంచి నిరసన తెలుపుతున్నామని, న్యాయం జరిగే వరకు ఈ ఆందోళనను కొనసాగిస్తామన్నారు. ఎలాంటి కారణం చెప్పకుండా జెఎస్ఎస్‌సి–సిజిఎల్ పరీక్షను రద్దు చేయాలన్న తన నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నట్లు మరో అభ్యర్థి చందా కుమారి అన్నారు. న్యాయవ్యవస్థపై తమకు పూర్తి విశ్వాసం ఉందని, అన్ని పరీక్షలను రద్దు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయంపై కోర్టు స్టే విధిస్తుందని నిరసనకారులు విశ్వాసం వ్యక్తం చేశారు. జెఎస్ఎస్‌సి సిజిఎల్ పరీక్ష ద్వారా ఎంపికైన వారితో సహా, సుమారు 2,700 మంది విజయవంతమైన అభ్యర్థులు ఈ రద్దులకు వ్యతిరేకంగా నిరసన తెలుపుతున్నారు. అవకతవకల కారణంగా మెరిట్ ఆధారంగా ఎంపికైన అభ్యర్థులు తమ ఉద్యోగాలను కోల్పోకూడదని వారు వాదిస్తున్నారు. ఇదిలా ఉండగా, జెఎస్ఎస్‌సి గ్రాడ్యుయేట్ లెవెల్ కంబైన్డ్ కాంపిటీటివ్ ఎగ్జామినేషన్ 2023లో జరిగిన అవకతవకలకు సంబంధించి సిఐడి ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) 37 మంది అనుమానితులను విచారించింది.

# విద్యార్థులకు న్యాయం చేసేలా 'ఆన్సర్ కీ చాలెంజ్'

●ఈ విధానం ఖరీదైనదేమీ కాదు : ఎన్‌టిఎ




**న్యూఢిల్లీ :** నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఎ) తన చర్యలను సమర్థించుకుంది. తాము తమ 'ఆన్సర్ కీ చాలెంజ్' విధానం విద్యార్థులందరికీ న్యాయం జరిగేలా రూపొందించామని పేరొకంది. ఇది ఖరీదైనదన్న ఆందోళనలను తోసిపుచ్చింది. ఎన్‌టిఎ ఆన్సర్ కీ ఛాలెంజ్ అనేది ఒక ఆన్‌లైన్ ప్రక్రియ. దీని ద్వారా జెఇఇ మెయిన్, నీట్, లేదా యుజిసి నెట్ వంటి పరీక్షలు రాసిన అభ్యర్థులు, తాత్కాలిక ఆన్సర్ కీలోని తప్పులపై అభ్యంతరం తెలియజేయవచ్చు. నీట్‌యుజి పేపర్ లీక్ నుండి యుజిసినెట్ పరీక్షలలోని లోపాల వరకు పలు సమస్యలపై ఇటీవల ఎన్‌టిఎ విమర్శలను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. అయితే 'ఆన్సర్ కీ ఛాలెంజ్‌లు చాలా ఖరీదైనవి అనే ఆందోళనపై అభ్యర్థులకు ఒక చిన్న వివరణ. ఆన్సర్ కీ ఛాలెంజ్ విధానం కేవలం సవాలు చేసే విద్యార్థికి మాత్రమే కాకుండా, ప్రతి విద్యార్థికి న్యాయం జరిగేలా రూపొందించబడింది' అని ఎన్‌టిఎ గురువారం రాత్రి ఎక్స్ పోస్టులో తెలిపింది. 'ఒక్క సవాలుతో, అందరూ ప్రయోజనం పొందుతారు. ఒక్క అభ్యర్థి ఒక ప్రశ్నకు సవాలు విసిరినా, సబ్జెక్ట్ నిపుణులు ఆ సవాలును అంగీకరిస్తే, సవరించిన ఆన్సర్ కీ పరీక్ష రాసిన ప్రతి అభ్యర్థికి వర్తిస్తుంది' అని అది పేర్కొంది. నిరాధారమైన సవాళ్లను నిరుత్సాహపరిచేందుకు ఒక సమాధానాన్ని సవాలు చేయడానికి రుసుము వసూలు చేస్తారని, ఆ సవాలు సరైనదని తేలితే ఆ రుసుమును వాపసు ఇస్తారని ఎన్‌టిఎ తెలిపింది. 'ఎవరి సవాలు అయితే ఆమోదించబడుతుందో, ఆ అభ్యర్థికి ప్రతి ప్రశ్నకు రూ. 200 వాపసు ఇవ్వబడుతుంది. ఈ రుసుము నిరాధారమైన సవాళ్లను నిరుత్సాహపరచడానికే ఉంది, నిజమైన సవాళ్ల నుండి లాభం పొందడానికి కాదు' అని ఆ ఏజెన్సీ పేర్కొంది. 'కాబట్టి ఒక నిజమైన తప్పును గుర్తించి, దానిని లేవనెత్తినట్లయితే, అది సరైనదని తేలితే, ఆ రుసుము వాపసు ఇవ్వడమే కాకుండా, ఏ అభ్యర్థి చేసే ఒక సరైన సవాలు లక్షలాది మంది ఇతరుల రికార్డును సరిదిద్దగలదు' అని అది స్పష్టం చేసింది.

# మేఘాలయలో హింస

- ప్రభుత్వ ఆస్తులపై పెట్రోల్ బాంబుదాడులు
- వాహనాలు, మోటార్ సైకిళ్లు దగ్ధం



**షిల్లాంగ్ :** మేఘాలయలో హింసాత్మక ఘటనలు చెలరేగాయి. షిల్లాంగ్‌లో రెండు రోజుల క్రితం విద్యార్థుల బైక్ ర్యాలీ సందర్భంగా చెలరేగిన హింస రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు విస్తరించింది. గత 24 గంటల్లో మేఘాలయ అంతటా ప్రభుత్వ ఆస్తులపై పెట్రోల్ బాంబు దాడులు జరిగాయి. దహన ఘటనలు చోటుచేసుకున్నాయని అధికారులు శుక్రవారం తెలిపారు. అదే సమయంలో, అసోంలో జరిగిన రహదారి దిగ్బంధం కారణంగా అంతర్రాష్ట్ర వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. షిల్లాంగ్‌లోని ఒక పోలీస్ ఔట్‌పోస్ట్‌పై పెట్రోల్ బాంబు విసరగా, రిభోయ్ జిల్లాలో మూడు ప్రభుత్వ వాహనాలు, ఒక మోటార్‌సైకిల్‌కు నిప్పుపెట్టారు. అలాగే, సౌత్ వెస్ట్ ఖాసీ హిల్స్ జిల్లాలోని ఒక ప్రభుత్వ కార్యాలయంపై మరో పెట్రోల్ బాంబు విసిరారు. ఈ ఘటనల్లో ఎవరికీ గాయాలు కాలేదు. అయితే, బుధవారం జరిగిన హింస తర్వాత రాష్ట్రంలో నెలకొన్న ఉద్రిక్తతలకు ఈ దాడులు మరింత ఆజ్యం పోశాయి. శాంతిభద్రతల నిర్వహణలో రాష్ట్ర పోలీసులకు సహాయపడేందుకు, ఆగస్టు 25 వరకు మేఘాలయాలో ఐదు కంపెనీల కేంద్ర బలగాలను మోహరించడానికి కేంద్రం గురువారం ఆమోదం తెలిపింది. షిల్లాంగ్‌లో పరిస్థితి చాలా వరకు ప్రశాంతంగానే ఉంది; అయితే గురువారం రాత్రి 9:30 గంటల సమయంలో నాంగ్‌మెన్‌సాంగ్ పోలీస్ ఔట్‌పోస్ట్‌పై పెట్రోల్ బాంబు విసిరిన ఘటన మినహా పెద్దగా అవాంఛనీయ సంఘటనలేవీ జరగలేదు. ఆ బాంబు ప్రాంగణం లోపల పడగా, ఒక కుర్చీని తగులబడింది. ఆ సమయంలో భవనం పైఅంతస్తులో సిఆర్‌పిఎఫ్ సిబ్బంది ఉన్నారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి, ఆ ప్రాంతంలోని సిసిటివి ఫుటేజీని పరిశీలిస్తామని పోలీసులు తెలిపారు. అదే విధంగా రిభోయ్ జిల్లాలోని సైడెన్ వద్ద ఉన్న నీటి వనరుల శాఖ కార్యాలయ ప్రాంగణంలో ఉదయం 2 గంటల సమయంలో దుండగులు రెండు ప్రభుత్వ వాహనాలు, ఒక మోటార్‌సైకిల్‌కు నిప్పుపెట్టారు. ఒక బొలెరో, ఒక మోటార్‌సైకిల్ పూర్తిగా కాలిపోగా, మరో బొలెరో పాక్షికంగా దెబ్బతింది. ఈ ఘటనలపై పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. సౌత్ వెస్ట్ ఖాసీ హిల్స్ జిల్లాలో, మావ్కిర్వాట్ సమీపంలోని మావ్లాంగ్‌విర్ గ్రామంలో ఉన్న పశుసంవర్ధక, పశువైద్య అధికారి కార్యాలయంపై దుండగులు తెల్లవారుజామున 1 గంట సమయంలో పెట్రోల్ బాంబు విసిరారు. ఆ బాంబు భవనం పైకప్పుపై పడింది, కానీ ఎటువంటి నష్టం వాటిల్లలేదు. పొరుగువారు పేలుడు శబ్దం విన్నారని, కానీ సంఘటనా స్థలంలో ఎవరూ కనిపించలేదని నైరుతి ఖాసీ హిల్స్ ఎస్పీ బి. జిర్వా తెలిపారు. షిల్లాంగ్‌లో జరిగిన హింసాకాండకు సంబంధించి గురువారం పోలీసులు 15 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారని తూర్పు ఖాసీ హిల్స్ ఎస్పీ వివేక్ సియెం తెలిపారు.

## హత్య కేసులో దోషి
# 105 ఏళ్ల వృద్ధుడికి 'సుప్రీం' ఊరట

●హత్య కేసు మూసివేసి, మిగిలిన జైలుశిక్ష రద్దు

**న్యూఢిల్లీ:** హత్య కేసులో దోషిగా ఉన్నటువంటి ఓ 105 ఏళ్ల వ యసున్న జీవితకాల ఖైదీకి సుప్రీంకోర్టు తీసుకున్న నిర్ణయం ఇ ప్పుడు అతనికి స్వేచ్ఛా జీవితాన్ని ప్రసాదించింది. అతడిపై ఉన్న హత్యకేసును శుక్రవారం సుప్రీంకోర్టు మూసివేసింది. జీవితఖైదులో మిగిలి ఉన్న కాలాన్ని రద్దు చేయడంతో పూర్తి కావాల్సిన జైలుశిక్ష నుంచి సంపూర్ణ విముక్తి లభించింది.పశ్చిమ బెంగాల్‌లోని మాల్డా జిల్లాలో 1920లో జన్మించిన మోండల్, 1994లో 68ఏళ్ల వయసులో ఒక హత్యకేసులో దోషిగా నిర్ధారించబడి, 2024 నవంబరు 29వరకు జైలులో ఉన్నారు. ఆ రోజున సుప్రీంకోర్టు అతడికి బెయిల్ మంజూరు చేసింది. శుక్రవారం ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి, జస్టిస వి.మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం పిటిషనర్ వయస్సును పరిగణనలోనికి తీసుకుని, కేసును ముగిస్తున్నామని, ఈ విషయంలో ఏమైనా మిగిలిన శిక్ష ఉంటే దానిని రద్దు చేస్తున్నామని తెలిపింది. యావజ్జీవ కారాగారశిక్ష పూర్తికాకపోయినా అతడిని తిరిగి కస్టడీలోకి తీసుకోబోమని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ పేర్కొంటూ, 2024 మధ్యంతర బెయిల్ ఉత్తర్వును సంపూర్ణమైనదిగా, తుది ఉత్తర్వుగా ప్రకటించారు. ప్రస్తుత రిట్ పిటిషన్ విచారణలో ఉన్నంతకాలం, విచారణ కోర్టు నిర్ణయించే నిబంధనలు, షరతులకు లోబడి పిటిషనర్ రసిక్ చంద్ర మోండల్‌ను మధ్యంతర బెయిల్ / పెరోల్‌పై విడుదల చేయాలని మేం మధ్యంతర ఉత్తర్వుగా ఆదేశిస్తున్నామని కోర్టు గతంలో పేర్కొంది. మోండల్‌కు వయసు సంబంధిత సమస్యలు ఉన్నాయని ధర్మాసనం వెల్లడించింది.2018లో జరిగిన ఒక హత్యకేసులో తనకు విధించిన శిక్షను సవాల్‌చేస్తూ మోండల్ దాఖలు చేసిన అప్పీల్‌ను కలకత్తా హైకోర్టు కొట్టివేసింది.ఆ తర్వాత అతను సుప్రీం కోర్టును ఆశ్రయించగా,అతని అభ్యర్థనను సుప్రీంకోర్టు రద్దు చేసింది. 2020లో అప్పటికే 99ఏళ్ల వయసున్న మోండల్ తన ముదిమి వయస్సు, వయస్సు సంబంధిత అనారోగ్య సమస్యలను కారణంగా చూపుతూ ముందస్తు విడుదల కోరుతూ ఆయన ఒక అభ్యర్థనను దాఖలుచేశారు. మే 2021లో, ఈ వ్యవహారానికి సంబంధించి అత్యున్నత న్యాయస్థానం పశ్చిమ బెంగాల్ ప్రభుతానికి ఒక నోటీసు జారీ చేసింది.

## కొండపైనుంచి దూకి కొడుకు, తల్లిదండ్రులు మృతి

**ఛత్రపతిశంభాజీనగర్:** మొబైల్ ఫోన్ కావాలనే చిన్న గొడవ మహారాష్ట్రలోని ఛత్రపతి శంభాజీనగర్ జిల్లాలో తీవ్ర విషాదాన్ని నింపింది. తిస్‌గావ్ ప్రాంతంలోని ఓ కొండపై శుక్రవారం ఉదయం 19 ఏళ్ల కునాల్ చంద్‌గుడే మొబైల్ ఫోన్ ఇప్పించలేదనే కోపంతో ఆత్మహత్యకు ప్రయత్నించాడు. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న తల్లిదండ్రులు మురళీధర్, సంగీతలు అతన్ని శాంతింపజేసేందుకు ప్రయత్నించారు. స్థానికుల సమాచారంతో పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది కూడా ఘటనా స్థలానికి చేరుకుని, కింద రక్షణ వల ఏర్పాటు చేసేందుకు ప్రయత్నించినా, ఆ యువకుడు స్థానం మారుతూ భయాందోళనకు గురిచేశాడు. తండ్రి ఎంతగానో నచ్చజెప్పడానికి ప్రయత్నిస్తున్నప్పటికీ కునాల్ ఒక్కసారిగా కొండపై నుంచి దూకేశాడు; కొడుకును కాపాడుకునే ఆతృతలో తండ్రి మురళీధర్ కూడా అతని వెంటే దూకి ప్రాణాలు కోల్పోయాడు. కళ్ల ముందే భర్త, కొడుకులు చనిపోవడాన్ని చూసి తట్టుకోలేకపోయిన తల్లి సంగీత కూడా అదే కొండపై నుంచి దూకి బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం నిమిత్తం తరలించగా, ఈ ఘటన ఆ ప్రాంతంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

SHRIRAM Finance వాహనముల బహిరంగ వేలం ప్రకటన

సమస్త ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా ఈ క్రింది వాహనములు వాయిదాలు సకాలంలో చెల్లించని కారణంగా స్వాధీన పరుచుకున్న వాహనములు ఉన్నవి ఉన్నట్లుగా వేలం ద్వారా విక్రయించుటకు నిర్ణయించనైనది.

| S.No | VEHICLE NO | Customer Name | MAKE & MODEL | YEAR |
|---|---|---|---|---|
| 1 | TS27T 4759 | Ashok Annepu | ESCORTS 439 PT | 2020 |
| 2 | TS27G 2336 | Ugendar Munigala | KUBOTA MU 4501 | 2023 |
| 3 | MACH 3029 | Anji Thotte | KUBOTA DC68G TRACK COMBINE HARVESTER | 2019 |
| 4 | TS08UF 8053 | Taja Shekhar Reddy Gumpula | MAHINDRA BOLLERO MAXI TRUCK PLUS | 2019 |
| 5 | AP15TC 3926 | Ellaiah Kasturi | MAHINDRA 275 DI | 2013 |
| 6 | TS27T 1967 | Kumar Shivarathri | SWARAJ 735FE | 2016 |
| 7 | TS07JD 4695 | Mohammed Jaffer Ali | SWIFT VDI DIESEL 5 SEATER | 2014 |
| 8 | TS25E 6973 | Narender Kankati | TIGOR XM BS6 PETROL 5 SEATER | 2021 |
| 9 | AP36TB 4808 | Hrish Ellandula | ESCORT 434PT | 2013 |
| 10 | TS03EP 1930 | Rajesh Jakkula | MAHINDRA 475DI | 2016 |
| 11 | TS10EB 0490 | Bala Swamy Bairapaka | CITY MT DIESEL 5 SEATER | 2014 |
| 12 | TG03T 2649 | Jahnavi Chanda | MAHINDRA JEETO STRONG BS6 DIESEL | 2025 |

AUCTION DATE : 22-08-2026
VENUE : SHRIRAM AUTOMALL INDIA LTD, PUNNEL CROSS ROAD, BOLLIKUNTA, WARANGAL
గమనిక : ప్రకటన తేది నుండి బండి అమ్ముడు అయే వరకు వర్తించును
SHRIRAM FINANCE LIMITED
D.No : 24-7-29,1st Floor, Fathima Complex, Fathimanagar, Kazipet
Cell : 9959090723, 9676049567

SRI GEERVANI COLLEGE OF EDUCATION
(Approved by NCTE and Affiliated to Satavahana University)
CHOPPADANDI (Vill&Mdl), Dist. KARIMNAGAR-505415. Mob: 9848236339, 9989146885
Admission Notification
Category (B) Seats for Management Quota
Applications are invited from qualified candidates for admission in to B.Ed course for the academic year 2026-28 batch under category B management seats. The candidates should submit the filled applications along with all original certificates in the college on or before 31-08-2026
Sd/- Principal

# యెమెన్, సోమాలియా తీరాల్లో రెండు నౌకలు హైజాక్

## 22 మంది భారతీయ నావికులు సురక్షితం

**న్యూఢిల్లీ:** యెమెన్, సోమాలియా తీరాల్లో రెండు వాణిజ్య నౌకలను సాయుధ సముద్ర దొంగలు వేర్వేరు ఘటనల్లో హైజాక్ చేశారు. ఈ రెండు నౌకల్లో కలిపి 22 మంది భారతీయ నావికులు ఉన్నారు. ప్రస్తుతం వారంతా సురక్షితంగానే ఉన్నారని కేంద్ర నౌకాయాన మంత్రిత్వ శాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి శుక్రవారం తెలిపారు. పిటిఐ కథనం ప్రకారం, ఎరిట్రియా జెండాతో ప్రయాణిస్తున్న చమురు ఉత్పత్తుల ట్యాంకర్ ఎంటి సిబా 1ను ఈనెల 20న గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌లో యెమెన్ తీరానికి సుమారు 30 నాటికల్ మైళ్ల దూరంలో దొంగలు స్వాధీనం చేసుకున్నారు. నౌకలో మొత్తం 20 మంది సిబ్బంది ఉండగా, వారిలో 16 మంది భారతీయులు. మిగిలిన వారిలో సిరియా, సూడాన్, ఇరాక్ దేశాలకు చెందిన ముగ్గురు ఉన్నారు. మరో నావికుడి జాతీయతను అధికారులు ఇంకా నిర్ధారించలేదు. రిక్రూట్‌మెంట్ అండ్ ప్లేస్‌మెంట్ సర్వీస్ లైసెన్స్ సంస్థ ఎస్‌కె



ఎస్ కృషి మెరైన్ సర్వీసెస్ ఇచ్చిన సమాచారాన్ని ఉటంకిస్తూ, ఆరుగురు సాయుధ దొంగలు నౌకలోకి ప్రవేశించి దాని నియంత్రణను స్వాధీనం చేసుకున్నారని అధికారులు చెప్పారు. నౌకకు గుర్తింపు లేని మరో నౌక దగ్గరకు వచ్చిన తర్వాత ఈ ఘటన జరిగినట్లు సముద్ర రవాణా ట్రాకింగ్ సమాచారం వెల్లడిస్తోంది. కాగా, మరో ఘటనలో కామెరూన్ జెండాతో ప్రయాణిస్తున్న ఎం/వి లుటఫును ఈనెల 17న సోమాలియాలోని పంట్‌లాండ్ తీరంలో దొంగలు హైజాక్ చేశారు. ఈ నౌకలో 10 మంది సిబ్బంది ఉండగా, వారిలో ఆరుగురు భారతీయులు. ఎనిమిది మంది సాయుధ దొంగలు రెండు చిన్న పడవల్లో వచ్చి, ఎకె47 తరహా ఆయుధాలతో నౌకలోకి ప్రవేశించాసిబ్బంది తొలుత రక్షిత ప్రదేశంలోకి వెళ్లినా, దొంగలు అక్కడికి చేరుకుని వారిని బ్రిడ్జ్‌కు తీసుకెళ్లారు. ఇప్పటివరకు ఎలాంటి గాయాలు నమోదుకాలేదని అధికారులు తెలిపారు. ఈ రెండు ఘటనలు గల్ఫ్ ఆఫ్ ఏడెన్, ఎర్ర సముద్రం, హిందూ మహాసముద్ర ప్రాంతాల్లో వాణిజ్య నౌకలకు పెరుగుతున్న భద్రతా ముప్పును మరోసారి స్పష్టం చేస్తున్నాయి. ఇరాన్, ఇజ్రాయెల్, అమెరికా మధ్య ఉద్రిక్తతల కారణంగా హోర్ముజ్ జలసంధిలోనూ నౌకాయానం ఇప్పటికే ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ప్రపంచంలో సముద్ర నావికు అత్యధికంగా అందిస్తున్న దేశాల్లో భారత్‌ది రెండో స్థానం. 2026 బిఐఎంసిఒఐసిఎస్ నివేదిక ప్రకారం ప్రపంచ వాణిజ్య నౌకల్లో సుమారు 3,11,936 మంది భారతీయ నావికులు పనిచేస్తున్నారు. దీంతో అంతర్జాతీయ సముద్ర మార్గాల్లో భద్రతా పరిణామాలు భారత్‌ను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

### అలాస్కాలో చార్టర్ విమాన ప్రమాదం

# ఎనిమిది మంది మృతి

**జునెయూ (అమెరికా):** అమెరికాలోని అలాస్కాలో చార్టర్ విమానం ప్రమాదానికి గురైన సంఘటనలో ఎనిమిది మంది మృతి చెందారు. పశ్చిమ అలాస్కాలోని మారుమూల కేప్ న్యూనెహామ్ లాంగ్ రేంజ్ రాడార్ సైట్ విమానాశ్రయం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. ఆంకరేజ్‌కు పశ్చిమంగా సుమారు 725 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాంతం ఉంది. విమానంలో ఇద్దరు పైలట్లు, ఆరుగురు ప్రయాణికులు ఉన్నారని అమెరికా నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డు అలాస్కా ప్రాంత అధికారి క్లింట్ జాన్సన్ తెలిపారు. ఆంకరేజ్ నుంచి బయలుదేరిన విమానం కేప్ న్యూనెహామ్‌లో దిగేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో మధ్యాహ్నం ప్రమాదానికి గురైనట్లు అధికారులు చెప్పారు. ఈ రాడార్ కేంద్రం అలాస్కా గగనతలంలో, సరిహద్దుల వెంట ప్రయాణించే విమానాలను పర్యవేక్షించే మారుమూల రాడార్ వ్యవస్థలో ఒక భాగం. కాగా, విమానంలో ఉన్నవారు కీలకమైన విధులు నిర్వహిస్తున్న వృత్తి నిపుణులని అలాస్కన్ కమాండ్ పేర్కొంది. మృతుల కుటుంబాలకు పూర్తి సహకారం అందిస్తామని అమెరికా వైమానిక దళం తెలిపింది. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది.



### రక్షణ, ఇంధన భద్రతపై

# ఇండోనేషియా – చైనా అంగీకారం

**జకార్తా:** రక్షణ సహకారాన్ని మరింత విస్తరించడం, ఆహారం–ఇంధన భద్రతను బలోపేతం చేయడంపై ఇండోనేషియా, చైనా విస్తృత చర్చలు జరిగాయి. ఇరు దేశాల ఉన్నతస్థాయి మంత్రులు శుక్రవారం జకార్తాలో సమావేశమై ద్వైపాక్షిక సంబంధాలపై చర్చించి, పరస్పర సహకారానికి అంగీకరించారు. ఈ చర్చల ద్వారా రాజకీయ, ఆర్థిక, భద్రత, సముద్ర రంగాలతో పాటు ప్రజల మధ్య సంబంధాలను మరింత బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు ఇండోనేషియా విదేశాంగ మంత్రి సుగియోనో తెలిపారు. అభివృద్ధి, భద్రతకు సంబంధించిన అంశాల్లో సమన్వయాన్ని పెంచుకోవాలని ఇరు దేశాలు అంగీకరించాయని చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ చెప్పారు. ఆహారం, ఇంధనం, ఖనిజాల భద్రత కోసం దేశీయ ఉత్పత్తి సామర్థ్యాలను పెంచే పరిశ్రమలను అభివృద్ధి చేయడంపై ఇరు దేశాలు దృష్టి సారించాయి. కృత్రిమ మేధస్సు, కమ్యూనికేషన్ ఉపగ్రహాల సంయుక్త అభివృద్ధి వంటి



అధునాతన సాంకేతిక రంగాల్లోనూ సహకారం పెంచుకోవాలని నిర్ణయించాయి. ఇండోనేషియా ప్రధాన ఎగుమతి వస్తువులకు కొత్త మార్కెట్లు, మెరుగైన మార్కెట్ ప్రాప్యత కల్పించేందుకు వాణిజ్యాన్ని సులభతరం చేయాలని కూడా అంగీకరించాయి. కాగా, రక్షణ రంగంలో ఇండోనేషియా రక్షణ మంత్రి స్జాఫ్రీ స్జామ్‌సొద్దీన్, చైనా రక్షణ మంత్రి డోంగ్ జున్ విడిగా సమావేశమయ్యారు. రక్షణ పరికరాల సహకారం, సిబ్బంది శిక్షణ, రక్షణ పరిశ్రమల మధ్య భాగస్వామ్యంపై చర్చించారు. సంయుక్త సైనిక విన్యాసాలను పెంచాలని ఇండోనేషియా ప్రతిపాదించింది. చైనాతో ఇండోనేషియా ఆర్థిక సంబంధాలు ఇటీవలి సంవత్సరాల్లో గణనీయంగా పెరిగాయి. 2025లో ఇరు దేశాల వాణిజ్యం సుమారు 167 బిలియన్ డాలర్లకు చేరింది. జకార్తా–బాండుంగ్ హైస్పీడ్ రైల్వే, పశ్చిమ జావాలోని సిరాటా తేలియాడే సౌర విద్యుత్ ప్రాజెక్టు వంటి భారీ మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో చైనా పెట్టుబడులు పెట్టింది.

# వ్యతిరేకతను పెంచే చర్యలు

### అమెరికా వైఖరిపై ఇరాన్ విదేశాంగ మంత్రి విమర్శ

**దుబాయ్:** అమెరికా ప్రకటించిన కఠిన ఆర్థిక చర్యలను ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి వ్యతిరేకించారు. ఇటువంటి విఫల విధానాలు ఇరాన్ ప్రజల్లో అమెరికా పట్ల మరింత వ్యతిరేకతను పెంచుతాయని, చివరికి అమెరికాకు మరిన్ని వైఫల్యాలే మిగులుతాయని ఆయన వ్యాఖ్యానించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ఇరాన్‌పై తీవ్రమైన ఆర్థిక చర్యలు తీసుకుంటామని హెచ్చరించిన కొన్ని గంటల తర్వాత అరాఘ్చి స్పందించడం గమనార్హం. ఇరాన్‌ను అపూర్వ స్థాయిలో ఆర్థికంగా ఒంటరి చేసే చర్యలు చేపడతామని ట్రంప్ ప్రకటించినప్పటికీ, వాటి వివరాలను మాత్రం వెల్లడించలేదు. కాగా, అమెరికా ప్రజల దృష్టిని దేశీయ ఆర్థిక సమస్యల నుంచి మళ్లించేందుకే ట్రంప్ ప్రభుత్వం ఇటువంటి బెదిరింపులకు దిగుతోందని అరాఘ్చి ఆరోపించారు. అమెరికా ఆర్థిక ఉగ్రవాదం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను, వివిధ దేశాల ఆర్థిక సార్వభౌమత్వాన్ని దెబ్బతీస్తోందని ఆయన పేర్కొన్నారు. ఇలావుంటే, అమెరికా ఆర్థిక మంత్రి స్కాట్ బెసెంట్ కూడా ఇరాన్‌పై ప్రపంచ చరిత్రలోనే అత్యంత సమన్వయంతో కూడిన ఆర్థిక ఒంటరితనం విధిస్తామని హెచ్చరించారు. ఇరాన్‌తో వ్యాపారం చేసే దేశాలు, సంస్థలపై కూడా ద్వితీయ ఆంక్షలు విధిస్తామని ఆయన తెలిపారు. తమ మిత్రదేశాలు ఇరాన్ విషయంలో ఏ వైపు నిలుస్తాయో నిర్ణయించుకోవాల్సిన సమయం వచ్చిందని బెసెంట్ అన్నారు.

### ట్రంప్‌తో ఒప్పందంపై

# కెనడాలో విభేదాలు

**టొరంటో:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో వాణిజ్య ఒప్పందం కోసం కెనడా మరిన్ని రాయితీలు ఇవ్వడంపై ఆ దేశంలో విభేదాలు వ్యక్తమవుతున్నాయి. అమెరికా అధ్యక్షుడిని చెడ్డ వ్యక్తిగానూ, నమ్మదగని నాయకుడుగానూ మానిటోబా ప్రీమియర్ వాబ్ కిన్యూ అభివర్ణించారు. తొందరపడి రాయితీలు ఇవ్వకుండా కెనడా తన ప్రయోజనాల కోసం పోరాడాలని ఆయన కోరారు. కెనడా–అమెరికా వాణిజ్య ఒప్పందం దాదాపు ఖరారయ్యే దశకు చేరిందని కెనడా వాణిజ్య మంత్రి డొమినిక్ లెబ్లాంక్ తెలిపారు. అయితే పూర్తి వివరాలను ఇరు దేశాలు ఇంకా వెల్లడించలేదు. కెనడా దిగుమతులపై అమెరికా ప్రతిపాదించిన 50 శాతం సుంకాల ముప్పు నేపథ్యంలో చర్చలు సాగుతున్నాయి. ట్రంప్ ప్రభుత్వం ఒత్తిడి చేస్తున్న అంశాల్లో అమెరికా మద్యం విక్రయాలపై కెనడా విధించిన ఆంక్షల తొలగింపు ఒకటి. గతంలో అమెరికా సుంకాలకు ప్రతిస్పందనగా కెనడాలోని ఎనిమిది ప్రావిన్సులు అమెరికా మద్యం విక్రయాలను పరిమితం చేయడం లేదా నిలిపివేయడం వంటి చర్యలు తీసుకున్నాయి. ప్రధాని మార్క్ కార్నీ సూచన మేరకు వాటిని తిరిగి దుకాణాల్లో విక్రయించేందుకు ప్రావిన్సుల ప్రధానులు అంగీకరించినట్లు న్యూఫౌండ్‌ల్యాండ్ అండ్ లాబ్రడార్ ప్రీమియర్ టోనీ వేక్‌హామ్ తెలిపారు. అయితే కిన్యూ మాత్రం అమెరికా ఉత్పత్తుల కొనుగోళ్లను తగ్గించి కెనడియన్ ఉత్పత్తులకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రజలను కోరారు. అమెరికా అధ్యక్షుడు గతంలో భారీ సుంకాలు ప్రకటించి వెనక్కి తగ్గిన సందర్భాలను ప్రస్తావిస్తూ, చర్చల్లో కెనడాదే పైచేయని అన్నారు. క్యూబెక్ ప్రీమియర్ క్రిస్టిన్ ఫ్రెషెట్ కూడా ఒప్పందంపై ఇంకా తుది నిర్ణయం తీసుకోలేదు. రాష్ట్ర ఆర్థిక ప్రభావాన్ని పరిశీలించిన తర్వాతే అమెరికా మద్యం విక్రయాలపై నిర్ణయం తీసుకుంటామని ఆమె తెలిపారు.

### వైద్య పరీక్షల అనంతరం

# తిరిగి జైలుకు ఇమ్రాన్ ఖాన్

**ఇస్లామాబాద్:** పాకిస్థాన్ మాజీ ప్రధాని, పాకిస్థాన్ తెహ్రీక్‌ఇఇన్సాఫ్ (పిటిఐ) వ్యవస్థాపకుడు ఇమ్రాన్ ఖాన్ వైద్య పరీక్షల అనంతరం శుక్రవారం ఉదయం రావల్పిండిలోని అదియాలా జైలుకు తిరిగి చేరుకున్నారు. ఇస్లామాబాద్‌లోని ప్రభుత్వ ఆధ్వర్యంలోని పాకిస్థాన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (పిఐఎంఎస్)లో ఆయనకు పరీక్షలు నిర్వహించారు. షిఫా ఇంటర్నేషనల్ హాస్పిటల్‌కు చెందిన వైద్యులు కూడా ఈ పరీక్షల్లో పాల్గొన్నారు. 73 ఏళ్ల ఇమ్రాన్‌కు తీవ్రమైన ఆందోళన సమస్య ఉందని వైద్య నివేదిక పేర్కొనడంతో, ఈనెల 18న పాకిస్థాన్ సుప్రీం కోర్టు ఆయనను రెండు రోజుల్లో ఆస్పత్రికి తరలించాలని ఆదేశించింది. తొలుత ఆయనను ప్రైవేటు షిఫా ఆస్పత్రికి తరలించినట్లు పిటిఐ వర్గాలు తెలిపాయి. అయితే ఆస్పత్రి వెలుపల పిటిఐ కార్యకర్తలు భారీ సంఖ్యలో గుమికూడడంతో, భద్రతా పరిస్థితుల దృష్ట్యా ఆయనను పిఐఎంఎస్‌కు తీసుకెళ్లామని సమాచార మంత్రి అత్తావుల్లా తరార్ చెప్పారు. కంటి వైద్య నిపుణుడు, కార్డియాలజిస్ట్, ఇతర వైద్యులతో కూడిన బృందం ఇమ్రాన్‌ను పరీక్షించి ఆరోగ్యంగా ఉన్నట్లు ప్రకటించిందని ప్రభుత్వం తెలిపింది. అనంతరం ఉదయం సుమారు 5 గంటలకు ఆయనను అదియాలా జైలుకు తరలించారు. సుప్రీంకోర్టు ఇమ్రాన్‌కు వైద్య బోర్డు ఏర్పాటు చేసి చికిత్స అందించాలని, ఆస్పత్రిలో ఉన్నంతకాలం వారానికి ఒకసారి కుటుంబ సభ్యులను కలిసే అవకాశం కల్పించాలని ఆదేశించింది. అయితే ప్రభుత్వం ఆ ఉత్తర్వులపై పునఃసమీక్ష పిటిషన్ దాఖలు చేయగా, అసంపూర్ణ పత్రాలను కారణంగా చూపుతూ కోర్టు రిజిస్ట్రార్ కార్యాలయం దానిని తిరిగి పంపింది. 2023 ఆగస్టు 5న అవినీతి కేసులో అరెస్టయిన ఇమ్రాన్ అప్పటి నుంచి జైలులోనే ఉన్నారు. ఆయన కుటుంబ సభ్యులు, మద్దతుదారులు వైద్య సదుపాయాలు, కుటుంబ సభ్యులతో భేటీల విషయంలో అధికారులు ఆంక్షలు విధిస్తున్నారని ఆరోపిస్తున్నారు.



## ఎదుర్కొందాం

(మొదటి పేజీ తరువాయి)

ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, పంచాయతీ రాజ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిషోర్, పంచాయతీరాజ్ కమిషనర్ దివ్య దేవరాజన్, వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్రమోహన్, కలెక్టర్లు, డిఆర్‌డిఓలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని ప్రతి గ్రామ పంచాయతీకి ప్రత్యేక వెబ్‌సైట్‌ను మంత్రులు, ప్రధాన కార్యదర్శి ప్రారంభించారు. గ్రామ జనాభా, వనరులు, అవసరాలు, అభివృద్ధి ప్రణాళికలు, శాఖల వారీగా జరుగుతున్న పనులు, నిధుల వినియోగం తదితర సమగ్ర సమాచారాన్ని ఈ వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉంచనున్నట్లు అధికారులు తెలిపారు. తెలంగాణ గ్రామ పంచాయతీలను దేశంలోనే ఆదర్శ గ్రామాలుగా తీర్చిదిద్దే లక్ష్యంతో ఈ డిజిటల్ వ్యవస్థను రూపొందించినట్లు ప్రత్యేక కార్యదర్శి దాన కిషోర్ వెల్లడించారు.

**గ్రామ భవిష్యత్తుకు జిపిఎస్‌ఎపి మార్గదర్శి : సీతక్క**

గ్రామాభివృద్ధి ప్రణాళికలు కేవలం పత్రాలుగా కాకుండా గ్రామ భవిష్యత్తును నిర్దేశించే మార్గదర్శకాలుగా ఉండాలని మంత్రి సీతక్క అన్నారు. గ్రామ వనరులు, అవసరాలు, స్వల్ప, దీర్ఘకాలిక లక్ష్యాలను పరిగణనలోకి తీసుకుని ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. వ్యవసాయ కుటుంబ నేపథ్యం ఉన్న క్షేత్రస్థాయి అధికారులు రైతులకు ప్రత్యామ్నాయ పంటలు, నీటి సంరక్షణపై అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషించాలన్నారు. మహిళా సంఘ భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.

**భూగర్భ జలాల పెంపే ప్రధాన లక్ష్యం : తుమ్మల**

ఎల్‌నినోను ఆపడం మన చేతుల్లో లేకపోయినా దాని ప్రభావాన్ని తగ్గించడం మన చేతుల్లోనే ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. భారీ సాగునీటి ప్రాజెక్టులు ఉన్నప్పటికీ రాష్ట్రంలో సుమారు 30 లక్షల బోరు బావులపై వ్యవసాయం ఆధారపడుతోందని, అందుకే భూగర్భ జలాల పెంపునకు ఉపాధి హామీ పనులను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. రైతులను ప్రత్యామ్నాయ పంటల వైపు ప్రోత్సహిస్తూ ప్రతి ఏడాది రెండు లక్షల ఎకరాల్లో పామాయిల్ సాగు విస్తరణ లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు.

**ముందస్తు ప్రణాళికే విజయానికి మార్గం : వాకిటి**

1951 నుంచి భారత్ 12 సార్లు ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొందని మంత్రి వాకిటి శ్రీహరి గుర్తుచేశారు. రైతులకు కరువును ఎదుర్కొనే అనుభవం ఉన్నప్పటికీ ప్రభుత్వ యంత్రాంగం శాస్త్రీయ అవగాహన కల్పించి, ఆచరణలోకి తీసుకురావాలన్నారు. పంటల మార్పిడి, పశుసంవర్ధక రంగం బలోపేతం, చెరువులు, చెక్‌డ్యామ్‌ల ద్వారా నీటి నిల్వ, మేకలు, గొర్రెల మేత కోసం ప్రత్యేక ప్రాంతాల ఏర్పాటు వంటి చర్యలను చేపట్టాలని సూచించారు.

**ప్రత్యామ్నాయ పంటలకు ప్రాధాన్యం : సిఎస్**

రాష్ట్రంలో ఇప్పటికే విస్తృతంగా వరి సాగు ప్రారంభమైనప్పటికీ ఇంకా సుమారు 20 లక్షల ఎకరాల్లో నాట్లు వేయాల్సి ఉందని ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు తెలిపారు. సెప్టెంబర్‌లో వర్షాభావ పరిస్థితులు తీవ్రం కావచ్చని హెచ్చరిస్తూ, ఆయా ప్రాంతాలకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించాలని అధికారులకు సూచించారు. పెరిఅర్బన్ ప్రాంతాల్లో వ్యవసాయం, ఉద్యానవనం, పూల సాగు, అనుబంధ పరిశ్రమలకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు.

**నీటి సంరక్షణ పనులకు విబి–జీ రామ్ జీ నిధులు : ఎంపి వేం నరేందర్ రెడ్డి**

కేవలం లక్ష్యాల సాధన కోసం కాకుండా ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనం చేకూర్చే నీటి సంరక్షణ పనులకే విబిజీ రామ్‌జీ నిధులను వినియోగించాలని ఎంపి వేం నరేందర్ రెడ్డి అన్నారు.

## మెరుపుధర్నా

(మొదటి పేజీ తరువాయి)

భయపడుతున్నారని విమర్శించారు. రాహుల్ గాంధీ మొదట లోచబ్‌తో కలిసి మందిర్ మార్గ్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని కోరారు. అక్కడ ఆయన డిమాండ్ అంగీకరించబడకపోవడంతో, పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ (న్యూఢిల్లీ జిల్లా) సచిన్ శర్మను కలిశారు. శర్మతో జరిపిన చర్చలు ఫలితాన్ని ఇవ్వకపోవడంతో, రాహుల్‌గాంధీ పోలీస్ స్టేషన్ (ఇక్కడే డిసిపి కార్యాలయం కూడా ఉంది) వద్ద ధర్నాకు దిగారు. లోచబ్, అతని తల్లి కూడా ఆయనతో పాటు ఉన్నారు. కాంగ్రెస్ ఎంపి ప్రియాంక గాంధీ వాద్రా, ఇతర పార్టీ సీనియర్ నాయకులు కూడా ఈ నిరసనలో పాల్గొన్నారు. ఒక పోలీసు అధికారి మాట్లాడుతూ, 'న్యూఢిల్లీ డిసిపి రాహుల్‌గాంధీతో సంప్రదింపులు జరుపుతున్నారు. ఢిల్లీ పోలీసుల క్రైమ్ బ్రాంచ్ అన్ని ఫిర్యాదులను పరిశీలిస్తున్నందున, లోచబ్ ఫిర్యాదును కూడా తదుపరి విచారణ కోసం క్రైమ్ బ్రాంచ్‌కు పంపుతాము' అని తెలిపారు. నీట్ పేపర్ లీక్, పరీక్షలో అవకతవకల ఆరోపణలకు వ్యతిరేకంగా సిజెపి ఆధ్వర్యంలో జరిగిన నిరసనలో లోచబ్ కళ్లు, పొట్ట భాగంలో పెల్లెట్ గాయాలకు గురయ్యారు. ఆ తర్వాత ఆయన ఎయిమ్స్ ట్రామా సెంటర్‌లో శస్త్రచికిత్స చేయించుకున్నారు. 'ఎఫ్‌ఐఆర్ నమోదు చేయాలని మాత్రమే మేము కోరుతున్నాము. సాహిల్ ఇక్కడే ఉన్నాడు, అతని తల్లి కూడా అతనితో ఉన్నారు. పైస్థాయి నుంచి ఆదేశాలు ఉన్నందున ఎఫ్‌ఐఆర్ నమోదు చేయలేమని పోలీసు అధికారులు చెబుతున్నారు. ఎఫ్‌ఐఆర్ నమోదు అయ్యేవరకు ఇక్కడి నుంచి కదలము' అని రాహుల్ గాంధీ విలేకరులతో అన్నారు. ఎఫ్‌ఐఆర్ నమోదు, దర్యాప్తు అధికారి పేరు తెలియజేయడమే మా ఏకైక డిమాండ్, ఈ కుటుంబానికి న్యాయం జరగాలని మాత్రమే తాము కోరుకుంటున్నామన్నారు. ఒక యువకుడిపై కాల్పులు జరపవచ్చు కానీ, అమిత్ షా మంత్రిత్వ శాఖ పరిధిలోని ఢిల్లీ పోలీసులు బాధితుడికి న్యాయం చేయడం లేదు అని గాంధీ పేర్కొన్నారు. లోచబ్ గురించి ప్రస్తావిస్తూ, అతని కంటిలో మూడు పెల్లెట్లు (లోహపు గుళికలు) ఉన్నట్లు గుర్తించారు అని కాంగ్రెస్ నేత చెప్పారు. అయితే తాము పెల్లెట్ గన్‌లను ఉపయోగించలేదని ఢిల్లీ పోలీసులు చెప్పారు, కానీ ఎవరో ఒకరు కచ్చితంగా వాటిని ఉపయోగించి ఉంటారు, అతని శరీరంలో పెల్లెట్లు దొరకడాన్ని బట్టి చూస్తే నేరం జరిగిందని స్పష్టమవుతోంది. ఆగస్టు 13 నుండి లోచబ్ తల్లిని ఒక పోలీస్ స్టేషన్ నుండి మరొక స్టేషన్‌కు తిప్పుతున్నారు, కానీ ఇప్పటివరకు ఎటువంటి ఎఫ్‌ఐఆర్ నమోదు చేయలేదు' అని మండిపడ్డారు. అంతకుముందు ఎక్స్ వేదికగా హిందీలో చేసిన పోస్ట్‌లో 'శాంతియుత నిరసనపై జరిగిన అరాచకం లేదా క్రూరత్వం ఒక తీవ్రమైన నేరం' అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. 'జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా నిరసన తెలుపుతున్న సాహిల్‌పై పోలీసులు జూలై 20న పెల్లెట్ గన్‌తో దాడి చేశారు. పెల్లెట్ల దాడిలో తీవ్రంగా గాయపడిన సాహిల్ ఒక కంటి చూపు కోల్పోయే ప్రమాదం ఏర్పడింది'అని ఆయన అన్నారు. లోచబ్, అతనిలా బాధితులైన ప్రతి విద్యార్థికి న్యాయం జరిగేలా చూస్తానని ఆయన స్పష్టం చేశారు. 'ఎఫ్‌ఐఆర్ నమోదు అవుతుంది. న్యాయ విచారణ జరుగుతుంది. అలాగే ఈ అరాచకానికి బాధ్యులైన వారిపై పై స్థాయి నుండి కింది స్థాయి వరకు చర్యలు తీసుకుంటాం. సాహిల్, అతనిలా బాధితులైన ప్రతి విద్యార్థికి మేము న్యాయం చేకూరుస్తాం' అని ప్రతిపక్ష నేత స్పష్టం చేశారు.

## తీసుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

కాంగ్రెస్ నేతలు ప్రశ్నించారు. ''సుస్మిత వ్యాఖ్యలతో సంబంధం లేదని మంత్రి కొండా సురేఖ చెప్పటం సరికాదు. ఆమె వ్యాఖ్యలతో సంబంధం లేకపోతే సురేఖ ఖండించాలి. కొండా సురేఖ గతంలోనూ నోరు జారి పార్టీకి ఇబ్బంది తెచ్చిపెట్టారు. కొండా కుటుంబం భాష ఎప్పుడూ పార్టీకి తలనొప్పిగానే ఉంది. మీ వ్యాఖ్యలకు సిఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోంది. ఇలా మాట్లాడే వారిపై ఏఐసీసీ చర్యలు తీసుకోవాలి. కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చేందుకు సిఎం రేవంత్ రెడ్డి, వారి సోదరులు కష్టపడ్డారు. సిఎం, పార్టీ గురించి వారు బహిరంగంగా మాట్లాడటం సరికాదు. ఏదైనా ఉంటే సిఎల్పీ, టిపిసిసి సమావేశంలో మాట్లాడాలి. సిఎంపై ఎవరు తప్పుడు ఆరోపణలు చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నాం. సిఎంకు సొంత పార్టీ నేతలు అండగా ఉండాలి కానీ, పార్టీలో ఉంటూ సిఎం నిర్ణయాన్ని తప్పుపట్టడం సరికాదు. చెట్టు మీద ఉండి. ఆ చెట్టు కొమ్మనే నరుక్కునే వైఖరి సరి కాదు. సుస్మిత వ్యాఖ్యలు ప్రతిపక్షాలకు బలం ఇచ్చినట్టు అవుతుంది'' అని పలువురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, కాంగ్రెస్ షోకాజ్ నోటీసుల అంశంలో తాను చెప్పాల్సింది క్రమశిక్షణ కమిటీకి చెప్పానని మంత్రి కొండా సురేఖ అన్నారు. ఈ విషయంపై ఇప్పుడు మాట్లాడబోనని చెప్పారు. నేను చెప్పాల్సింది నిన్ననే క్రమశిక్షణ కమిటీకి చెప్పా. ఇప్పుడు కొత్తగా చెప్పాల్సిన విషయాలేమీ లేవు. సిఎం రేవంత్ విదేశీ పర్యటన నుంచి వచ్చాక మాట్లాడతాను''అని కొండా సురేఖ స్పష్టం చేశారు. మరోవైపు కొండా సురేఖ కుమార్తె చేసిన వ్యాఖ్యలపై సిఎం రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. కాంగ్రెస్ అధిష్టానం కూడా సీరియస్‌గా తీసుకున్నట్లు సమాచారం. బుధవారం ఢిల్లీలో జరిగిన కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొన్న సిఎం గురువారం లండన్ పర్యటనకు బయలుదేరి వెళ్లారు. ఢిల్లీలో ఉన్నప్పుడే సిఎం కొందరు ముఖ్యనాయకులతో మాట్లాడుతూ మంత్రిపై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఉప ముఖ్యమంత్రితోనూ, మరి కొందరు మంత్రులతోనూ మాట్లాడినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. మంత్రి సురేఖపై చర్యలు తప్పవని హెచ్చరించినట్లు తెలిసింది. మూడురోజుల క్రితం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించారు. సమ్మక్కసారలమ్మను దర్శించుకోవడంతో పాటు ములుగు, పరకాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న విషయం తెలిసిందే. అయితే ఈ కార్యక్రమాల్లో వరంగల్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న కొండా సురేఖ పాల్గొనలేదు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని మంత్రి కొండా సురేఖ తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నారు. మరో వైపు పరకాల బహిరంగ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాస్ రెడ్డిని భారీ ఆధిక్యతతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో రేవూరే అభ్యర్థి అనే సంకేతం ఇచ్చినట్లయ్యింది. ఇది జరిగిన మరుసటి రోజే కొండా సురేఖ కుమార్తె పరకాల నియోజకవర్గంలోని గీసుకొండలో సభ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రిపై, స్థానిక ఎమ్మెల్యేపై తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీచేస్తానని ప్రకటించారు. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులివ్వడంతో పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## నిరాకరణ

(మొదటి పేజీ తరువాయి)

పర్యటనకు అనుమతి ఇవ్వడంలేదని రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం తెలియజేసింది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి విదేశీ పర్యటనపై కేంద్ర విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జైస్వాల్ మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి యునైటెడ్ కింగ్డమ్ (బ్రిటన్) పర్యటనకు అనుమతి ఇచ్చాం అని తెలిపారు. అమెరికా పర్యటనకు అనుమతి నిరాకరించడంపై ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రులు, ఇతర ప్రముఖుల విదేశీ పర్యటనలకు రాజకీయ అనుమతి ఇచ్చే ముందు కేంద్ర విదేశాంగ శాఖ ఆయా పర్యటనలను పరిశీలిస్తుంది. ప్రతిపాదిత కార్యక్రమాలు వారు నిర్వహిస్తున్న పదవికి, పర్యటన ఉద్దేశానికి తగిన విధంగా ఉండాలి. ఈ విషయంలో అమెరికా పర్యటనకు సంబంధించిన కార్యక్రమం ఆ ప్రమాణాలకు అనుగుణంగా లేదని భావించాం. అందుకే అమెరికా పర్యటనకు రాజకీయ అనుమతి నిరాకరించాం అని స్పష్టం చేశారు. ఇదిలా ఉండగా తెలంగాణ అభివృద్ధి, విద్యా రంగ పురోగతికి, అలాగే వికసిత్ భారత్ నిర్మాణానికి తోడ్పడే ఈ పర్యటనకు రాజకీయ కారణాలతో అనుమతి నిరాకరించడం పట్ల ముఖ్యమంత్రి తీవ్ర విస్మయం వ్యక్తం చేశారు. అయినప్పటికీ కేంద్ర నిర్ణయాన్ని గౌరవిస్తూ లండన్ నుంచి హైదరాబాద్‌కు తిరిగి రావాలని, బోస్టన్, అమెరికా పర్యటనకు వెళ్లకూడదని నిర్ణయించుకున్నారు. 'షెడ్యూల్ ప్రకారం ఇంగ్లాండ్‌లో సిఎం రేవంత్ రెడ్డి ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, లండన్ బిజినెస్ స్కూల్, యూనివర్సిటీ ఆఫ్ లండన్ తదితర సంస్థలను సందర్శించి, వాటి ప్రతినిధులతో సమావేశాలు కొనసాగించనున్నారు. యునైటెడ్ కింగ్‌డమ్‌లోని ప్రముఖ క్రీడా సంస్థలు, నైపుణ్యాభివృద్ధి రంగ నాయకులతో సమావేశమై, తెలంగాణతో భాగస్వామ్యాలను అధికారికంగా ఖరారు చేసేందుకు ఈ పర్యటనలో సిఎం ప్రయత్నిస్తారు' అని ముఖ్యమంత్రి కార్యాలయం తెలియజేసింది. కేంద్ర నిర్ణయంపై సిఎం రేవంత్ రెడ్డి స్పందిస్తూ ''తన విదేశీ పర్యటన ఉద్దేశం ఒక్కటే. కేంద్రం తీసుకొచ్చిన నూతన విద్యా విధానంలో భాగంగా ప్రపంచంలోని ప్రఖ్యాత విద్యా సంస్థలను భారత్‌కు, తెలంగాణకు, హైదరాబాద్‌కు తీసుకురావడం. అత్యుత్తమ ఐవీ లీగ్ విశ్వవిద్యాలయాలను, ప్రపంచంలోని అగ్రశ్రేణి విద్యాసంస్థల నుంచి విద్య, నైపుణ్యాలు, శిక్షణ పొందాలనే దేశ, రాష్ట్ర యువత ఆకాంక్షలకు ఇవి సమాధానంగా నిలిచేవి'' అని పేర్కొన్నారు. దేశ నిర్మాణం, యువత భవిష్యత్తు విషయానికి వస్తే అందరూ రాజకీయాలు, ఎన్నికలకు అతీతంగా ఆలోచించాలని తాను ఎప్పుడూ విశ్వసిస్తానని సిఎం వ్యాఖ్యానించారు. వివిధ విశ్వవిద్యాలయాలతో ఇప్పటికే సంప్రదింపులు జరిపిన నేపథ్యంలో అమెరికా పర్యటనకు సంబంధించిన కార్యక్రమాలను అధికారుల బృందం కొనసాగించాలని, వివిధ విశ్వవిద్యాలయాలతో అవసరమైన అన్ని అవగాహన ఒప్పందాలు (ఎంఓయులు), భాగస్వామ్య ఒప్పందాలను పూర్తి చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్‌ను ప్రపంచంలోని అగ్రశ్రేణి నగరాల్లో ఒకటిగా తీర్చిదిద్దాలన్నది నా సంకల్పం, ప్రయత్నం. ఒక సాధారణ భారతీయుడు హైదరాబాద్‌లోనే హార్వర్డ్, ఆక్స్‌ఫర్డ్ లేదా ఎంఐటి, ఎల్‌బిఎస్, ఎల్‌ఎస్‌ఈ వంటి ప్రపంచ స్థాయి సంస్థల నుంచి విద్య, సర్టిఫికేషన్ పొందగలగాలని సిఎం అన్నారు. చాలామంది నాయకులు తమ పిల్లలను విదేశాలకు పంపాలని కోరుకుంటున్నారని, కానీ తాను ప్రపంచంలోని అత్యుత్తమ విద్యా సంస్థలను భారత్‌కు తీసుకురావాలని అభిలషిస్తున్నానని సిఎం ఈ సందర్భంగా తెలిపారు. ''హైదరాబాద్‌ను ప్రపంచ స్థాయి నాలెడ్జ్ హబ్‌గా తీర్చిదిద్దుతాం. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి హెచ్‌సియు, జెఎన్‌టియు తదితర విశ్వవిద్యాలయాల ఏర్పాటు హైదరాబాద్‌ను అత్యుత్తమ మానవ వనరుల కేంద్రంగా మార్చింది. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ ఒక పాఠశాల ప్రపంచానికి నాయకత్వం వహించగలమని నిరూపించింది. అక్కడి నుంచి ప్రపంచంలోని గొప్ప టెక్ నాయకుల్లో కొందరు రూపుదిద్దుకున్నారు. ఐఐటి, ఐఎస్‌బి, ఐఐఐటి, నల్సార్ వంటి సంస్థల ఏర్పాటుతో హైదరాబాద్ అగ్రశ్రేణి కార్పొరేషన్లు, వాటి గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లను ఆకర్షించగలిగింది. ఇప్పుడు ప్రపంచంలోని ప్రఖ్యాత విద్య, నైపుణ్య సంస్థలకు హైదరాబాద్‌ను కేంద్రంగా మార్చి, 21వ శతాబ్దపు మన ప్రగతి ప్రయాణానికి శక్తినిస్తాం'' అని ఈ సందర్భంగా సిఎం పేర్కొన్నారు.

## కన్నుమూత

(మొదటి పేజీ తరువాయి)

టి. వెంకోజీరావు పేపర్ పరిశ్రమలో నిపుణుడు. ఈయన ఇంగ్లాండులో మూడేళ్ళపాటు పేపర్ మ్యానుఫాక్చరింగ్ అండ్ కెమికల్ ఇంజనీరింగ్ చదివి వచ్చాడు. ఆమె తల్లి శచీదేవి, అస్సాం రాష్ట్రం గౌహతిలో మెట్రిక్యులేషన్ వరకు చదివింది. జానకి చిన్ననాడే రంగస్థల నాటకాలలో పలు పాత్రలు పోషిస్తూ నటిగా కెరీర్ ప్రారంభించింది. తన 11వ ఏటనే రేడియోలో ఒక తెలుగు కార్యక్రమంలో పాల్గొంది. ఆమె మొట్టమొదటి చిత్రం షావుకారు (1950). ఇది ఆమె ఇంటి పేరైపోయింది. ఆమె తెలుగు, తమిళ, కన్నడ భాషలలో 385 చిత్రాలలోను, 3 హిందీ సినిమాలలోను, ఒక మలయాళం సినిమాలోనూ నటించింది. తెలుగు కథానాయకి కృష్ణకుమారి ఆమెకు స్వయానా చెల్లెలు. జాతీయ ఫిల్మ్ అవార్డులకు, తెలుగు సినిమా అవార్డులకు కమిటీకి చైర్మన్‌గా పని చేసింది. విజయా ప్రొడక్షన్స్ వారి షావుకారు (1950) ఆమె మొదటి సినిమా. 1949లో రక్షరేఖ అనే సినిమాలో చంద్రికగా నటించింది. తరువాత ఆమె షావుకారు జానకిగా ప్రసిద్ధురాలయ్యింది. ఆనాటి ప్రముఖ నటులందరి సరసన నటించింది. అనేక పురస్కారాలు పొందింది. తెలుగులో ఆమె సినిమాలలో ప్రసిద్ధమైనవి షావుకారు, డాక్టర్ చక్రవర్తి (1964), మంచి మనసులు (1962), రోజులు మారాయి (1955) ఉన్నాయి. 2023లో ఆమె నటించిన చివరి తెలుగు సినిమా 'అన్నీ మంచి శకునాలే' . 2022లో అప్పటి రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకున్నారు.

**జానకి ఇంట అవార్డుల పంట**

దక్షిణాది భారత సినిమాకి చేసిన కృషికి ఫిలింఫేర్ లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు సౌత్ పురస్కారం 1984లోనే అందుకున్నారు. 1985లో మహానటి సావిత్రి అవార్డు, 1985లో ఆమె ఎంచుకున్న రంగంలో శ్రేష్ఠత కోసం అరిజోనాలోని వరల్డ్ యూనివర్శిటీ నుండి గౌరవ డాక్టరేట్ పట్టా పొందారు. 1989లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దియోనారా గోల్డెన్ అవార్డు, 2004లో నడిగర్ తిలగం శివాజీ జీవితకాల సాఫల్య పురస్కారం, 2000లో డాక్టర్ అక్కినేని నాగేశ్వరరావు జీవిత సాఫల్య పురస్కారం. కర్ణాటక రాష్ట్రం నుంచి శ్రీ కృష్ణ దేవరాయ అవార్డు, 1969–1970 లో తమిళనాడు ప్రభుత్వం ద్వారా కలైమామణి, 1990లో తమిళనాడు రాష్ట్ర చలనచిత్ర గౌరవ పురస్కారం ఎంజీఆర్ అవార్డు, 1970లో ఇరు కోడుగల్ చిత్రానికి ఉత్తమ నటిగా తమిళనాడు రాష్ట్ర చలనచిత్ర అవార్డు, 1987లో సంసారం ఒక చదరంగం చిత్రానికి ఉత్తమ సహాయ నటిగా నంది అవార్డు, 2007లో అమూల్యం చిత్రానికి ఉత్తమ సహాయ నటిగా నంది అవార్డు, సైమా జీవితకాల సాఫల్య పురస్కారం (2013). కర్ణాటక ప్రభుత్వం నుండి రాజ్యోత్సవ అవార్డు (2015), స్త్రీరాత్నా అవార్డ్స్ (2019), వండర్ ఉమెన్ అవార్డ్స్ భారతీయ సినిమా ఎవర్‌గ్రీన్ ఎంటర్‌టైనర్, తమిళనాడు ప్రభుత్వం నుండి పురచ్చి తలైవి డాక్టర్ జె. జయలలిత స్పెషల్ కలైమామణి అవార్డు (2020), భారత ప్రభుత్వం చే పద్మశ్రీ పురస్కారం (2022) ఇలా ఆమె అవార్డులను అందుకున్నారు.

# ఇప్పట్లో జట్టు మారే ఉద్దేశం లేదు

## అర్జున్ టెండూల్కర్



దిగ్గజ క్రికెటర్ సచిన్ తనయుడిగా మనందరికీ సుపరిచితుడైన అర్జున్ టెండూల్కర్ కీలక నిర్ణయం తీసుకున్నాడు. ఐపిఎల్‌లో అవకాశాలు రాక.. ఇటు టీమిండియాకు ఆడాలన్న కల కలగానే ఉండిపోగా.. దేశవాళీలో మాత్రం ఒకే జట్టుకు ఆడాలని భావిస్తున్నాడు. నాలుగేళ్ల క్రితం గోవాకు మారిన అర్జున్.. ఇప్పట్లో తనకు జట్టు మారే ఉద్దేశం లేదంటున్నాడు. కెరీర్ పరంగా ఒడిదొడుకులు ఎదుర్కొంటున్న అర్జున్ టెండూల్కర్ దేశవాళీ క్రికెట్‌పై దృష్టి సారించనున్నాడు. కొన్నాళ్లుగా గోవాకు ఆడుతున్న అతడు ఈమధ్య ఆ జట్టు ఒమన్ పర్యటనకు దూరమయ్యాడు. దాంతో, టెండూల్కర్ జట్టు మారుతున్నాడనే వార్తలు వచ్చాయి. అయితే.. తాను మాత్రం గోవాకే కట్టుబడి ఉన్నానని చెబుతున్నాడీ పేసర్. 2022% 23 సీజన్‌కు ముందు ముంబైను వీడి గోవాకు మారిన అతడు.. మరికొన్ని సీజన్లు జట్టు మారే ఆలోచన చేయడం లేదు. ఇప్పటివరకూ అర్జున్& గోవా తరఫున 50 వికెట్లు తీశాడు. ఐపిఎల్ 19వ సీజన్‌కు ముందు లక్నో సూపర్ జెయింట్స్ అర్జున్ టెండూల్కర్‌ను ట్రేడ్ పద్ధతిన తీసుకుంది. ఒక పాడ్‌కాస్ట్ షోలో మాట్లాడిన అర్జున్ బెంచ్ మీద ఉండడం ఇష్టం లేకనే ముంబైని వదిలేశానని చెప్పాడు. అయితే.. లక్నో జెర్సీతో కూడా అతడి రాత మారలేదు. లీగ్ దశలో చివరి మ్యాచ్‌కు మాత్రమే అర్జున్‌కు అవకాశం దక్కింది. ఫస్ట్‌క్లాస్ ఎంట్రీకి ముందు అర్జున్ మహారాష్ట్ర, గోవా తరఫున 7 లిస్ట్ ఏ మ్యాచ్‌లు, 9 టీ20లు మాత్రమే ఆడాడు. రంజీ ట్రోఫీలో ఆడాలన్న తన కలను నిజం చేసుకున్నాడు. గోవా జట్టు తరఫున రంజీ ట్రోఫీలో బరిలోకి దిగాడు. పొర్‌వోరిమ్ స్టేడియంలో రాజస్థాన్‌తో ఎలైట్ గ్రూప్ సీ మ్యాచ్‌లో బౌలింగ్ ఆల్‌రౌండర్‌గా తొలి మ్యాచ్ ఆడాడు.

# 23న బాల్ బాడ్మింటన్ అండర్–16 సెలక్షన్ ట్రయల్

**హైదరాబాద్:** సంగారెడ్డి జిల్లా, బిహెచ్ఇఎల్ ఎంఐజిలోని శ్రీవాణి విద్యా నికేతన్ స్కూల్‌లో ఈనెల 28 నుంచి 30వ తేదీ వరకు జరిగే హైదరాబాద్ జిల్లా బాల్‌బాడ్మింటన్ చాంపియన్‌షిప్స్‌లో పాల్గొనే క్రీడాకారుల ఎంపిక కోసం సెలక్షన్ ట్రయల్‌ను నిర్వహిస్తున్నట్టు హైదరాబాద్ జిల్లా బాల్‌బాడ్మింటన్ సంఘం కార్యదర్శి ఎం. శ్రీనివాస ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్–16 బాలురు, బాలికల విభాగాల్లో జరిగే ఈ ట్రయల్స్‌లో ఎంపికైన వారికి జిల్లా చాంపియన్‌షిప్స్‌లో పోటీపడే అవకాశం ఉంటుందని తెలిపారు. వనస్థలిపురం ఎన్‌జిఓస్ కాలనీలోని సర్దార్ వల్లభాయ్ పటేల్ గ్రౌండ్స్‌లో ఈనెల 23వ తేదీన ఉదయం 10 గంటల నుంచి ప్రారంభమయ్యే ట్రయల్‌ను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 9490682199, 6304070944, 9440344853 నంబర్లను సంప్రదించవచ్చని శ్రీనివాస ప్రసాద్ తమ ప్రకటనలో తెలిపారు.

# చరిత్ర సృష్టించిన గాయత్రి-ట్రీసా జోడీ

**15 ఏళ్ల తర్వాత భారత్‌కు పతకం!**

బిడబ్ల్యుఎఫ్ వరల్డ్ ఛాంపియన్‌షిప్స్‌లో భారత అమ్మాయిలు పతకం ఖరారు చేశారు. మహిళల డబుల్స్‌లో సంచలన ఆటతో దూసుకెళ్తున్న గాయత్రి గోపిచంద్, త్రీసా జాలీ ద్వయం 15 ఏళ్ల నిరీక్షణకు తెరదించింది. 16వ రౌండ్‌లో ఏడో సీడ్‌కు షాకిచ్చిన ఈ ద్వయం.. ఈసారి 32వ రౌండ్‌లో నాలుగో సీడ్‌పై సంచలన విజయం సాధించింది. క్వార్టర్ ఫైనల్లో అడుగుపెట్టడం ద్వారా దేశానికి చరిత్రాత్మక పతకం అందించనుందీ జంట. బ్యాడ్మింటన్ వరల్డ్‌కప్‌లో భారత అమ్మాయిలు చరిత్రాత్మక పతకం అందించారు. పీవీ సింధు విఫలమైనా మేమున్నాం అని చాటుతూ.. మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపిచంద్, త్రిసా జాలీలు 15 ఏళ్ల కరువు తీర్చారు. 16వ రౌండ్‌లో ఏడో సీడ్‌ను ఇంటికి పంపిన ఈ జంట.. శుక్రవారం నాలుగో సీడ్ జియా యీ ఫాన్ – ఘూంగ్ షు గ్జియాన్(చైనా)ను చిత్తు చేసింది. హోరాహోరీగా సాగిన మ్యాచ్‌లో తొలి సెట్‌ను 1621తో కోల్పోయినా ఒత్తిడికి లోనవ్వని భారత ద్వయం రెండో సెట్‌ను 2115తో గెలుచుకుంది. నిర్ణయాత్మక మూడో సెట్‌లోనూ చైనా జోడీకి చెక్ పెడుతూ 2113తో మ్యాచ్‌ను ముగించింది గాయత్రి, త్రిసా జంట. తద్వారా.. అశ్విని పొన్నప్ప, గుత్తా జ్వాల అనంతరం.. మహిళల డబుల్స్‌లో పతకం ఖాయం చేసిన రెండో జంటగా వీరు రికార్డు నెలకొల్పారు. 2011లో జ్వాల, అశ్వినిలు కాంస్యం సాధించారు.



# క్వార్టర్ ఫైనల్లో సాత్విక్ జోడీ ఓటమి..

బిడబ్ల్యుఎఫ్ ఛాంపియన్‌షిప్స్ డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్ – చిరాగ్ శెట్టి పోరాటం ముగిసింది. కచ్చితంగా పతకం గెలుస్తారనుకున్న ఈ ద్వయం క్వార్టర్ ఫైనల్లోనే నిష్క్రమించింది. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో వరల్డ్ నంబర్ 3 లియాంగ్ వీ కెంగ్ – వాంగ్ చాంగ్ ధాటికి భారత జోడీ చేతులెత్తేసింది. దాంతో, మూడోసారి ఈ టోర్నమెంట్‌లో పతకంతో మురవాలనుకున్న సాత్విక్ – చిరాగ్ ఆశలు ఆవిరయ్యాయి. నెదర్లాండ్స్ వేదికగా జరుగుతున్న బిడబ్ల్యుఎఫ్ ఛాంపియన్‌షిప్స్‌లో శుక్రవారం భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. మహిళల డబుల్స్‌లో గాయత్రి గోపిచంద్ – త్రిసా జాలీ ద్వయం క్వార్టర్ ఫైనల్‌కు దూసుకెళ్లగా.. పురుషుల జంట మాత్రం నిరాశపరిచింది. ఈ ఛాంపియ న్‌షిప్స్‌లో ఇది వరకు రెండుసార్లు మెడల్ కొల్లగొట్టిన సాత్విక్ సాయిరాజ్ – చిరాగ్ శెట్టి జోడీ క్వార్టర్స్ దాటలేదు. మూడో సీడ్ లియాంగ్ వీ కెంగ్ – వాంగ్ చాంగ్‌తో పోరులో తేలిపోయిన భారత జంట 1821, 921తో చిత్తుగా ఓడింది. తొలి సెట్‌లో కాస్త పోరాడినా.. రెండో సెట్‌లో ప్రత్యర్థికి బదులివ్వలేక మ్యాచ్‌ను అప్పగించేసింది సాత్విక్ చిరాగ్ ద్వయం.

**సైన్స్**

# అనాదిగా ఆకాశాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం

## ప్రాచీన నాగరికతల నుంచి శాస్త్రీయ విప్లవం వరకు

ఖగోళశాస్త్ర చరిత్ర మానవ నాగరికత చరిత్రతో ముడిపడి ఉంది. భారతదేశం, బాబిలోనియా, ఈజిప్టు, గ్రీసు, చైనా, పర్షియా వంటి ప్రాంతాల్లో ప్రాచీనులు సూర్యుడు, చంద్రుడు, గ్రహాలు, నక్షత్రాల కదలికలను క్రమబద్ధంగా నమోదు చేశారు. రుతువుల మార్పు, వర్షాకాలం, వ్యవసాయ కార్యకలాపాలు, కాలగణన వంటి అంశాలకు ఈ పరిశీలనలు ఉపయోగపడ్డాయి.



భారతీయ సంప్రదాయంలో 'సూర్య సిద్ధాంతం' ఖగోళ గణనలకు సంబంధించిన అత్యంత ప్రాచీన గ్రంథాల్లో ఒకటి. ఆర్యభటుడు, వరాహమిహిరుడు వంటి శాస్త్రవేత్తలు భారతీయ ఖగోళ విజ్ఞానాన్ని ముందుకు తీసుకెళ్లారు. టెలిస్కోపు రాక ముందే ప్రాచీన ఖగోళ శాస్త్రవేత్తలు గ్రహణాల సమయాలను అంచనా వేయడం, భూమి–చంద్రుల పరిమాణాలతోపాటు, దూరాలను లెక్కించడం, భూమి కక్ష్యకు సంబంధించిన అంశాలను అర్థం చేసుకోవడం వంటి అనేక విషయాల్లో పురోగతి సాధించారు. అయితే భూమినే విశ్వానికి కేంద్రంగా భావించిన భూకేంద్ర నమూనా చాలా కాలం ప్రబలంగా ఉంది. ఐరోపాలో పునరుజ్జీవనోద్యమం, అనంతరం జరిగిన శాస్త్రీయ విప్లవం ఈ దృక్పథాన్ని మార్చాయి. నికోలస్ కోపర్నికస్ సూర్యకేంద్రక నమూనాను ప్రతిపాదించాడు. గెలీలియో గెలీలీ టెలిస్కోపును ఖగోళ పరిశీలనకు సమర్థంగా ఉపయోగించి చంద్రుని ఉపరితలం, గురుగ్రహ ఉపగ్రహాలు, శుక్రగ్రహ దశలు వంటి విషయాలను గమనించాడు. యోహానెస్ కెప్లర్ గ్రహాలు సూర్యుని చుట్టూ దీర్ఘవృత్తాకార కక్ష్యల్లో తిరుగుతాయని, వాటి గమనానికి సంబంధించిన నియమాలను వివరించాడు. ఐజాక్ న్యూటన్ గురుత్వాకర్షణ సిద్ధాంతం, గమన నియమాల ద్వారా ఈ పరిశీలనలకు భౌతిక పునాది అందించాడు. ఆయన ప్రతిబింబ దూరదర్శినిని కూడా అభివృద్ధి చేశాడు.

రాత్రి ఆకాశంలో కనిపించే నక్షత్రాలు, గ్రహాలు, తోకచుక్కలు, నెబ్యులాలు, గెలాక్సీలు మానవుడి ఆసక్తిని వేల సంవత్సరాలుగా రేకెత్తిస్తున్నాయి. ఆకాశంలో జరిగే మార్పులను గమనించి వాటి వెనుక ఉన్న కారణాలను తెలుసుకునే ప్రయత్నమే ఖగోళశాస్త్రానికి పునాది. నేడు హబుల్ వంటి అంతరిక్ష దూరదర్శినులు పంపే చిత్రాల్లో కనిపించే క్రాబ్ నెబ్యులా వంటి అద్భుత దృశ్యాలు ఈ శాస్త్రం ఎంత దూరం ప్రయాణించిందో చూపిస్తున్నాయి. క్రాబ్ నెబ్యులా ఒక సూపర్నోవా పేలుడు తర్వాత మిగిలిన అవశేషం. ఒకప్పుడు మన కంటికి కనిపించే ఆకాశ వస్తువుల కదలికలను మాత్రమే పరిశీలించిన ఖగోళ శాస్త్రం, ఇప్పుడు నక్షత్రాల జననం నుంచి గెలాక్సీల పరిణామం వరకు విశ్వం లోని



అత్యంత సంక్లిష్ట ప్రక్రియలను అధ్యయనం చేస్తోంది. 20వ శతాబ్దంలో ఖగోళశాస్త్రం పరిశీలనా ఖగోళశాస్త్రం, సైద్ధాంతిక ఖగోళభౌతిక శాస్త్రం అనే రెండు ప్రధాన దిశల్లో అభివృద్ధి చెందింది. పరిశీలనా ఖగోళశాస్త్రం టెలిస్కోపులు, డిటెక్టర్లు, కంప్యూటర్లు వంటి పరికరాల ద్వారా ఖగోళ వస్తువుల నుంచి సమాచారాన్ని సేకరిస్తుంది. సైద్ధాంతిక ఖగోళభౌతిక శాస్త్రం ఆ సమాచారాన్ని భౌతికశాస్త్రం, గణితశాస్త్రం ఆధారంగా విశ్లేషించి విశ్వంలో జరిగే ప్రక్రియలకు నమూనాలను రూపొందిస్తుంది. ఈ రంగంలో వృత్తిపరమైన శాస్త్రవేత్తలతో పాటు ఔత్సాహిక ఖగోళ పరిశీలకులు కూడా కొన్ని ముఖ్యమైన ఆవిష్కరణలకు దోహదపడ్డారు. విశ్వం విస్తృతి, అందులోని కోట్లాది నక్షత్రాలు, అనేక గెలాక్సీలు దృష్ట్యా ఇంకా ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు దొరకాల్సి ఉంది.

## టెలిస్కోపులో విశ్వ పరిణామం జాడ...

ఖగోళశాస్త్రం 19వ శతాబ్దంలో మరింత ఖచ్చితమైన శాస్త్రంగా మారింది. విలియం హెర్షెల్ యురేనస్‌ను కనుగొనడంతో పాటు అనేక నెబ్యులాలు, నక్షత్ర సమూహాలను నమోదు చేశాడు. ఫ్రెడరిక్ బెస్సెల్ 1838లో ఒక నక్షత్రానికి దూరాన్ని తొలిసారిగా నమ్మదగిన పద్ధతిలో కొలిచాడు. గణితశాస్త్రం, ఖగోళ యాంత్రికశాస్త్రం అభివృద్ధి చెందడంతో గ్రహాలు, ఉపగ్రహాల కదలికలను మరింత ఖచ్చితంగా అంచనా వేయగలిగారు. అదే సమయంలో స్పెక్ట్రోస్కోపీ, ఫోటోగ్రఫీ ఖగోళ పరిశోధన స్వరూపాన్నే మార్చాయి. సూర్యకాంతిలో కనిపించే స్పెక్ట్రల్ రేఖలను పరిశీలించడం ద్వారా సూర్యుడు, ఇతర నక్షత్రాల్లో ఏ మూలకాలు ఉన్నాయో తెలుసుకునే అవకాశం ఏర్పడింది. దీని వల్ల ఖగోళశాస్త్రం కేవలం ఆకాశంలో ఏముంది? అనే ప్రశ్నకే పరిమితం కాకుండా ఆ ఖగోళ వస్తువులు దేనితో తయారయ్యాయి?, వాటి ఉష్ణోగ్రత ఎంత?, అవి ఎలా పరిణామం చెందుతున్నాయి? అనే ప్రశ్నలకు సమాధానాలు వెతకడం ప్రారంభించింది. 20వ శతాబ్దంలో ఈ మార్పు మరింత వేగమందుకుంది. పాలపుంత ఒక్కటే గెలాక్సీ కాదని, విశ్వంలో అనేక గెలాక్సీలు ఉన్నాయని శాస్త్రవేత్తలు నిర్ధారించారు. గెలాక్సీలు పరస్పరం దూరమవుతున్నాయని పరిశీలనలు వెల్లడించడంతో విశ్వం విస్తరిస్తోందనే అవగాహన బలపడింది. క్వాజార్లు, పల్సార్లు, బ్లేజర్లు, రేడియో గెలాక్సీలు వంటి అత్యంత శక్తిమంతమైన ఖగోళ వస్తువులు కనుగొన్నారు. న్యూట్రాన్ నక్షత్రాలు, కృష్ణబిలాలు వంటి విపరీత పరిస్థితుల్లో ఉండే వస్తువులపై పరిశోధనలు సాగాయి. కాస్మిక్ మైక్రోవేవ్ బ్యాక్‌గ్రౌండ్ రేడియేషన్, హబుల్–లెమైట్రే సంబంధం, విశ్వంలోని తేలికపాటి మూలకాల సమృద్ధి వంటి ఆధారాలు బిగ్ బ్యాంగ్ నమూనాకు బలమైన మద్దతు ఇచ్చాయి.



# ఎన్నికల హామీలు విస్మరించిన బిజెపి ప్రభుత్వం

## సిపిఐ జాతీయ సమితి సభ్యుడు పాలమాకుల జంగయ్య

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం/హయత్‌నగర్/యాచారం** : బిజెపి ప్రభుత్వం ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలు విస్మరించిందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు పాలమాకుల జంగయ్య విమర్శించారు. శుక్రవారం జిల్లా ప్రజాచైతన్య యాత్రంలో భాగంగా మంచాల మండలంలో పలు గ్రామాలు పర్యటించి మధ్యాహ్నం ఇబ్రహీంపట్నం మండల కేంద్రానికి సిపిఐ ప్రజా చైతన్య యాత్ర చేరటంతో సిపిఐ జిల్లా నాయకులు కావలి నర్సింహ్మ ఆధ్వర్యంలో పార్టీ కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు పాలమాకుల జంగ య్య, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆంధోజు రవీంద్ర చారీలు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభు త్వం ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్ శక్తులైన ఆధాని, అంబానీలకు ధారదత్తం చేస్తూ, కార్మిక వర్గాల కు తీవ్ర అన్యాయం చేస్తుందని ఆరోపించారు. నీట్ పేప ర్ లీకైతే బాధితులపై చర్యలు చేపట్టడంలో ఘోరంగా విఫలం చెందిందన్నారు. పెండింగ్‌లో ఉన్న పాలమూ రుర– రంగారెడ్డి ఎత్తి పోత్తల ప్రాజెక్టు పథకాన్ని పూర్తి చేసి జాతీయ హోదా కల్పించి త్వరలో సాగు, తాగు నీ రందించాలని, విచ్చల విడిగా పెరుగుతున్న నిత్యవసర వస్తువుల ధరలు నియంత్రించాలన్నారు. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక జిల్లాలో అస్తవ్యవస్థంగా తయారైన విద్య,వైద్యా రంగాలను అభివృద్ధి చేసి నిరుపేద ప్రజలకు మెరుగైన, విద్య, వైద్యం అందిచాలని ప్రభుత్వాన్నికి సూచించారు. జిల్లాల్లో సిపిఐ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్రకు సిపిఐ కా ర్యకర్తల భారీ సంఖ్యలో ఘన స్వాగతం పలికి బ్రహ్మ రథం పట్టడం అభినందనీయమన్నారు. ముందుగా మండల కేంద్రంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు పూల మాల వేసి నివాళ్ళులు అర్పించారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు బుద్దుల జంగయ్య, ఎం.ప్రభులింగం, మహిళ సంఘం నాయకురాలు శ్రీదేవి, ఓరుగంటి యాదయ్య గౌడ్, దత్తు నాయక్, విద్యార్థి సంఘం నాయకులు క్రాంతి, విష్ణువర్ధన్ రెడ్డి, సుధాకర్, మండల కార్యదర్శి కావలి సురేష్, మహిళ సంఘం సభ్యురాలు పి.నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.





### మతవిద్వేషాలు రెచ్చగొడుతున్న బిజెపి

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మతవిద్వేషాలు రెచ్చగొట్టి ప్రజలను ఇబ్బంది పెడుతుందని పాలమాకుల జంగయ్య విమర్శించారు శుక్రవారం సిపిఐ హయత్‌నగర్ మండల కమిటీ ఆధ్వర్యంలో బస్సుతో పాటు డిజె నడుమ భారీ ర్యాలీ నిర్వహించారు. పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ వీరన్న గుట్ట శాఖ వరకు నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఉత్సాహంగా ర్యాలీలో కదం తొక్కారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. వీరన్న గుట్ట శాఖకు చేరుకున్న అనంతరం సిపిఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య పార్టీ ఎర్రజెండాను ఆవిష్కరించారు. ఈ బస్సు జాతలో బికెఎంయు జిల్లా కార్యదర్శి బుద్ధుల జంగయ్య, ఎఐకెఎస్ జిల్లా కార్యదర్శి ప్రభులింగం, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి దత్తు నాయక్, ఎఐఎస్‌ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు గ్యార క్రాంతి ఎఐఎస్‌ఎఫ్, జిల్లా కార్యదర్శి సామిడి వంశీ వర్ధన్ రెడ్డి, కార్యదర్శి శేషరాజుపల్లి శ్రీదేవి ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు సుధాకర్ తదితర ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

### సిపిఐ పార్టీలో పలువురు చేరిక...

సిపిఐ అధ్వర్యంలో చేవేళ్ళ నుండి బయలు దేరిన బస్సు ప్రజా చైతన్యయాత్ర యాచారం మండలానికి చేరింది. యాచారం మండల సిపిఐ కార్యదర్శి మస్కు సంజీవ అధ్వర్యంలో నాయకులు బస్సు యాత్రకు ఘన స్వాగ తం పలికారు. మండల పరిధిలోని మంథనిగౌరెల్లి గ్రామానికి చేందిన కర్నాటి పెద్దయ్యతోబాటు పలువురు సిపిఐ పార్టీలో చేరారు వారికి జిల్లా కార్యదర్శి శాలువా కప్పి పార్టీలోకి అహ్వానించారు. ఈ కార్యక్రమంలో సిపి ఐ రాష్ట్ర సమితి సభ్యులు ఒరుగంటి యాదయ్యగౌడ్, బుద్దుల జంగయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కావలి నర్సింహ్మా, పి. శివకుమారగౌడ్, నీలమ్మ తో బాటు ప్రజాసంఘాల నాయకులు ప్రభు, లింగం, శ్రీదేవి, క్రాంతి, వంశీవర్ధన్‌రెడ్డి,సుధాకర్, దత్తునాయక్ సిపిఐ మండల కార్యదర్శి మస్కు సంజివ తదితరులు పాల్గోన్నారు.

# అలుపెరుగని పోరాట యోధుడు సిద్ది

- పార్టీకి, ప్రజలకందించిన సేవలు చిరస్మరణీయం
- ఎర్ర జెండాను నమ్మిన కార్యకర్తలకు భరోసా సిద్ది
- నేటితరం కమ్యూనిస్టులకు ఆదర్శం
- సిపిఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా



**ప్రజాపక్షం/పాల్వంచ** : స్వార్థ ప్రయోజనాల కోసం జెండాలు, ఎజెండాలు మారుస్తూ రాజకీయాలను భ్రష్టు పట్టిస్తున్న ప్రస్తుత తరుణంలో దానికి భిన్నంగా నమ్మిన సిద్ధాంతం కోసం కట్టుబడి కడదాకా ఒకే జెండాతో మమేకమైన నికార్సయిన కమ్యూనిస్టు నాయకులు, అలుపెరుగని పోరాట యోధుడు సిద్ది వెంకటేశ్వర్లు అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు. సిపిఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ కార్యదర్శి సిద్ది వెంకటేశ్వర్లు 4వ, వర్ధంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ది వెంకటేశ్వర్లు స్మారక స్థూపానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యు లు ముత్యాల విశ్వనాథం సిపిఐ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం సాబీర్‌పాషా మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో ప్రజా ఉద్యమాలను తారా స్థాయికి చేర్చి పార్టీ బలోపేతానికి బాటలు వేసిన బలమైన నాయకుడు సిద్ది వెంకటేశ్వర్లు అని, ప్రజలకు, పార్టీ అభివృద్ధికి చేసిన ఆయన సేవలను కొనియాడారు. వి ద్యార్థి సంఘం మొదలు యువజన, వ్యవసాయ, కార్మిక సంఘం రాష్ట్ర నేతగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్టీ కార్యదర్శిగా, రాష్ట్ర సహా య కార్యదర్శిగా అనేక పదవులను చేపట్టి విజయవంతంగా నడిపించిన సిద్ది ఆ పదవులకే వన్నె తెచ్చిన అరుదైన నాయకుడన్నా రు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో జనసేవాదళ్ బాధ్యులుగా వేలాది మందిని ఎర్రసైనికులను తయారు చేసి ప్రజా ఉద్యమాలకు ఊపి రి పోసిన చరిత్ర సిద్ది వెంకటేశ్వర్లు సొంతమన్నారు. ఏజెన్సీ ప్రాం తంలో బలమైన భూ పోరాటాలను నిర్వహించి వేలాది ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత ఆయనకు దక్కిందన్నారు. ఎంతటి సమస్యనైనా నేర్పుగా పరిష్కరించ గలిగే సత్తా ఉన్న నేత అని, ఆయన సమయ స్ఫూర్తితో ఇతర పార్టీలకు చెందిన నాయకులను సైతం ఆకట్టుకొనేవారని చెప్పారు. పాల్వంచ ప్రాంతంలో నే కాకుండా అనేక ప్రాంతాలలో శ్రమజీవుల సంఘాలను ఏర్పా టు చేసి తద్వారా పార్టీ బలోపేతానికి పాటుపడ్డారని, ఎలాంటి బెదిరింపులకు, ఆర్థిక ప్రలోభావాలకు లొంగకుండా నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ముందుకు సాగారని తెలిపారు. ఒకానొక దశలో పార్టీ పరిస్థితులు భిన్నంగా మారిన సమయంలో మొక్కవోని దీక్షతో అంకిత భావంతో పార్టీని నిలబెట్టేందుకు కృషి చేశారని స్పష్టం చేశారు. ఈ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఆయన పిలుపు తో ఎందరో పార్టీలోకి వచ్చిన వారు నేటికీ కొనసాగుతున్నారని వెల్లడించారు. దేశంలో కార్పొరేట్ శక్తులకు వ్యతిరేకంగా తన గళాన్ని వినిపించి వ్యాపారుల్లో చెతన్యం చేశారని, ఆ రోజుల్లో కొందరు ఆయన మాటలను పెడచెవిన పెట్టారని కానీ మారిన పరిస్థితుల్లో వ్యాపారులు కమ్యూనిస్టుల అవసరాన్ని గుర్తిస్తున్నార ని, సిద్ది ఆశయ సాధన కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యు లు వీసంశెట్టి పూర్ణ చందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు కొండలరావు, నిమ్మల రాంబాబు,ఇట్టి వెంకటరావు, కార్పొరేటర్ బోయిన విజయ, ప్రజా సంఘాల నాయకులు వల్లపు యాకయ్య, ఆలపాటి ప్రసాద్, సత్యనారాయణ, భుక్యా విజయ్, వేములపల్లి రాజశేఖర్, ఇరుకులపాటి సుధాకర్, రామాచారి, రాము, వెంకట్, బాబు, కిరణ్, వెంకన్న, అల్లి వెంకటేశ్వర్లు, వివిధ పార్టీల నాయకులు కనగాల అనంతరాములు, దొప్పలపూడి సురేష్, మానస శ్రీను, ఇటుకల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

## ఎఐటియుసి జిల్లా కార్యదర్శి ఎండి ఉస్మాన్



**ప్రజాపక్షం/మెట్‌పల్లి** : మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని జగిత్యాల జిల్లా మున్సిపల్ స్టా ఫ్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ యూనియన్ (ఎఐటియుసి) జిల్లా కార్యదర్శి ఎండి ఉస్మాన్ డిమాండ్ చేశారు. ఈ మేర కు శుక్రవారం మెట్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్‌కు యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎండి ఉస్మాన్ మాట్లాడుతూ జిఒ నంబర్ C/R No:741/2014/M22 ప్రకారం మున్సిపల్ కార్మికుల వేతనాల నుంచి ప్రతి నెలా ఇపిఫ్, ఇఎస్ఐ మొత్తాలను తప్పనిసరిగా జమ చేయాలని కోరారు. ఈ వివరాలను సంబంధిత పోర్టల్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసి కార్మికులకు పిఎఫ్ స్లిప్పులు అందించాలని డిమాండ్ చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు అవసరమైన మాస్కులు, గ్లౌజులు, నూనె, సబ్బులు, చెప్పులు తదితర రక్షణ సామగ్రిని క్రమం తప్పకుండా పంపిణీ చేయాలని కోరారు.అలాగే జీతంలో కోత విధించకుండా 15 రోజుల క్యాజువల్ సెలవులు మంజూరు చేయాలని, వారానికి ఒకరోజు వీక్లీ ఆఫ్ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. పండుగ సెలవులను కూడా రొటేషన్ పద్ధతిలో అమలు చేయాలని కోరారు.మున్సిపల్ కార్మికుల న్యాయమైన సమస్యలను అధికారులు సానుకూలంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని ఎండీ ఉస్మాన్ డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు లంక శ్రీకాంత్‌తో పాటు ఉల్లెందుల శ్రీను,విజయ్,రాజేందర్,రాజేష్,సతీష్,చందు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

# రూపా రెడ్డి హత్య ఘటనపై నిరసన, ఆందోళన

## ఆందోళనకు సిపిఐ సంఘీభావం



**ప్రజాపక్షం/మహబూబాబాద్ :** నల్గొండ జిల్లాలో స్కూల్ ప్రిన్సిపాల్ రూపా రెడ్డి హత్య ఘటనను నిరసిస్తూ నేడు మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చేసిన నిరసన ఆందోళన కార్యక్రమానికి పాల్గొని సిపిఐ జిల్లా పార్టీ తరఫున సంఘీభావం ప్రకటించిచారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి మాట్లాడుతూ భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు సమాజంలో జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తల్లిదండ్రులు బాధ్యతతో మెలగాలన్నారు. గంజాయి చెడు అలవాట్లకు బానిసలై విద్యార్థులు పెడుతూవా పడుతున్నారని ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు ప్రభుత్వం పోలీస్ యంత్రాంగం కృషి చేయాలన్నారు. విద్యార్థులు మాదకద్రవ్యాల బారిన పడుతూ తమ బంగారు భవిష్యత్తును ఆగం చేసుకుంటున్నారని తెలిపారు. రూప రెడ్డి హత్య తీవ్రంగా కలచి వేసిందని వారికి సిపిఐ తరఫున ప్రగాఢ సానుభూతిని తెలుపుతూ వారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి అజయ్ సారధి రెడ్డి, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ బాధ్యులు సుధా అర్జున్ రెడ్డి, భూపాల్ రెడ్డి, మల్లారెడ్డి, ఖలీద్, ప్రైవేట్ స్కూల్స్ ఉపాధ్యాయులు, పెరుగు కుమార్, రేషపల్లి నవీన్ ,మామిళ్ల సాంబలక్ష్మి , కేదాసు రమేష్, మంద శంకర్, తండా శ్రీనాథ్, నక్క నాగార్జున, మల్లయ్య, బాలాజీ, మేక వెంకటేష్, కోన సత్యం, ఎండి అలీమా, తండా మాధవి, తండా వినోద, కనకం పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
కరీంనగర్
శనివారం
22-08-2026
www.prajapaksham.in
స్థానికం LOCAL NEWS

## వరకట్న వేధింపులు, కుల దూషణ కేసులో నలుగురికి జైలు శిక్ష

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** వరకట్న వేధింపులు,కుల దూషణ కేసులో నలుగురు నిందితులకు నల్లగొండ ప్రత్యేక సెషన్స్ కోర్టు జైలు శిక్ష విధించింది. ఒక్కొక్కరికి ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.3 వేల చొప్పున జరిమానా విధించినట్లు జిల్లా ఎస్‌పి శరత్ చంద్ర పవార్ తెలిపారు.నల్లగొండ రూరల్ పోలీస్ స్టేషన్‌లో 2021లో కేసు నమోదైంది.ఈ కేసులో నిందితులు కల్లూరి స్వామినాథ్ (ఏ1),ప్రమీల (ఏ2),కల్లూరి యాదయ్య (ఏ3), కల్లూరి ఎల్లయ్య (ఏ4)లు నేరస్థులుగా తేలడంతో ప్రత్యేక సెషన్స్ జడ్జి శుక్రవారం తీర్పు వెలువరించారు.ఐపీసీ 498ఏ కింద 6 నెలల జైలు రూ.1000 జరిమానా,వరకట్న నిషేధ చట్టం సెక్షన్ 3 కింద 6 నెలల జైలు రూ.1000 జరిమానా, ఎస్‌సి/ఎస్‌టి చట్టం కింద 6 నెలల జైలు రూ.1000 జరిమానా విధించారు.జరిమానా చెల్లించకపోతే ఒక్కో నేరానికి అదనంగా 15 రోజుల జైలు శిక్ష అనుభవించాలని ఆదేశించారు. మూడు నేరాలకు కలిపి 18 నెలల శిక్ష అయినా,శిక్షలను ఏకకాలంలో అమలు చేయాలని కోర్టు ఆదేశించడంతో నిందితులు 6 నెలల జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుంది.కేసులో పకడ్బందీగా దర్యాప్తు చేసిన ఎస్‌ఐ ఎ.రాజశేఖర్ రెడ్డి,దర్యాప్తు అధికారి జి.వెంకటేశ్వర్ రెడ్డి,స్పెషల్ పీపీ దర్శనం నర్సింహ, ఎస్‌డీపీఓ కె.శివరాం రెడ్డి,సీఐ కె.ఆది రెడ్డి,ఎస్‌ఐ బి.శివ ప్రసాద్,కోర్టు లైజన్ అధికారులు పి.నరేందర్,ఎన్.మల్లికార్జున్ లను ఎస్‌పి అభినందించారు. బాధితులకు న్యాయం జరిగేలా పోలీస్ శాఖ శాస్త్రీయంగా దర్యాప్తు చేస్తుందని తెలిపారు.

## నిషేధిత జాబితాలోని ఇళ్ల స్థలాలు, పట్టా భూములను తొలగించాలి : సిపిఐ



**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** 22 ఏ నిషేధిత జాబితాలో నమోదైన అర్హులైన ఇళ్ల స్థలాలు, పట్టా భూములను వెంటనే పరిశీలించి జాబితా నుంచి తొలగించాలని సిపిఐ ఆధ్వర్యంలో తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బచ్చనగోని గాలయ్య మాట్లాడుతూ తమకు చట్టబద్ధమైన హక్కులు పట్టాదారు పాసుబుక్కులు, రిజిస్ట్రేషన్ పత్రాలు ఉన్నప్పటికీ నివేదిత జాబితాలో చేర్చడంతో క్రయవిక్రయాలు రిజిస్ట్రేషన్లు నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని మండిపడ్డారు. 22 ఏ కింద నిషేధితంగా నమోదు అయిన భూములను భూభారత రికార్డులు క్షుణ్ణంగా పరిశీలించి ఎలాంటి వివాదాలు లేని పట్టా భూములు ఇంట్ల స్థలాలను గుర్తించి వెంటనే జాబితా నుంచి తొలగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పెండింగ్లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి సమస్యలు పరిష్కరించాలని తహసీల్దారును కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాస్, సిపిఐ మండల కార్యదర్శి దుబ్బాక భాస్కర్, సిపిఐ జిల్లా సమితి సభ్యులు చిలివేరు అంజయ్య, కలకొండ సంజీవ, ప్రజాసంఘాల నాయకులు మల్లె మల్లారెడ్డి, నల్లవెల్లి ముత్యాలు, వీరమల్ల యాదయ్య, సుర్వి నరసింహ, గ్రామ శాఖల కార్యదర్శులు, మహిళా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికలు బ్యాలెట్ ద్వారా నిర్వహించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకుందాం




**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** సెప్టెంబర్ 1న ఢిల్లీలో జరిగే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కంబాల శ్రీనివాస్, సిపిఐ రాష్ట్ర సమితిసభ్యులు కొప్పోజు సూర్యనారాయణ పిలుపునిచ్చారు. జాతీయ పార్టీ పిలుపుమేరకు బదలావ్ జరూర్ హై మార్పు కావాలి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం హుజూర్‌నగర్ మండలంలోని అమరవరం గ్రామంలో ప్రజా చైతన్యయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత దేశంలో నిరుద్యోగం భాగా పెరిగిపోయిందని, యువత నిరాశ, నిస్పృహలలో ఉన్నారు. దేశంలో ఎన్నికలు బ్యాలెట్ ద్వారా నిర్వహించి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాలని కోరారు. రైతులు పండించిన పంటలకు సీటు ప్లస్ 50 స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేస్తామని హామీ ఇచ్చి నేటి వరకు నేరవేర్చలేదన్నారు. మండల కార్యదర్శి కందుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అమరవరం గ్రామంలో ఉన్న ఇల్లులేని నిరుపేదలందరికి కూడా రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఇచ్చే ఐదు లక్షల రూపాయలు మంజూరు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపేందర్, గుంజ వెంకన్న, రామిరెడ్డి, సాయి, బ్రహ్మం పాల్గొన్నారు.

## బాధితుల పట్ల గౌరవంగా వ్యవహరించి తక్షణ పరిష్కారం

యాదాద్రి భువనగిరి జిల్లా ఎస్‌పి

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారు,సందర్శకులతో మర్యాదగా,ఓర్పుతో,గౌరవప్రదంగా వ్యవహరించాలని యాదాద్రిభువనగిరి జిల్లా ఎస్పీ అక్షాన్ష్ యాదవ్ అన్నారు.చౌటుప్పల్ పోలీస్ స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మిక తనిఖీ చేశారు.జనరల్ డైరీ ఎంట్రీలు,సిసిటిఎన్ఎస్ పనితీరు,స్టేషన్ నిర్వహణ,వివిధ రిజిష్టర్లు,రికార్డులను సమగ్రంగా పరిశీలించారు.పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న సీజ్ చేసిన మోటర్ సైకిళ్ళను పరిశీలించారు.స్టేషన్ కార్యకలాపాలపై సమీక్షించారు.చట్టబద్ధమైన రికార్డులను,రిజిస్టర్లను,డిజిటల్ ఎంట్రీలను ఖచ్చితంగా ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు.పారదర్శకమైన,జవాబుదారీతనంతో కూడిన సమర్థవంతమైన పోలీసింగ్‌కు సరైన రికార్డుల నిర్వహణ కీలకమని అన్నారు. ప్రజల సమస్యలను సానుభూతితో స్వీకరించి చట్టపరంగా వాటిని త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. సోషల్ మీడియాను వినియోగించుకొని నేరాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలని తెలిపారు.ప్రజలతో సమన్వయం చేసుకుంటు సాంకేతిక పరిజ్ఞానంతో ఆధునిక పోలీసింగ్ గురించి వివరించాలని కోరారు.ప్రతి పోలీస్ అంకితభావంతో వృత్తిపట్ల నిబద్ధతతో పని చేయాలని అన్నారు.నేరస్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ తనిఖీలో చౌటుప్పల్ డిఎస్పీ పి.మధుసూధన్‌రెడ్డి,సిఐ జి.మన్మథ కుమార్ లు పాల్గొన్నారు.



# కేవలం 15 మిల్లుల్లో...

# రూ.419.08 కోట్ల ధాన్యం పక్కదారి!

తొవ్విన కొద్దీ బయటపడుతున్న మిల్లర్ల అక్రమాలు

మిగతా 50 మిల్లుల్లో తనిఖీ చేస్తే ఇంకా ఎన్ని కోట్లు బయటపడనుందో!

పౌరసరఫరాల శాఖ అధికారుల తనిఖీలో వెలుగుచూడని అక్రమాలు

విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో బట్టబయలు





**ప్రజాపక్షం/సూర్యాపేట :** సిఎంఆర్ ధాన్యంలో మిల్లర్ల అక్రమాలు తొవ్వినా కొద్ది బయటపడుతున్నాయి. గత నెల రోజుల నుండి విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నిర్వహిస్తున్న వరుస తనిఖీలతో కోట్లాది రూపాయల ప్రభుత్వ ధాన్యం పక్కదారి పట్టిచ్చినట్లుగా అధికారులు గుర్తించారు. 2022 నుండి 2026 రబి సీజన్ వరకు జిల్లాలో దాదాపు 60 నుండి 75 రైస్ మిల్లులకు పౌర సరఫరాల శాఖ అధికారులు ప్రతి సీజన్‌లో సిఎంఆర్ కోసం వేలాది మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లర్లకు అప్పగించారు. కేవలం 15 మిల్లుల్లో తనిఖీలు చేయగా 1.55 లక్షల టన్నులకు పైగా ధాన్యం ఇప్పటి వరకు పక్కదారి పట్టించగా దీని విలువ రూ.419.08 కోట్లు ఉన్నట్లుగా అధికారుల లెక్కల్లో తేలింది. మిగతా 50కు పైగా ఉన్న రైస్ మిల్లుల్లో అధికారులు తనిఖీ చేస్తే ఇంకా ఎంత బయటపడనుం దోననే ప్రజల్లో చర్చ సాగుతుంది. మిల్లర్లకు అప్పగించిన ధాన్యాన్ని స్థానిక పౌరసరఫరాల శాఖ అధికారులు నెలనెలా తనిఖీలు చేసినా ఎక్కడ వెలుగుచూడని అక్రమాలు విజిలెన్స్ అధికారుల తనిఖీల్లో బయటప డడం వారి పనితీరుకు అద్దం పడుతుంది.

జిల్లా వ్యాప్తంగా అధికారులు దాదాపు 75 మిల్లులకు సిఎంఆర్ కోసం ధాన్యం కేటాయించగా ఇప్పటి వరకు అధికారులు 15 రైస్ మిల్లుల్లో తనిఖీలు నిర్వహిస్తే రూ.419.08 కోట్ల విలువైన ధాన్యం మిల్లర్లు పక్కదారి పట్టించిట్లుగా తేలింది. మిగతా 50 మిల్లుల్లో తనిఖీలు చేస్తే ఇంకా ఎన్ని వందల కోట్లు విలువైన ధాన్యం పక్కదారి పట్టిన్నట్లు బయటపడనుందో అనే చర్చ ప్రజల్లో పెద్దఎత్తున సాగుతుంది. అధికారులు ధాన్యం కేటాయించిన కొన్ని రోజుల్లోనే కొంతమంది మిల్లర్లు దానిని బహిరంగ మార్కెట్‌లో విక్రయించి కోట్లాది రూపాయలు వెనకేసుకున్నట్లు దీనిని బట్టి స్పష్టమవు తుంది. ప్రభుత్వానికి చిక్కకుండా ఆ సొమ్ముతో బినామీల పేర్లతో ఆస్తులు కూడబెట్టినట్లు వార్తలు గుప్పుమంటున్నాయి.

మిల్లర్లకు సిఎంఆర్ కోసం ధాన్యం కేటాయించిన తరువాత జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులు నెలనెలా ఆ మిల్లుల్లో తనిఖీలు చేసి ధాన్యం నిలువలు ఉన్నాయా లేవా అని తేల్చడం జరుగుతుంది. కానీ వీరి తనిఖీల్లో మాత్రం ఎక్కడ కూడా మిల్లర్లు అక్రమాలకు పాల్పడలేదని ధాన్యం నిల్వలు ఉన్నట్లుగా ప్రభుత్వానికి నివేదిక అందజేయడం జరిగింది. కానీ మిల్లర్లు ప్రభుత్వ ధాన్యాన్ని పక్కదారి పట్టిస్తున్నట్లు ఆయా ప్రచార మాధ్యమాలు వార్తా కథనాలు వచ్చినా అందులో వాస్తవం లేదని కొట్టిపారేస్తూ ఇన్ని రోజులు వచ్చారు. బకాయిలు పేరుకపోవడంతో గత నెల రోజుల నుండి జిల్లాలో విజిలెన్స్ అధికారులు వరుస తనిఖీలు చేస్తుండడంతో మిల్లర్ల అక్రమాలు బట్టబయలు అయ్యాయి. దీనితో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారుల పనితీరు ఎలా ఉందో ఇట్టే స్పష్టమవుతుంది. పౌరసరఫరాల శాఖ అధికారులు జిల్లాలో గత మూడు సంవత్సరాల క్రితం మూతపడ్డ రైస్ మిల్లులకు కూడా కోట్ల రూపాయల ధాన్యం కేటాయించినట్లు విజిలెన్స్ అధికారులు గుర్తించడం అందరిని ఆశ్చర్యానికి గురిచేస్తుంది. మిల్లర్ల అక్రమాలకు జిల్లా పౌరసరఫరాల శాఖలో పనిచేస్తున్న డిప్యూటి తహశీల్దార్‌ల పాత్ర ప్రధానంగా ఉన్నట్లు రాష్ట్రస్థాయి అధికారులు ఇప్పటికే గుర్తించారు. మిల్లర్ల నుండి లక్షల రూపాయలు దండుకొని వారు కోట్లు గడించేలా అక్రమాలకు ప్రోత్సహించినట్లు తేటతెల్లమైంది. ఇందులో ఒక్కరిద్దరు బదిలీపై ఇతర జిల్లాలకు వెళ్ళగా మరికొందరూ తమ అక్రమ ఆదాయాన్ని వదులుకోలేక రాజకీయ పరపతితో ఏండ్ల తరబడి నుండి ఇక్కడే తిష్టవేసి కూర్చున్నారు. ఇప్పటికైనా అధికారులు మిల్లర్ల అక్రమాలతోపాటు వారికి సహకరించిన జిల్లా పౌరసరఫరాల శాఖలో పనిచేస్తున్న మరికొంత మంది అధికారులపై కూడా విచారణ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

1. వజ్రా రైస్ ఇండస్ట్రీస్ (బాలెంల సూర్యాపేట) 11,073.054 మెట్రిక్ టన్నులు అంచనా విలువ రూ.30 కోట్లు
2. వజ్రా వికాస్ రైస్ మార్ట్ (బాలెంల సూర్యాపేట) 22,490.284 మెట్రిక్ టన్నులు అంచనా విలువ రూ.36 కోట్లు
3. రవి కృష్ణ రైస్ ఇండస్ట్రీ (సూర్యాపేట) 12,840.239 మెట్రిక్ టన్నులు అంచనా విలువ రూ. 36 కోట్లు
4. శ్రీవేంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ (కాసరబాద సూర్యాపేట) 11,400.843 మెట్రిక్ టన్నులు అంచనా విలువ రూ.14.96 కోట్లు
5. జె.పి. రైస్ మిల్లు (మాచారం పెన్‌పహాడ్) 4,886.500 మెట్రిక్ టన్నులు అంచనా విలువ రూ. 14.96 కోట్లు
6. శివసాయి రైస్ అండ్ ఫ్లోర్ మిల్ (సూర్యాపేట) 5,739.737 మెట్రిక్ టన్నులు అంచనా విలువ రూ.17 కోట్లు
7. ఏ.ఎస్.ఆర్ ఇండస్ట్రీస్ ఫార్‌బాయిల్డ్ అండ్ రైస్‌మిల్ (అన్నారం తిరుమలగిరి) 19,701,567 మెట్రిక్ టన్నులు అంచనా విలువ రూ.55 కోట్లు
8. శ్రీ శ్రీనివాస సాయిశివయ్య రైస్ ఇండస్ట్రీస్ (దొండపాడు చింతలపాలెం) 22,377.977 మెట్రిక్ టన్నులు అంచనా విలువ రూ.65 కోట్లు
9. సునంద రైస్ ఇండస్ట్రీస్ (గరిడేపల్లి) 7,707.088 మెట్రిక్ టన్నులు అంచనా విలువ రూ.23 కోట్లు
10. శ్రీలక్ష్మి వెంకటేశ్వర బిఆర్ఎం (కొక్కిరేణి పెన్‌పహాడ్) 5,357.879 మెట్రిక్ టన్నులు అంచనా విలువ రూ.19 కోట్లు
11. శృతి రైస్ ఇండస్ట్రీస్ (హుజూర్‌నగర్) 5,717.511 మెట్రిక్ టన్నులు అంచనా విలువ రూ. 15.50 కోట్లు
12. భవాని రైస్ కార్పోరేషన్ (నాగారం) 4,174 మెట్రిక్ టన్నులు అంచనా విలువ రూ. 12.14 కోట్లు
13. విజయలక్ష్మి రైస్ కార్పోరేషన్ (కోదాడ) 4,736 మెట్రిక్ టన్నులు అంచనా విలువ రూ. 13.38 కోట్లు
14. వసుంధర రైస్ మిల్లు (బొజ్జగూడెంకోదాడ) 9,295 మెట్రిక్ టన్నులు అంచనా విలువ రూ. 20.82 కోట్లు
15. శ్రీ సంతోషిమాత బిన్ని రైస్ మిల్లు (మాచారం పెన్‌పహాడ్) 874 మెట్రిక్ టన్నులు అంచనా విలువ రూ. 19.28 కోట్లు.

# సమన్వయంతోనే గ్రామాల అభివృద్ధి

లోక్యతండలో గడపగడపకూ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ పర్యటన

వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని రైతులకు సూచన



**ప్రజాపక్షం/త్రిపురారం:** అధికారులు,ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా సమన్వయంతో అన్ని రంగాల్లో గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ సూచించారు.ఇటీవల లోక్యతండ గ్రామస్తులతో కలిసి లోక్యతండ గ్రామ అభివృద్ధిపై ఢిల్లీలో ఎస్టీ కమిషన్‌కు వినతిపత్రం అందజేశారు.దీంతో శుక్రవారం ఢిల్లీ ఎస్‌సి కమిషన్ ఆదేశానుసారం నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ త్రిపురారం మండలం లోక్యతండలో పర్యటించి గడపగడపకు తిరుగుతూ క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ రోడ్లు,ఇందిరమ్మ ఇళ్లు,గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలు,మిషన్ భగీరథ నీటిపై ఆరా తీసి సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.గ్రామంలో పూరిగుడిసె కనబడటంతో గుడిసెలోకి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడి ఇందిరమ్మ ఇల్లు అందే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎల్‌నినో కారణంగా వర్షాలు సక్రమంగా కురవక పోవడంతో పాటు సాగర్ జలాశయంలో సాగు నీటికి అవసరమైన నీరు లేనందున ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ వరికి బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోవాలని రైతులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధుల పట్ల వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉంటూ అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వైద్య సేవలను సకాలంలో అందే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఆర్‌డిఓ రమణారెడ్డి,తహసీల్దార్ గాజుల ప్రమీల,ఎంపీడీవో విజయకుమారి, విద్యుత్ ఏఈ బాలు నాయక్,వ్యవసాయ అధికారి పార్వతి,మండల విద్యాధికారి రవి నాయక్, వైద్యాధికారి వనిత,మిషన్ భగీరథ డీఈ మధు, సర్పంచ్ నేనా జ్యోతి కాంతారావు పాల్గొన్నారు.

# పాడైపోయిన రోడ్లన్నీ బాగు చేయాల్సిందే

ఏఐవైఎఫ్ డిమాండ్

నిర్లక్ష్యం వహిస్తే ఎంఎల్ఏ క్యాంపు ఆఫీస్ ముట్టడి



**ప్రజాపక్షం/డిండి:** డిండి మండలంలో పాడైపోయిన రోడ్లను పూర్తి చేయాలని శుక్రవారం ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో తలపెట్టిన పాదయాత్ర మండలంలోని గోనకోల్ గ్రామంలో సిపిఐ మండల సహాయ కార్యదర్శి బొల్లె శైలేష్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ పాదయాత్రకు ముఖ్య అతిథిగా ఏఐవైఎఫ్ నల్గొండ జిల్లా అధ్యక్షులు ఎనమల్ల నవీన్ హాజరై మాట్లాడుతూ గోనకల్ గ్రామం నుండి ఏఐవైఎఫ్ డిండి మండల అధ్యక్ష కార్యదర్శులు కాంపల్లి ప్రవీణ్, ఎలిమినేటి నరేష్ ఆధ్వర్యంలో ఏఐవైఎఫ్ నాయకులు 50 మందితో పాదయాత్ర ప్రారంభం చేసి డిండి పోలీస్ స్టేషన్ వరకు 4 కిలో మీటర్లు పాదయాత్రగా వచ్చి అక్కడ రోడ్డుపై బైఠాయించి గంట పాటు నిరసన తెలిపారు. ఈ నిరసన కార్యక్రమంలో నవీన్ మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాల క్రితం రాష్ట్ర రహదారుల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి 08/01/2024న డిండి మండల కేంద్రంలో డిండి నుండి దేవరకొండ రోడ్డు నిర్మాణం కోసం శిలాఫలకం ప్రారంభించి ఈరోజు వరకు దానిని పట్టించుకోకుండా నిర్లక్ష్యం వహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. డిండి మండలంలోని తౌక్లాపూర్ నుండి నగర దుబ్బతండా వరకు , రమాంతాపూర్ నుండి గదరాళ్ల తండా వరకు, వావిల్‌కోల్ నుండి బ్రహ్మణపల్లి తండా వరకు, శాంతిగూడెం గ్రామానికి, కందుకూరు నుండి నిజాం నగర్ గ్రామం వరకు, కింది శేషాయికుంట నుండి మీది శేషాయికుంట వరకు, బొగ్గులదోన గేటు నుండి బొగ్గుల దోన గ్రామం వరకు కిష్టంపల్లి గేటు నుండి పడమటిపల్లి గ్రామం వరకు అన్ని గ్రామాలలోని రోడ్లన్నీ గుంతల మయంగా అయి ప్రమాదాలు పొంచి ఉన్నాయని తక్షణమే ఈ ఆగస్ట్ నెలలో రోడ్ల మరమ్మతులు చేపట్టాలని స్థానిక ఎంఎల్ఏ బాలునాయక్‌ను కోరారు. లేనిపక్షంలో వచ్చే నెల పెద్ద ఎత్తున భారీ ఉద్యమాలు చేపడతామని వారు డిమాండ్ చేశారు. ఈకార్యక్రమానికి సిపిఐ, ఏఐఎస్ఎఫ్ పూర్తి మద్దతు ప్రకటించారు. ఈకార్యక్రమంలో ఏఐవైఎఫ్ డిండి మండల కోశాధికారి మధుకర్, ఉపాధ్యక్షులు భూపాల్, కొండల్, సహాయ కార్యదర్శి బాలపిర్, వెంకటేష్, ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు హనుమంతు, ఏఐఎస్ఎఫ్ నాగర్ కర్నూల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్, డివిజన్ అధ్యక్షులు వినయ్, డిండి మండల కార్యదర్శి సిద్దు, సిపిఐ తౌక్లాపూర్ గ్రామశాఖ కార్యదర్శి చక్రి పాల్గొన్నారు.




## సాగర్ నీటిని ఏపి దోచుకుపోతున్నా పట్టించుకోరా?

మాజీ మంత్రి జగదీష్ రెడ్డి ఆగ్రహం

**ప్రజాపక్షం/నల్లగొండ:** నాగార్జున సాగర్ నీళ్లను ఆంధ్రప్రదేశ్ యథేచ్ఛగా దోచుకుపోతున్నా జిల్లా మంత్రులు నోరు మూసుకున్నారని,మంత్రులు చేతకాని దద్దమ్మలని మాజీ మంత్రి జగదీష్ రెడ్డి మండిపడ్డారు.శుక్రవారం నల్లగొండలోని కెబిఆర్ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రీశైలం నుండి నిత్యం నీటి దోపిడీ జరుగుతోంది.జిల్లాలో ఈఇద్దరు మంత్రుల వల్ల వ్యవసాయం ఆగమైంది.సాక్ష్యాలతో సహా ఆంధ్ర నీటి దోపిడీని కళ్లకు కట్టినట్లు చూపిస్తున్నా ప్రభుత్వంలో చలనం లేదు. శ్రీశైలంలో పోతిరెడ్డిపాడు ద్వారా చిల్లు పెట్టి నదిని మొత్తం మళ్లించుకుంటున్నారు. కేసీఆర్ ఉన్నన్ని రోజులు ఆంధ్ర వాళ్ల ఆటలు సాగనివ్వలేదు.సాగర్ ఓవర్ ఫ్లో అయి సముద్రంలోకి నీళ్లు వదిలినప్పుడు మాత్రమే పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని తీసుకెళ్లాలని నిబంధన ఉంది. కానీ పోతిరెడ్డిపాడు ద్వారా నీటిని దోచుకుని రాయలసీమలోని అన్ని ప్రాజెక్టులను ఫుల్‌గా నింపుకున్నారు.నాగార్జున సాగర్‌లో ఇప్పుడు ఉన్న నీటికంటే తక్కువ ఉన్నప్పుడు కూడా సాగునీరు ఇచ్చిన ఘనత మా కేసీఆర్‌ది.సాగర్‌లో ఓ యాగం చేసి చేతులు దులుపుకున్నారు.రైతులు పంటలు పండనీయవద్దని కుట్ర చేస్తున్నారు.ఈ సమావేశంలో ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి,జెడ్‌పి మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి,బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల కృష్ణారెడ్డి,మాజీ శాసనసభ్యులు కంచర్ల భూపాల్ రెడ్డి,నల్లమోతు భాస్కరరావు,హుజూర్‌నగర్ ఇంచార్జ్ ఒంటెద్దు నరసింహారెడ్డి,మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి,బోనగిరి దేవేందర్ తదితర కార్పొరేటర్లు,నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

## ఎఐటియుసి మండల నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/మోత్కూర్ :** మోత్కూర్ మున్సిపల్ కేంద్రంలోని కెఆర్ భవన్ లో జరిగిన ఎఐటియుసి మోత్కూర్ మండల 2వ రోజు జరిగిన 3వ మహాసభకు ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్ ముఖ్య అతిథిగా పాల్గొని కార్మికులంతా ఏకమై తమ సమస్యల పరిష్కారం కోసం ఏఐటీయూసీలో చేరి పోరాటాలు నిర్వహించాలని అలాగే లేబర్ కార్డులు తీసుకోవాలని లేబర్ యూనియన్ ద్వారా అనేక హక్కులు పొందాలని వారు తెలియజేస్తూ తదనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా అన్నెపు వెంకట్, అధ్యక్షులుగా తొంట తిరుపతి, ఉపాధ్యక్షులు ఎడ్ల ఆనందు, ఎండి సాదిక్, ప్రధాన కార్యదర్శి జంగా నరసయ్య, సహాయ కార్యదర్శులు ఎండి పాషా, బొడ్డుపల్లి లక్ష్మయ్య, కోశాధికారి రాపోలు రాజు, కార్యవర్గ సభ్యులుగా జంగ లింగం, పురుగుల రవి, ఎండి జానీ, ఎర్రబెల్లి ముత్యాలు, గుర్రం మధు శేఖర్, నోముల రమేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో బుష్పక నరసింహ, మొగుల శేఖర్ రెడ్డి, తాడూరు లక్ష్మి నరసయ్య పాల్గొన్నారు.

## జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ ఏర్పాటు

**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్ :** యాదాద్రి భువనగిరి జిల్లాలో డిస్ట్రిక్ట్ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ (డీవీఎంసీ)ని ఏర్పాటు చేస్తూ జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఐఏఎస్ ఉత్తర్వులు జారీ చేశారు. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా వ్యవహరించే ఈ కమిటీలో జిల్లా ప్రజాప్రతినిధులు, గౌరవ పార్లమెంట్ సభ్యులు, శాసన మండలి సభ్యులు, శాసనసభ్యులతో పాటు జిల్లా ఎస్పీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా సంక్షేమ శాఖల జిల్లా అధికారులు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి తదితరులు సభ్యులుగా ఉంటారు. అదేవిధంగా సామాజిక దృక్పథం, ప్రజా సమస్యలు, ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణ, బాధితుల సమస్యలపై అవగాహన కలిగిన జిల్లా పరిధిలోని ఎనిమిది మందిని కమిటీ సభ్యులుగా నియమించారు. జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి కమిటీ మెంబర్ సెక్రటరీగా వ్యవహరిస్తారు. కమిటీ సమావేశాలు ప్రతి మూడు నెలలకు ఒకసారి నిర్వహించనున్నారు. షెడ్యూల్ కులాలు, తెగలకు చెందిన బాధితుల హక్కుల పరిరక్షణ, వారిపై దాడుల నివారణ, నిందితులపై కఠిన చర్యలు, బాధితులకు పునరావాసం కల్పించడం, నష్టపరిహారం అందించడం అంశాలపై సమావేశాల్లో సమీక్షించి నిర్ణయాలు తీసుకోనున్నారు.

## దంపతుల హత్య కేసు పోలీస్ ఉద్యోగం నుండి డిస్మిస్

ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా ఎస్‌పి కె. నరసింహ

**ప్రజాపక్షం/కోదాడ (మోతె) :** సూర్యాపేట జిల్లా, కోదాడ నియోజకవర్గంలోని మోతె మండల కేంద్రంలో సంచలనం సృష్టించిన భార్యాభర్తల హత్య కేసులో ప్రధాన నింధితుడిగా ఉన్న పోలీస్ కానిస్టేబుల్ మహ్మద్ షరీఫ్‌ను పోలీస్ ఉద్యోగం నుండి శాశ్వతంగా తొలగిస్తూ (డిస్మిస్) జిల్లా ఎస్‌పి కె. నరసింహ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. మోతె మండల కేంద్రంలోని ఒక వ్యవసాయ భూమిలో పాతిపెట్టిన భార్యాభర్తల మృతదేహాల ఘటనపై మోతె పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసి ఉన్నతాధికారుల మార్గదర్శకత్వంలో అత్యంత వేగంగా దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక ఆధారాలు, పక్కా సమాచారంతో కేవలం 24 గంటల వ్యవధిలోనే నేరానికి పాల్పడిన నింధితులను పట్టుకుని, వారిని రిమాండ్‌కు పంపిన విషయం తెలిసిందే. ఈ దారుణ హత్య ఉదంతంలో మోతె పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న మహ్మద్ షరీఫ్ ప్రధాన నిందితుడిగా తేలడం, అతను ప్రస్తుతం రిమాండ్‌లో ఉండడంతో ఈ విషయాన్ని పోలీసు శాఖ అత్యంత తీవ్రంగా పరిగణించింది. చట్టాన్ని రక్షించాల్సిన స్థానంలో ఉండి ఇటువంటి ఘాతుకానికి ఒడిగట్టడం తీవ్రమైన క్రమశిక్షణారాహిత్యంగా భావిస్తూ, ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా ఎస్‌పి సదరు కానిస్టేబుల్‌ను ఉద్యోగం నుండి తొలగిస్తూ తక్షణ ఆదేశాలు జారీ చేశారు. కేసులో ఎస్‌సి/ఎస్‌టి అట్రాసిటి సెక్షన్‌లు పెట్టడంతో పాటు కేసులో త్వరగా తీర్పు రావడానికి ఫాస్ట్ ట్రాక్ కోర్టుకు పంపనున్నారు. నేరస్తులకు త్వరగా కఠిన శిక్షలు పడేలా చూడడంతోపాటు బాధిత కుటుంబానికి ప్రభుత్వం ద్వారా పరిహారం త్వరగా వచ్చేలా చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసు అధికారులు తెలిపారు.

## 23న ఎఐటియుసి జిల్లా మహాసభలు

**ప్రజాపక్షం/ములుగు:** ఈ నెల 23న ములుగు జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవన్‌లో నిర్వహించనున్న ఏఐటియూసి ములుగు జిల్లా మూడవ మహాసభను విజయవంతం చేయాలని ఏఐటియూసి జిల్లా ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మహాసభకు హాజరయ్యే ప్రతినిధులు సకాలంలో చేరుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికులతో పాటు మధ్యాహ్న భోజన కార్మికులు, ఆర్‌పిఎన్‌ఎంలు, అంగన్‌వాడీలు, సివిల్ సప్లయి, జీసిసి, ఐకెపి, గోదాం, జిల్లా జనరల్ హమాలీ కార్మికులు, ట్రాక్టర్ డ్రైవర్లు, నీరడీలు, గ్రామ పచాయతీ కార్మికులు, తదితర రంగాలకు చెందిన కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. కార్మికుల సమస్యల, హక్కుల సాధనపై మహాసభలో చర్చించి భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు. అన్ని రంగాల కార్మికులు పాల్గొని మహాసభను జయప్రదం చేయాలని జంపాల రవీందర్ విజ్ఞప్తి చేశారు.

## పేదల ఆకలిని తీర్చడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం: కడియం



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం ప్రజా పంపిణీ వ్యవస్థలో పేదల ఆకలిని తీర్చడమే లక్ష్యంగా సన్న బియ్యం పథకం ద్వారా దేశంలో విప్లవాత్మక మార్పును తీసుకొచ్చిందని తెలంగాణ రాష్ట్ర మాజీ ఉప ముఖ్య మంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రం లోని రైతు వేదికలో ఏర్పాటుచేసిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి తహసిల్దార్ బైరెడ్డి రాజేష్ రెడ్డి అధ్యక్షతన వహించగా తెలంగాణ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా పాల్గొ ని లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో రేషన్ కార్డులు అందక ఎంతో మంది అర్హులైన పేదలు ఇబ్బంది పడ్డారని ఆయన మండిపడ్డారు. గత ప్రభుత్వ హయాంలో రేషన్ దుకాణాల ద్వారా అందించిన దొడ్డు బియ్యాన్ని రాష్ట్రంలో ఉన్న 80 శాతం నుండి 90 శాతం ప్రజలు తినలేకపోయారని గుర్తు చేసారు. ఆ బియ్యాన్ని ఐదు రూపాయలకు 10 రూపాయలకు కిలో చొప్పున అమ్ము కోవడం లేదా రీసైక్లింగ్ చేసి కోళ్ల పారాలకు తరలించే వారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ దుస్థితిని మార్చేందుకు తెల్ల రేషన్ కార్డుదారులకు నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేసే చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందని అయన స్పష్టం చేశారు. దీని ద్వారా మూడు కోట్ల 42 లక్షల మంది పేదలు లబ్ధి పొందుతున్నారని అయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గార్లపాటి శ్రీనివాసు లు, రాంబాబు, జగదీష్ చందర్ రెడ్డి, లింగాజీ, బుచ్చయ్య, మహేందర్ రెడ్డి, రవి గౌడ్, మహ్మద్ బాషుమియా, పర్శ సిద్దేశ్, రెవిన్యూ సిబ్బంది, వివిధ గ్రామాల సర్పంచులు, అశోక్, బైకాని రాజు, నాయకు లు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ రాజీనామా చేయాలి

వరంగల్ కోర్టు ముందు న్యాయవాదుల నిరసన



**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా చైర్మన్ చేస్తున్న అనుచిత చర్యల వల్ల బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గౌరవాన్ని, విశ్వసనీయతను, సంస్థాగత వైభవాన్ని కోల్పోయిందని వాటన్నింటి పునరుద్ధరించడానికి అడ్వకేట్స్ యాక్ట్ ప్రకారం బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను చట్టబద్ధంగా నడపటానికి బిసిఐ చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా రాజీనామాను డిమాండ్ చేస్తూ వరంగల్, హనుమకొండ జిల్లా న్యాయవాదులు కోర్టు ప్రధాన గేటు ముందు ధర్నా నిర్వహించి నిరసన తెలిపారు. ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా జరుగుతున్న నిరసనలో బాగంగా శుక్రవారం హనుమకొండలో జరిగిన నిరసనలో ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్, కాంగ్రెస్ లీగల్ సెల్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎఐఎల్ యు రాష్ట్ర కోశాధికారి ఎన్నంశెట్టి వేణుగోపాల్ రావు మాట్లాడుతూ న్యాయవాద వృత్తి నిలబెట్టాల్సిన రాజ్యాంగ విలువలకు కట్టుబడి పనిచేసే న్యాయవాదుల నిజమైన ప్రజాస్వామిక, స్వతంత్ర, ప్రాతినిధ్య సంస్థగా బిసిఐని చైర్మన్ మనన్ కుమార్ మిశ్రా భ్రష్టు పట్టిస్తున్నాడని, ఏక పక్ష నిర్ణయాల వల్ల న్యాయవాదులకు రక్షణ కరువైందని అన్నారు. ఉన్నత విద్యా సంస్థ అయిన నల్సార్ విశ్వవిద్యాలయంలో విద్యనభ్యసించి కాబోయే న్యాయవాదుల భవిషత్‌ను నాశనం చేయాలని చూసిన మనన్ కుమార్ మిశ్రా భారత బార్ కౌన్సిల్ చైర్మన్ పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అనుచిత చర్యలకు పాల్పడి విద్యార్థులకు క్షమాపణ చెప్పిన మనన్ కుమార్ చైర్మన్ పదవికి అనర్హుడని అన్నారు. తన ఆదిపత్య ధోరణితో, పలుకబడితో, బిజెపి అండతో గత 14 ఏండ్లుగా చైర్మన్‌గా కొనసాగుతూ తన వ్యక్తిగత నిర్ణయాలతో ప్రజాస్వామ్య విలువలకు తూట్లు పొడిచి స్వీయ ప్రయోజనాలు పొందుతున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మధుసూదన్ రెడ్డి, నరేందర్, జీవన్ గౌడ్, పద్మ, అనిల్, జన్ను ప్రభాకర్, రఘుపతి, బీమనాథం శ్రీనివాస్, పాల్గొన్నారు.

## డాక్టర్‌పై దాడి కేసులో ఇద్దరికి 14 రోజుల రిమాండ్

**ప్రజాపక్షం:జనగామ:** జనగామలోని ప్రీతి కిడ్నీ కేర్ హాస్పటల్ డాక్టర్ నిశాంత్‌పై దాడి చేసిన కేసులో బండారి శ్రీనివాస్, రాధారపు వెంకటేశ్వర్లుకు జిల్లా జడ్జీ 14 రోజుల జ్యూడిషియల్ రిమాండ్ విధించారు. గత రెండు రోజుల క్రితం బండారి శ్రీనివాస్, వెంకటేశ్వర్లు ఇద్దరు ఆకారణంగా డాక్టర్ నిశాంత్‌పై దాడి చేయగా వారిపై 329(3), 329 బి, 351(2), 115(2), 308(2), ఆర్/డబ్ల్యూ 3(5)బిఎన్ఎస్ సెక్షన్ల క్రింద జనగామ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులు గురువారం మధ్యాహ్నం బండారి శ్రీనివాస్, రాధారపు వెంకటేశ్వర్లను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారించారు. రాత్రి ఇద్దరిని న్యాయమూర్తి ముందు ప్రవేశపెట్టగా 14 రోజుల జ్యూడిషియల్ కస్టడీ విధించారు. వెంటనే పోలీసులు జనగామ సబ్ జైల్‌కు తరలించారు. ఈ కేసులు బండారి శ్రీనివాస్‌ను ఎ2గా, ఎ3గా రాధారపు వెంకటేశ్వర్లును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించగా ఎ1గా ఉన్న వ్యక్తిపై ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది చూడాలి.

## వేగవంతమైన సమన్వయానికి వాకీటాకీలు

**ప్రజాపక్షం/ఖిలా వరంగల్:** రోజు వారీ విధి నిర్వహణలో అధికారులు వాకీటాకీలను సమర్థవంతంగా వినియోగించాలని జిడబ్ల్యూఎంసి కమిషనర్ టి వెంకన్న సూచించారు. శుక్రవారం బల్దియా కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులను వాకీటాకీలను అందజేశారు. కమిషనర్ మాట్లాడుతూ భారీ వర్షాలు, వరదలు, అత్యవసర పరిస్థితుల్లో అధికారుల మధ్య వేగవంతమైన సమాచార మార్పిడి, సమన్వయానికి వాకీటాకీలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. సెల్‌ఫోన్ వినియోగాన్ని తగ్గించి, విధి నిర్వహణలో వాకీటాకీలు వినియోగాన్ని పెంచాలని అధికారులకు సూచించారు.

# గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు

ప్రజా సమస్యలను నేరుగా పరిష్కరిస్తున్న ప్రజా పాలన ప్రభుత్వం

'పల్లె పల్లె కు పొన్నం' పర్యటనలో మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి :** గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.హనుమకొండ జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గం భీమదేవరపల్లి మండలం రసూల్ పల్లి గ్రామంలో "పల్లె పల్లెకు పొన్నం అన్న పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమంలో భాగంగా గ్రామ పంచాయతీ వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల సమక్షంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. గ్రామ ప్రజలు తెలిపిన సమస్యలు, వ్యక్తిగత సమస్యలను అధికారులతో చర్చించి, సాధ్యమైన వాటికి తక్షణ పరిష్కారం చూపేలా మంత్రి అధికారులను ఆదేశించారు.ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రసూల్‌పల్లి గ్రామంలో సంక్షేమ పథకాల ద్వారా గణనీయమైన ప్రయోజనం చేకూరిందని అధికారులు తెలిపారు.రసూల్‌పల్లి నుంచి వీర్లగడ్డ తండాకు వెళ్లే మార్గంలో లో లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ.2.54 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు.అదేవిధంగా రసూల్‌పల్లి గ్రామంలో బ్రిడ్జి నిర్మాణానికి రూ.1.65 కోట్లు విడుదల చేసినట్లు పేర్కొన్నారు.రసూల్‌పల్లి– మల్లారం రోడ్డు అభివృద్ధికి సుమారు రూ.86 లక్షలు మంజూరు చేసినట్లు మంత్రి తెలిపారు. మంజూరైన నిధులతో పనులను ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరు అయ్యాయని, భవన నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని సూచించారు.గ్రామంలోని అంతర్గత రోడ్ల అభివృద్ధికి కూడా ప్రాధాన్యత ఇస్తున్నామని, అవసరమైన నిధులు కేటాయించి పనులను పూర్తి చేస్తామని మంత్రి వెల్లడించారు. మహిళా సంఘాలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని మహిళలు ఆర్థికంగా స్వయం సమృద్ధి సాధించాలని మంత్రి పిలుపునిచ్చారు.మహిళా సంఘాలకు అందించిన స్టీల్ సామగ్రిని ఉపయోగించుకుంటూ ఆదాయాన్ని పెంచుకునే కార్యక్రమాలు చేపట్టాలని, వారికి అవసరమైన శిక్షణ, రుణ సదుపాయాలు, ఉపాధి అవకాశాలను మరింతగా కల్పించాలని అధికారులను ఆదేశించారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, మహిళా సంఘాల ద్వారా పర్యావరణహిత ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించాలని సూచించారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లలకు పోషకాహారం, ఆరోగ్య సేవలు సక్రమంగా అందుతున్నాయా లేదా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని మంత్రి అన్నారు. పిల్లలు, గర్భిణీలు, బాలింతల ఆరోగ్యం విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. గ్రామంలో పారిశుద్ధ్యం, తాగునీరు, డ్రైనేజీ, దోమల నియంత్రణ వంటి అంశాల పై ప్రత్యేక శ్రద్ధ వహించాలని అధికారులను ఆదేశించారు.

**ప్రజల భాగస్వామ్యంతోనే గ్రామాభివృద్ధి**

"పల్లె పల్లెకు పొన్నం అన్న – పల్లె పల్లెలో ప్రజా పాలన" కార్యక్రమం కేవలం ప్రభుత్వ పథకాలను వివరించడానికి మాత్రమే కాదని, ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కరించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బోయిని మహేష్, జిల్లా అధికారులు, మండల అధికారులు, గ్రామ ప్రజలు, రైతులు, మహిళా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట



**ప్రజాపక్షం/భూపాలపల్లి:** పేదల ఆరోగ్యానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, అన్ని వర్గాల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శుక్రవారం భూపాలపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భూపాలపల్లి నియోజకవర్గంలోని గణపురం మండలం బుద్ధారం గ్రామానికి చెందిన అల్లపు రమేష్ అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స కోసం ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఎల్ఓసి (లెటర్ ఆఫ్ క్రెడిట్) ద్వారా రూ.2 లక్షల 50 వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఆరోగ్యశ్రీ పథకంలో కవర్ కాని వ్యాధుల చికిత్స కోసం ప్రభుత్వం ఎల్.ఓ.సి ద్వారా ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నదని తెలిపారు. అర్హులైన పేద, మధ్యతరగతి కుటుంబాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో భూపాలపల్లి మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య గౌడ్, గణపురం పిఏసిఎస్ చైర్మన్ కన్నబోయిన కుమార్ యాదవ్ ,స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అతిథి అధ్యాపకులకు దరఖాస్తులు ఆహ్వానం: ప్రొఫెసర్ పోశయ్య

**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** సికెఎం ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 2026–27 విద్యా సంవత్సరంలో అతిథి అధ్యాపకులుగా పనిచేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జి. పోశయ్య ఒక ప్రకటనలో తెలిపారు. బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్(1), బీకాం హెచ్ ఆర్ ఆపరేషన్స్ (1)లలో ఖాళీగా ఉన్న పోస్టులకు గాను ఓసి, బిసి అభ్యర్థులు అయితే ఎం కామ్ పూర్తి చేసి 55 శాతం మార్కులతో, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు అయితే 50% మార్కులతో ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు.ఎంపికలో పి హెచ్ డి, నెట్, సెట్ అర్హత, బోధన అనుభవం కలిగిన వారికి తొలి ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు.అర్హులైన అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల 24వ తేదీ సాయంత్రం నాలుగు గంటల్లోగా నేరుగా కాలేజీలో అందజేయాలని తెలిపారు.దరఖాస్తులను పరిశీలించి అర్హత కలిగిన వారికి సమాచారం అందించి ఎంపిక ప్రక్రియ చేపడతామని అన్నారు.పూర్తి వివరాల కోసం సికెఎం కళాశాలలో సంప్రదించాలని తెలిపారు.

# ప్రభుత్వ విద్యాసంస్థల్లో అడ్మిషన్లు పెంచాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/మహబూబాబాద్:** జిల్లాలోని ప్రభుత్వ విద్యాసంస్థలలో పిల్లల అడ్మిషన్లను పెంచాలని జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ సూచించారు, శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా విద్యాశాఖ అధికారి, మండల విద్యాశాఖ అధికారులతో విద్యాశాఖ పై సమీక్షా సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యాశాఖ బలోపేతం కోసం ప్రభుత్వం అత్యధిక ప్రాథమిక కల్పిస్తుందని తద్వారా పూర్తి స్థాయిలో కేజీవీబీలు, మోడల్ స్కూల్స్, జిల్లా పరిషత్, ప్రాథమిక ఉన్నత పాఠశాలలో పిల్లల అడ్మిషన్లను పెంచి వారికి నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. ఈ సందర్భంగా లీప్‌లెర్న్ ఇంగ్లీష్ త్రూ యాక్టివ్ పార్టిసిపేషన్ ' పుస్తకాన్ని ఎంఇఓల సమీక్షా సమావేశంలో ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు ఆంగ్ల భాషను కేవలం పాఠ్యాంశంగా కాకుండా వినడం, మాట్లాడటం, చదవడం, రాయడం, చురుకైన భాగస్వామ్యం ద్వారా ఆచరణాత్మకంగా నేర్చుకునేలా ఈ పుస్తకాన్ని రూపొందించారు. తరగతి గదిలో విద్యార్థుల చురుకైన భాగస్వామ్యాన్ని పెంచుతూ, ఆంగ్లంలో మాట్లాడే ధైర్యాన్ని మరియు రోజువారీ కమ్యూనికేషన్ నైపుణ్యాలను అభివృద్ధి చేయడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ అన్నారు. "ఆంగ్ల భాషలో నైపుణ్యం విద్యార్థులకు ఉన్నత విద్య, ఉపాధి మరియు భవిష్యత్ అవకాశాలకు మరిన్ని ద్వారాలు తెరుస్తుంది. ప్రతి విద్యార్థి ఆంగ్లంలో ఆత్మవిశ్వాసంతో మాట్లాడేలా పాఠశాల స్థాయిలో నిరంతర సాధనకు ప్రాధాన్యత ఇవ్వాలి" అని సూచించారు.జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో రూపొందించిన ఈ కార్యక్రమాన్ని ప్రతి పాఠశాలలో సమర్థవంతంగా అమలు చేసి, విద్యార్థుల్లో ఆంగ్ల కమ్యూనికేషన్ సామర్థ్యాలను పెంపొందించేందుకు ఎంఇఓలు, ప్రధానోపాధ్యాయులు మరియు ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి సత్యనారాయణ మూర్తి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ , రాములు,డిఎస్ఓ అప్పారావు, కోఆర్డినేటర్లు పూర్ణచందర్, సురేష్, వెంకటేశ్వర్లు, జిసిడిఓ వై. గాయత్రి, సూపరింటెండెంట్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ యూనివర్సిటీల పరిరక్షణకు ఉద్యమిస్తాం

ఎఐఎస్ఎఫ్ కేయూ ఉపాధ్యక్షులు చిప్పలపల్లి వంశీ



**ప్రజాపక్షం/కేయూ క్యాంపస్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరిస్తోందని, ప్రభుత్వ యూనివర్సిటీల పరిరక్షణ కోసం భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని ఏఐఎస్ఎఫ్ కాకతీయ యూనివర్సిటీ ఉపాధ్యక్షులు చిప్పలపల్లి వంశీ అన్నారు.కాకతీయ యూనివర్సిటీలో ఏఐఎస్ఎఫ్ 91వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. యూనివర్సిటీ ప్రధాన ద్వారం ఎదుట నిర్వహించిన కార్యక్రమంలో చిప్పలపల్లి వంశీ ముఖ్యఅతిథిగా పాల్గొని ఏఐఎస్ఎఫ్ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వంశీ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా విద్యాశాఖను పర్యవేక్షిస్తున్నప్పటికీ రాష్ట్రంలో విద్యారంగ పరిస్థితి ఆందోళనకరంగా ఉందన్నారు. ప్రభుత్వ యూనివర్సిటీలలో పెద్ద సంఖ్యలో టీచింగ్, నాన్‌టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉండటంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య, పరిశోధన మరియు పరిపాలనా సేవలు సక్రమంగా అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.కాకతీయ యూనివర్సిటీ అభివృద్ధికి అవసరమైన స్థాయిలో నిధులు కేటాయించక పోవడంతో మౌలిక వసతుల కొరత, హాస్టళ్ల సమస్యలు, తరగతి గదులు, ప్రయోగశాలలు, గ్రంథాలయం తదితర సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. యూనివర్సిటీని బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు.ఈ కార్యక్రమంలో కేయూ సహాయ కార్యదర్శి అబ్బరబోయిన నాగరాజ్, జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భాను ప్రసాద్, కొండ చరణ్, పెండ్యాల బన్ని, జిల్లా సమితి సభ్యులు రామ్ చరణ్, విజయ్, సౌమ్య, మౌనిక, రమ్య, విజయ తదితరులు పాల్గొన్నారు.

## తప్పులు లేని ఓటర్ల జాబితా రూపొందించడమే లక్ష్యంగా 'సర్' ప్రక్రియ



కలెక్టర్ రాహుల్ శర్మ

**ప్రజాపక్షం/భూపాలపల్లి:** పారదర్శకమైన తప్పులేని ఓటర్ల జాబితా రూపొందించడమే లక్ష్యంగా జరుగుతున్న ప్రత్యేక ఓటరు సవరణకు రాజకీయ పార్టీల సహకారం అవసరమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో ప్రత్యేక ఓటరు సవరణతో భాగంగా జరుగుతున్న మ్యాపింగ్ కాని ఓటర్లు, అనామలిస్ ఓటర్లుకు నోటీసులు జారీ అంశాలపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఓటర్ల జాబితా సవరణ సర్ ప్రక్రియ పురోగతి, అనామలీస్, అన్‌మ్యాపు ఓటర్లకు నోటీసుల జారీ, పరిష్కార ప్రక్రియ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ 17న డ్రాఫ్ట్ ఓటర్ల జాబితా ప్రచురించామని, ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 16 వరకు క్లెయిమ్స్, అభ్యంతరాలు స్వీకరుస్తామని తెలిపారు. జిల్లాలో 11,739 మంది అన్‌మ్యాప్ ఓటర్లు, 20,685 మంది అనామలీస్ ఉన్న ఓటర్లు ఉన్నారని, మొత్తం 32,424 మంది ఓటర్లకు నోటీసులు జారీ చేయాల్సి ఉందని వెల్లడించారు. సంబంధిత మండలాల తహసీల్దార్లు, ఎంపిడిఓలు ద్వారా నోటీసులు జారీ చేసి, వారం రోజుల్లో నిర్వహించే విచారణకు హాజరు కావాలని తెలిపారు. అవసరమైన ఆధారాలను పరిశీలిస్తూ అక్టోబర్ 15 నాటికి ప్రక్రియను పూర్తి చేయనున్నట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్దేశిత తేదీల్లో విచారణకు హాజరై తమ జనన తేదీ, నివాసం తదితర వివరాలను ధృవీకరించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం సూచించిన ఆధారాలను సమర్పించాలని జిల్లా ఎన్నికల అధికారి సూచించారు. పాస్‌పోర్ట్, జనన ధృవీకరణ పత్రం, విద్యార్హత ధృవ పత్రాలు, ఆధార్‌తో పాటు ఎన్నికల సంఘం సూచించిన ఇతర పత్రాలను అవసరాన్ని బట్టి సమర్పించవచ్చని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నవీన్ రెడ్డి, హరికృష్ణ, శిక్షణా డిప్యూటి కలెక్టర్ నవీన్ రెడ్డి, భూపాలపల్లి తహసీల్దార్ లక్ష్మి రాజయ్య, ఎన్నికల సెక్షన్ డిటి అబ్బాస్, సిబ్బంది నవీన్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మడికొండ పోలీస్ శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన సిపి



**ప్రజాపక్షం/వరంగల్ క్రైమ్ :** మడికొండలోని పోలీస్ శిక్షణ కేంద్రాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత ఐపిఎస్ శుక్రవారం సందర్శించారు. శుక్రవారం ఉదయం శిక్షణ కేంద్రాన్ని చేరుకున్న పోలీస్ కమిషనర్ కు శిక్షణా కేంద్రం పోలీస్ అధికారులు మొక్కను అందజేసి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్ కమిషనర్ శిక్షణ కేంద్రాన్ని పరిశీలించడంతో పాటు వివిధ అంశాలపై శిక్షణకై వచ్చే పోలీస్ అధికారులకు కల్పిస్తున్న మౌలిక వసతులు, తరగతి గదులను పరిశీలించి.. ఈ కేంద్రం విధులు నిర్వహిస్తున్న అధికారులు, ఇతర సిబ్బంది పనితీరును సీపీ సంబంధిత పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు.పోలీస్ కమిషనర్ వెంట అదనపు డీసీపీ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ రమణ బాబు, ఇన్స్ స్పెక్టర్ రవికుమార్, ఆర్. ఐ సింహచలం శ్రీనివాస్, ఆర్. ఎస్. ఐ రవి తేజ తో పాటు ఇతర పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

# గూడూరుకు ఇంటిగ్రేటేడ్ స్కూల్ గర్వకారణం



రూ. 200 కోట్లతో అత్యాధునిక విద్యా సంస్థ నిర్మాణం

ఎమ్మెల్యే మురళి నాయక్

వచ్చే జూన్ నాటికి అందుబాటులోకి తీసుకొచ్చేలా పనులు

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అరుణ్ కుమార్

**ప్రజాపక్షం/గూడూరు:** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలానికి రూ 200 కోట్ల భారీ వ్యయంతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ స్కూల్ ప్రాంత విద్యారంగంలో ఒక మైలురాయిగా నిలవనుందని ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ అన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లోని పేద గిరిజన విద్యార్థులకు అత్యుత్తమ విద్యా అవకాశాలను అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యంతో ప్రభుత్వం ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టును చేపడుతోందని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణం పూర్తయితే గూడూరు మండలంతో పాటు చుట్టపక్కల ఏజెన్సీ ప్రాంతాల విద్యార్థులకు ఒకే ప్రాంగణంలో నాణ్యమైన విద్య ఆధునిక సౌకర్యాలు మెరుగైన విద్యా వాతావరణం అందుబాటులోకి వస్తాయని ఎమ్మెల్యే మురళి నాయక్ పేర్కొన్నారు.ఇప్పటివరకు ఉన్నత విద్య కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తున్న విద్యార్థులకు ఈ పాఠశాల ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని చెప్పారు.

**రూ. 200 కోట్లతో భారీ ప్రాజెక్టు:** ప్రభుత్వం రూ 200 కోట్లతో నిర్మించనున్న ఈ ఇంటిగ్రేటెడ్ స్కూల్‌లో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక వసతులను సమకూర్చేలా ప్రణాళిక రూపొందిస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.విద్యతో పాటు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి అనువైన వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాల్లోని ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి వారిని ఉన్నత స్థాయికి తీసుకెళ్లడమే లక్ష్యంగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని వివరించారు.

**గూడూరు ప్రజలకు గర్వకారణం:** ఇంత భారీ స్థాయిలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ గూడూరుకు రావడం మండల ప్రజలకు గర్వకారణమని ఎమ్మెల్యే మురళి నాయక్ అన్నారు. ఈ ప్రాజెక్టు భవిష్యత్ తరాల విద్యార్థుల జీవితాల్లో మార్పు తీసుకురావడంతో పాటు గూడూరు ప్రాంత విద్యా రంగ అభివృద్ధికి దోహదపడుతుందని పేర్కొన్నారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

**వచ్చే జూన్ నాటికి అందుబాటులోకి తేస్తాం: ఈఈ అరుణ్ కుమార్:** ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణ పనులను నిర్ణీత గడువులో పూర్తి చేసి వచ్చే జూన్ నాటికి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడానకి చర్యలు చేపడుతున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అరుణ్ కుమార్ తెలిపారు.నిర్మాణ పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.విద్యార్థులకు అనువైన తరగతి గదులు వసతి ఇతర అవసరమైన మౌలిక సదుపాయాలతో ప్రాజెక్టును అత్యుత్తమ ప్రమాణాలతో నిర్మించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని అరుణ్ కుమార్ వివరించారు.నిర్ణీత సమయంలో పనులు పూర్తి చేసి వచ్చే విద్యా సంవత్సరానికి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని స్పష్టం చేశారు.



**ఏజెన్సీ విద్యార్థులకు బంగారు భవిష్యత్:** గూడూరులో నిర్మించనున్న ఇంటగ్రేటెడ్ స్కూల్ ద్వారా ఏజెన్సీ ప్రాంత విద్యార్థులకు విద్యాపరంగా మరింత మెరుగైన అవకాశాలు లభించనున్నాయి. పేద మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు సైతం ఆధునిక విద్యావసతులను వినియోగించుకుని ఉన్నత స్థాయికి ఎదగడానికి ఈ పాఠశాల దోహదపడనుంది. రూ 200 కోట్లతో చేపడుతున్న ఈ ప్రతిష్టాత్మక నిర్మాణం పూర్తయితే గూడూరు ప్రాంతం విద్యారంగంలో ప్రత్యేక గుర్తింపు పొందే అవకాశం ఉందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రజలకు ఉపయోగపడేలా ప్రభుత్వం చేపడుతున్న ఈ భారీ విద్యా ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావడమే తమ ప్రధాన లక్ష్యమని ఎమ్మెల్యే మురళి నాయక్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అరుణ్‌కుమార్ స్పష్టం చేశారు.

ప్రజాపక్షం
కరీంనగర్
శనివారం
22-08-2026
www.prajapaksham.in

విక్టరీ వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, దర్శకుడు అనిల్ రావిపూడి క్రేజీ కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన, జి స్టూడియోస్ సమర్పిస్తున్నాయి.

రీల్

## అక్టోబర్ 9న రానున్న 'ఇట్లు అర్జున'

డైరెక్టర్ వెంకీ కుడుముల నిర్మాతగా వాట్ నెక్స్ట్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై తెరకెక్కిస్తున్న చిత్రం 'ఇట్లు అర్జున'. ఈ సినిమాతో అనీష్ హీరోగా పరిచయం అవుతుండగా, డెబ్యూ దర్శకుడు మహేష్ ఉప్పల దర్శకత్వం వహిస్తున్నారు. అనస్వర రాజన్ కథానాయికగా నటిస్తున్నారు. టైటిల్ గ్లింప్స్, ఇప్పటికే విడుదలైన రెండు పాటలు ఇప్పటికే ప్రేక్షకుల్లో క్యూరియాసిటీని పెంచాయి. 'ఇట్లు అర్జున' అక్టోబర్ 9న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. విడుదల తేదీని ప్రకటిస్తూ విడుదల చేసిన పోస్టర్ ఆసక్తికరంగా ఆకట్టుకుంటోంది. పోస్టర్లో అనీష్ స్టైలిష్ లుక్లో ఓ భవనం పైకప్పు నుంచి దూకుతూ ఏదో పట్టుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టుగా కనిపిస్తుండగా, అనస్వర రాజన్ చేతులు కట్టబడి, విభిన్నమైన ఎక్స్ప్రెషన్తో కనిపించడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. సినిమాకు ఇప్పటివరకు విడుదలైన ప్రమోషనల్ కంటెంట్లో కనిపించిన లీడ్ పెయిర్ కెమిస్ట్రీ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ చిత్రంలో అనీష్ చెవిటి మూగ యువకుడి పాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి ఎస్. థమన్ సంగీతం అందిస్తుండగా, రాజా మహాదేవ్ సినిమాటోగ్రఫీ నిర్వహిస్తున్నారు. రామ్ కుమార్ ఏ ప్రొడక్షన్ డిజైనర్గా, కోటి కే ఎడిటర్గా పనిచేస్తున్నారు. యాక్షన్ సన్నివేశాలకు దిలీప్ సుబ్బరాయన్ కొరియోగ్రఫీ చేస్తున్నారు.



## సెప్టెంబర్ 4న 'ధర్మస్థల నియోజకవర్గం'

మూవింగ్ డ్రీమ్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ పతాకంపై సుమన్, సాయికుమార్, నటరాజ్, రాయంచ కొక్కుర వరుణ్ సందేశ్, వితికా షేరు ప్రధాన పాత్రలలో నటిస్తున్న చిత్రం 'ధర్మస్థల నియోజకవర్గం'. జై జ్ఞాన ప్రభ తోట దర్శకత్వంలో మేరుం భాస్కర్ నిర్మిస్తోన్న ఈ పొలిటికల్ ఎంటర్టైనర్ చిత్రం.. సెప్టెంబర్ 4న వరల్ వైడ్ థియేట్రికల్ రిలీజ్ కు రాబోతోంది. ఈ చిత్రాన్ని 'పివిఆర్ సినిమాస్ డిస్ట్రిబ్యూషన్' ద్వారా ఆంధ్ర,తెలంగాణలో రిలీజ్ చేయనున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్ లో ఈ చిత్ర ప్రెస్ మీట్ నిర్వహించారు. నటుడు సుమన్ మాట్లాడుతూ ఈ మూవీ మీద నాకు మంచి నమ్మకం ఉంది. సినిమా హిట్ అవుతుందనే ఆశిస్తూ వచ్చాను. డైరెక్టర్ జై జ్ఞాన ప్రభ కథ చెప్పినప్పుడే ప్రేక్షకుల్ని ఆకట్టుకునే సినిమా అవుతుందని నమ్మాను. ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా ఈ సినిమాను మా దర్శక నిర్మాతలు తెరకెక్కించారు. సెట్ లో అన్నీ కుదరకపోతే ఒక్కోసారి షూటింగ్ క్యాన్సిల్ చేసిన సందర్భాలూ ఉన్నాయి. కానీ క్వాలిటీ మీద కాంప్రమైజ్ కాలేదు. ఈ చిత్రంలో ఒక మంచి క్యారెక్టర్ చేసే అవకాశం రావడం సంతోషంగా ఉంది. సెప్టెంబర్ 4న ఈ సినిమాను చూసి మీరంతా ఆదరించాలని కోరుకుంటున్న అన్నారు.

హీరోయిన్ వితికా షేరు మాట్లాడుతూ నేను హీరోయిన్ గా కంటే ఒక నటిగా మంచి గుర్తింపు పొందాలని కోరుకున్నాను. నటిగా నాకు మంచి పేరు తెచ్చే క్యారెక్టర్ ను ఈ సినిమాలో చేశాను అన్నారు.నటి కస్తూరి మాట్లాడుతూ అర్థం పర్థం లేని కామెడీ, డ్రామా ఉన్న సినిమా కాదిది. ఒక పర్పస్ ఫుల్ మూవీ. ప్రేక్షకుల్ని ఆలోచింపజేసే చిత్రమిది. ఇలాంటి సినిమా ఇప్పుడున్న సొసైటీకి కావాలి. జెన్ జీ ఆటపాటలతో సరదాగా సమయం గడపడం లేదు. ఆలోచిస్తున్నారు అన్నారు.పివిఆర్ సినిమాస్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఉదయ్ మాట్లాడుతూ రీసెంట్ గా వస్తున్న సినిమాలన్నీ హిట్ అవుతున్నాయి. అదే కోవలోనే ఈ ధర్మస్థల నియోజవర్గం సినిమా కూడా హిట్ అవుతుందని ఆశిస్తున్నాను అని అన్నారు. సంగీత దర్శకుడు మహావీర్ ఏలేందర్ , హీరో నటరాజ, చిత్ర దర్శకుడు జై జ్ఞాన ప్రభ తోట, నిర్మాత మేరుం భాస్కర్ పాల్గొన్నారు.

**ఈ చిత్రానికి సంగీతం: మహావీర్ ఎల్లంధర్, పాటలు : చంద్రబోస్, సింగర్: సునీత, డి ఓ పి: వెంకట హనుమ, ఫైట్స్: నందు మాస్టర్, కొరియోగ్రఫీ: శ్రష్టి వర్మ,**



## 'ఇరుముడి'కి నేనే డబ్బింగ్ చెప్పా
## చిట్ చాట్ లో బాల నటి బేబీ నక్షత్ర

మాస్ మహారాజా రవితేజ నటించిన 'ఇరుముడి'. ప్రియా భవానీ శంకర్ హీరోయిన్గా నటిస్తున్నారు. శివ నిర్వాణ దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 21న థియేటర్లలోకి విడుదలైంది. ఈ సినిమా హిట్ టాక్ తెచ్చుకుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన బేబీ నక్షత్ర మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. నా పేరు నక్షత్ర. మాది కేరళ. నేను ఏడో క్లాస్ చదువుకుంటున్నాను. ఇప్పటివరకు కన్నడ, మలయాళం, తమిళ్ భాషల్లో కలిపి ఆరు సినిమాలు చేశాను. దర్శకుడు శివ నిర్వాణ ఇన్స్టాగ్రామ్లో నా రీల్స్ చూసి ముందుగా మా అమ్మని సంప్రదించారు. 'ఇరుముడి' నా తొలి తెలుగు సినిమా కావడం చాలా ఆనందంగా ఉంది.రవితేజ తో వర్క్ చేయడం చాలా హ్యాపీగా అనిపించింది. ఇరుముడి సినిమా హిట్ అవ్వడం చాలా హ్యాపీగా ఉంది. రవితేజ నాతో ఫ్రెండ్లీగా ఉన్నారు. ఆయన అంటే నాకు చాలా ఇష్టం. రవితేజ సినిమాల్లో నాకు 'విక్రమార్కుడు' చాలా ఇష్టం. ఇందులో నా పాత్ర పేరు మణికంఠ. నేను రవి తేజ కూతురిగా నటించాను. ప్రియా మేడమ్ నా తల్లి పాత్రలో నటించారు. రవితేజ, ప్రియా మేడమ్ ఇద్దరూ నాతో ఎంతో ఫ్రెండ్లీగా ఉన్నారు. ఈ సినిమాకి స్వయంగా డబ్బింగ్ చెప్పాను. ఈ సందర్భంగా మా అమ్మకు థాంక్స్ చెప్తున్నాను. తనే నాకు చాలా సపోర్ట్ చేస్తుంది. ముఖ్యంగా మా టీచర్స్ నాకు చాలా సపోర్ట్ చేస్తున్నారు. మా పేరెంట్స్, టీచర్స్ సపోర్ట్తోనే నేను సినిమాలు చేయగలుగుతున్నాను.'ఇరుముడి'లో పాటలన్నీ నాకు ఇష్టం. కాకపోతే 'యాలో యాలో' పాట నా ఫేవరెట్. దర్శకుడు శివ నిర్వాణ సపోర్ట్తోనే ఈ సినిమాను చాలా కాన్ఫిడెంట్గా చేయగలిగాను. సీలేరులో ఈ సినిమాను షూట్ చేశాం. అక్కడి ప్రదేశాలు నాకు కేరళ లాగే అనిపించాయి. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాణంలో పనిచేయడం చాలా హ్యాపీగా ఉంది. వారి నిర్మాణంలో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాను.



## 'బ్యాడ్ టైం బ్యాండ్ బాజా' పాడుకుంటున్న అల్లరి నరేష్

కామెడీ సినిమాలతో ప్రేక్షకుల్లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న అల్లరి నరేష్ మరోసారి తనకు బాగా కలిసొచ్చిన జానర్లో సందడి చేయబోతున్నారు. ఆయన హీరోగా నటిస్తున్న ఫాంటసీ కామెడీ ఎంటర్టైనర్ 'రంభ ఊర్వశి మేనక'. చంద్ర మోహన్ చింతాడ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని అన్నపూర్ణ స్టూడియోస్, హాస్య మూవీస్ బ్యానర్లపై రాజేష్ దండా, నిమ్మకాయల ప్రసాద్ నిర్మిస్తున్నారు.తాజాగా బ్యాడ్ టైం బ్యాండ్ బాజా సాంగ్ రిలీజ్ చేశారు. 'బ్యాడ్ టైం బ్యాండ్ బాజా' పేరుకు తగ్గట్టుగానే పాట ఆద్యంతం ఫుల్ ఎనర్జీ, ఫన్తో సాగుతుంది. హీరో జీవితంలో ఎదురయ్యే బ్యాడ్ టైమ్ను కామెడీగా ప్రజెంట్ చేస్తూ, క్యాచీ ట్యూన్తో పాటను ఆసక్తికరంగా తీర్చిదిద్దారు. చేతన్ భరద్వాజ్ కంపోజ్ చేసిన ఎనర్జిటిక్ ట్యూన్కు రామ్ మిరియాల తన ప్రత్యేకమైన వాయిస్తో మరింత జోష్ తీసుకొచ్చారు.భాస్కరభట్ల రవికుమార్ అందించిన లిరిక్స్ పాటలోని కామెడీ, ఫన్ ఎలిమెంట్స్ను మరింత ఎలివేట్ చేస్తున్నాయి.రంభ ఊర్వశి మేనక గా రాశి సింగ్, విష్ణుప్రియ, ప్రిషా సింగ్ ప్రజెన్స్ ఆకట్టుకుంది. రామ్ మిరియాల ఎనర్జిటిక్ వోకల్స్, భాస్కరభట్ల క్యాచీ లిరిక్స్ ఈ పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.'రంభ ఊర్వశి మేనక' సెప్టెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది. అల్లరి నరేష్, సురభి, రాశి సింగ్, విష్ణుప్రియ, ప్రిషా సింగ్, వెన్నెల కిషోర్, నరేష్ వి.కె., శ్రీనివాస్ రెడ్డి, రచ్చ రవి, మురళీధర్ గౌడ్ తదితరులు నటించిన **ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రామ్ రెడ్డి, ఆర్ట్ డైరెక్టర్: బ్రహ్మ కడలి, ఎడిటర్: చోటా కె. ప్రసాద్.**



## త్రివిక్రమ్‌తో పోల్చడం గౌరవంగా భావిస్తున్నాను
### 'విశ్వనాథ్ అండ్ సన్స్' దర్శకుడు వెంకీ అట్లూరి



తమిళ అగ్ర కథానాయకుడు సూర్య నటించిన తాజా చిత్రం 'విశ్వనాథ్అండ్ సన్స్'. లక్కీ భాస్కర్ సక్సెస్ తరువాత దర్శకుడు వెంకీ అట్లూరి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో మమితా బైజు కథానాయికగా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్టైన్మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య సంయుక్తంగా నిర్మించారు. సహజమైన హాస్యం, సున్నితమైన భావోద్వేగాలతో హృదయాన్ని హత్తుకునే కుటుంబ కథా చిత్రంగా ఆగస్టు 14న థియేటర్లలో అడుగుపెట్టిన 'విశ్వనాథ్ అండ్ సన్స్' సినిమాకి ప్రేక్షకులు బ్రహ్మరథం పడుతున్నారు. కేవలం నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.150 కోట్లకు పైగా గ్రాస్ వసూళ్లను సాధించిన ఈ చిత్రం, అఖండ విజయం దిశగా దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో దర్శకుడు వెంకీ అట్లూరి మీడియాతో చిట్ చాట్ నిర్వహించారు. చాలా చాలా సంతోషంగా ఉంది. మేము ఊహించిన దానికంటే అద్భుతమైన స్పందన లభిస్తోంది. నిజానికి ఆయన ఒక ఫ్యామిలీ స్టోరీ కోసం చూస్తున్నారు. అదే విషయం నాకు చెప్పారు. సూర్యకి కథ చాలా నచ్చింది. అయితే ఈ కథకు అనవసరమైన కామెడీ లేదా కమర్షియల్ అంశాలు జోడించకుండా.. నిజాయితీగా చెబుదామని అన్నారు. అందుకే క్లైమాక్స్ విషయంలో చాలా జాగ్రత్త తీసుకున్నాము. నేను సినీ పరిశ్రమలోకి రావడానికి స్ఫూర్తి మణిరత్నం , త్రివిక్రమ్ . అలాంటిది త్రివిక్రమ్ తో నన్ను పోల్చడం అనేది గౌరవంగా భావిస్తున్నాను. త్రివిక్రమ్ 'నువ్వు నాకు నచ్చావ్' సినిమా అంటే నాకు చాలా ఇష్టం. సంభాషణలు సరదాగా ఉంటూనే, జీవిత సత్యాలు చెబుతాయి. ఆ సినిమా నాలో ఎంతో స్ఫూర్తి నింపింది. ఆ తరహా రచన రాయడానికి ఇష్టపడతాను.వయసు వ్యత్యాసం ఉన్న బంధంపై కథ రాయాలని మొదట అనుకున్నాను. 40 ఏళ్ళు వచ్చినా పెళ్ళి చేసుకోకపోవడానికి బలమైన కారణం ఉండాలి. దాని చుట్టు అల్లుకున్న కథ ఇది. నా దృష్టిలో మనుషులు చెడ్డవారు కాదు. పరిస్థితుల వల్ల ఒక్కోలా ప్రవర్తిస్తూ ఉంటారు. అదే విషయాన్ని సినిమాలో చెప్పడం జరిగింది. ఈ కథ నేను 2022 లోనే అనుకున్నాను. అప్పుడు సూర్యని దృష్టిలో ఉంచుకొని రాయలేదు. సితార ఎంటర్టైన్మెంట్స్ సూర్య మార్కెట్ ను దృష్టిలో ఉంచుకొని తమిళంలో చిత్రీకరించాము. తెలుగు రాష్ట్రాలతో పోలిస్తే తమిళనాడులో థియేటర్ల సంఖ్య తక్కువ. టికెట్ ధరలలో కూడా వ్యత్యాసం ఉంది. అందుకే అక్కడ వసూళ్లు తక్కువ వచ్చాయని అనిపిస్తుంది. కానీ, మన దగ్గరతో పోలిస్తే అక్కడ లాంగ్ రన్ ఉంటుంది. కరుప్పు విషయంలో అదే జరిగింది. 'విశ్వనాథ్ అండ్ సన్స్' కూడా లాంగ్ రన్ లో తమిళంలో భారీ వసూళ్లు సాధిస్తుంది.

# కార్మిక హక్కులు బలహీన పర్చవద్దు

### అమర్‌జిత్ కౌర్ డిమాండ్
### సుప్రీం కోర్టు జై బీర్ సింగ్ తీర్పుపై ఆందోళన



**న్యూఢిల్లీ:** కొత్త కార్మిక కోడ్‌లు కార్మికుల హక్కులను బలహీనపరిచే సాధనాలుగా మారకూడదని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్ సింగ్ స్పష్టంచేశారు. సామాజికఆర్థిక న్యాయం, సమానత్వం, కార్మిక గౌరవం, సంఘటిత హక్కులపై రాజ్యాంగబద్ధమైన నిబద్ధతను బలోపేతం చేయాలని శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. గతంలో కార్మిక హక్కులు, సామాజిక న్యాయం, రాజ్యాంగ సమానత్వ పరిరక్షణలో న్యాయవ్యవస్థ ప్రశంసనీయమైన పాత్ర పోషించిందన్నారు. సంస్థాగత అధికారం, ఆర్థిక ప్రయోజనాల ప్రభావానికి న్యాయవ్యవస్థ లోనుకారాదని అమర్‌జిత్ కౌర్ పేర్కొన్నారు. సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం యూపీ వర్సెస్ జై బీర్ సింగ్ కేసులో ఇచ్చిన తీర్పు క్రమంలో 1947 నాటి పారిశ్రామిక వివాదాల చట్టం కింద 'పరిశ్రమ' నిర్వచనంపై ఆందోళన వ్యక్తం చేశారు. పారిశ్రామిక సంబంధాల కోడ్2020లోని సెక్షన్ 2 (పి)ను ప్రస్తావించారు. బెంగళూరు నీటి సరఫరా కార్యాచరణకు సంబంధించిన తీర్పులోని న్యాయసూత్రాలను మెజారిటీ ధర్మాసనం కొనసాగించినప్పటికీ, 'పరిశ్రమ' నిర్వచనాన్ని పునర్ వ్యాఖ్యానించడంతో పాటు పారిశ్రామిక సంబంధాల కోడ్‌లోని సెక్షన్ 2(పి)ను నిరాకరించడం వల్ల కొత్త కార్మిక చట్టాల పరిధిలో కార్మికులకు సంబంధించిన కీలక ప్రశ్నలు ఇంకా అపరిష్కృతంగానే ఉంటాన్ని అమర్‌జిత్ కౌర్ గుర్తుచేశారు. ఈ విషయంలో జస్టిస్ బీవీ నాగరత్న ఇచ్చిన భిన్నాభిప్రాయ తీర్పును ప్రత్యేకంగా ప్రస్తావించారు. పారిశ్రామిక వివాదాల చట్టం స్థానంలో పారిశ్రామిక సంబంధాల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ఈ పునర్విమర్శ అవసరాన్ని జస్టిస్ నాగరత్న ప్రశ్నించారన్నారు. ప్రభుత్వ రంగ కార్యకలాపాలు ప్రైవేటుపరమైతే కార్మికులపై ప్రభావం, రక్షణ కోల్పోయే పరిస్థితిని ఆమె ప్రస్తావించినట్లు అమర్‌జిత్ కౌర్ పేర్కొన్నారు. జస్టిస్ బాగ్చీ కూడా కేసు విచారణకు సంబంధించిన అంశాలను అంగీకరించినప్పటికీ, మెజారిటీ ధర్మాసనం ప్రతిపాదించిన పునర్వ్యాఖ్యానాన్ని తిరస్కరించారన్నారు. ఒక సంస్థ స్వభావం కంటే అది నిర్వహించే కార్యకలాపాల స్వభావానికే ప్రాధాన్యత ఉండాలన్నారు. కొత్త కార్మిక కోడ్‌లో సార్వభౌమ విధులు, స్వచ్ఛంద, సామాజిక, దాతత్వ సంస్థలకు మినహాయింపులు...కార్మికులను పారిశ్రామిక సంబంధాల చట్టపరమైన రక్షణకు దూరం చేయొచ్చని అమర్‌జిత్ కౌర్ ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వ కార్యకలాపాలన్నింటినీ 'సార్వభౌమ విధులు'గా పరిగణించరాదని, ఒక సంస్థను దాతత్వ సంస్థగా పిలిచినంత మాత్రాన అక్కడ పని చేస్తున్న ఉద్యోగుల ప. పారిశ్రామిక స్వభావాన్ని కోల్పోదని స్పష్టం చేశారు. ప్రైవేటీకరణ, ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టీకరణ, ప్రభుత్వప్రైవేటు భాగస్వామ్యాలు పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో ఉద్యోగి పని స్వభావం కంటే యాజమాన్య సంస్థ హోదాకు అధిక ప్రాధాన్యతివ్వడం కార్మికులకు నష్టమని హెచ్చరించారు. మెజారిటీ ధర్మాసనం అనుసరించిన విధానం సంస్థాగత, యాజమాన్య ప్రయోజనాలకు కార్మికుల సామూహిక హక్కులు, బేరసారాల శక్తి కంటే ఎక్కువ ప్రాధాన్యతిచ్చే నిర్మాణాత్మక ధోరణిని ప్రతిబింబిస్తోందన్నారు. న్యాయవర్తుల వ్యక్తిగత ఉద్దేశాలను ప్రశ్నించడం లేదని చెప్పారు. కార్మిక శక్తిని బలహీనపరిచే న్యాయ వ్యాఖ్యల సామాజిక పరిణామాలను విస్మరించలేమని అన్నారు. సామాజిక, ఆర్థిక న్యాయం, సమానత్వం, కార్మిక గౌరవం, సంఘటిత స్వేచ్ఛకు రాజ్యాంగం హామీ ఉన్నందున యజమాని... ప్రభుత్వ సంస్థ లేదా కాంట్రాక్టర్ లేదా దాతత్వ సంస్థ అయినా కార్మికులకు సమానమైన పని రక్షణ నిరాకరించేలా పారిశ్రామిక సంబంధాల కోడ్‌ను ఉపయోగించడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు అమర్‌జిత్ కౌర్ వెల్లడించారు.

## రూ.264 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

50.9 శాతం అధికంగా నమోదైంది. రాయదుర్గ్ వంటి కీలక ఐటి, వాణిజ్య కారిడార్‌లో పెట్టుబడిదారుల ఆసక్తి ఏ స్థాయిలో ఉందో ఈ వేలం ఫలితం స్పష్టం చేస్తోంది. జాతీయ స్థాయి ప్రముఖ డెవలపర్ల మధ్య నెలకొన్న తీవ్ర పోటీతో ధర భారీగా పెరిగినట్లు టిజిఐఐసి వెల్లడించింది. రాయదుర్గ్ భూముల ధరలు స్వల్ప వ్యవధిలోనే భారీగా పెరుగుతున్నాయి. 2026 మేలో టిజిఐఐసి నిర్వహించిన వేలంలో ఎకరాకు రూ.237 కోట్లు ధర పలికింది. తాజాగా ఆ రికార్డును అధిగమిస్తూ ప్లాట్ పి1ఎకరాకు రూ.264 కోట్లకు చేరింది. కేవలం మూడు నెలల వ్యవధిలోనే ధరలో గణనీయమైన పెరుగుదల చోటుచేసుకోవడం హైదరాబాద్ ప్రీమియం రియల్ ఎస్టేట్ మార్కెట్‌పై ఉన్న నమ్మకానికి నిదర్శనంగా అధికారులు పేర్కొన్నారు. ఈ వేలం ఎంఎస్‌టిసి ఈఆక్షన్ ప్లాట్‌ఫామ్ ద్వారా నిర్వహించారు. జెఎల్‌ఎల్ ప్రత్యేక లావాదేవీ సలహాదారుగా వ్యవహరించింది. పారదర్శక ప్రక్రియతో జాతీయ స్థాయి డెవలపర్లు పోటీలో పాల్గొనేలా అవకాశం కల్పించినట్లు టిజిఐఐసి తెలిపింది.టిజిఐఐసి వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె. శశాంక మాట్లాడుతూ.. రాయదుర్గ్ ప్లాట్ పి1 వేలం విజయవంతం కావడం తెలంగాణ భవిష్యత్తుపై డెవలపర్ వర్గాలకు ఉన్న విశ్వాసానికి నిదర్శనమన్నారు. ఇది కేవలం భూమి ధర పెరుగుదల మాత్రమే కాదని, పారదర్శకత, మౌలిక వసతులు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం వంటి ప్రభుత్వ విధానాలకు మార్కెట్ నుంచి లభించిన స్పష్టమైన మద్దతని పేర్కొన్నారు.హైదరాబాద్ ప్రపంచస్థాయి వ్యాపార కేంద్రంగా రూపాంతరం చెందుతోందని, తాజా వేలం ఫలితాలు దేశంలోని ప్రముఖ పెట్టుబడి గమ్యస్థానాల్లో హైదరాబాద్ స్థానాన్ని మరింత బలోపేతం చేస్తున్నాయని శశాంక తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్‌రెడ్డి, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు నాయకత్వంలో తెలంగాణలో పారదర్శక, వ్యాపార అనుకూల వాతావరణం ఏర్పడిందని ఆయన పేర్కొన్నారు.వ్యూహాత్మక భూముల మానిటైజేషన్, పారదర్శక కేటాయింపు ప్రక్రియలు, అత్యున్నత స్థాయి మౌలిక వసతుల అభివృద్ధి ద్వారా తెలంగాణ పారిశ్రామిక, ఆర్థిక అభివృద్ధికి టిజిఐఐసి మరింత ఊతమివ్వనుందని అధికారులు తెలిపారు.

## రెవెన్యూ కార్యాలయంలో టాయిలెట్ శుభ్రం చేసిన మంత్రి జూపల్లి

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి:** నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం పెంట్లవెల్లి మండల్ రెవెన్యూ కార్యాలయాన్ని మంత్రి జూపల్లి కృష్ణారావు శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ సందర్భంగా టాయిలెట్ అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించి, మంత్రి స్వయంగా శుభ్రం చేసి అధికారులకు కనువిప్పు కలిగించారు. దరఖాస్తులు ఫైళ్ల పరిష్కారంలో జరుగుతున్న జాప్యంపై మంత్రి అసహనం వ్యక్తం చేశారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పెండింగు ఉంచి, వారిని కార్యాలయాల చుట్టూ తిప్పించుకోవడం సరికాదని మందలించారు. ఇకనైనా పనితీరును మార్చుకోవాలి. హితవు పలికారు. పారిశుద్ధ్య సామాగ్రి, టైల్స్ ఏర్పాటుకు మంత్రి తన వంతుగా తక్షణ ఆర్థిక సాయం అందించి, కార్యాలయ పరిసరాలతో పాటు టాయిలెట్లను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని అధికారులకు సూచించారు. ప్రజలకు అందించే సేవల్లో జాప్యం లేకుండా చూడటంతో పాటు కార్యాలయాల్లో పరిశుభ్రమైన వాతావరణం కల్పించడం అధికారుల బాధ్యత అని మంత్రి స్పష్టం చేశారు.



## పతనం తప్పదు

(మొదటి పేజీ తరువాయి)

చైతన్యవంతులైన ఈ తరాన్ని చూసి మోడీ భయపడుతున్నాడని సాంబశివరావు తెలిపారు.మోడీ విధానాల కారణంగా యువత తీవ్ర అసహనానికి గురైందని, అసహనం నుంచి ఆవేశం వచ్చిందని దీంతో మోడీ తలవంచక తప్పలేదని ఆయన తెలిపారు.యువతరం ముఖ్యంగా జెన్ జీ వీధుల్లోకి పోరాట మార్గం ఎంచుకోవటంతో మోడీ అహంకారంపై తొలి వేటు పడిందన్నారు. అందుకే స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా దిమాగీ నక్సల్స్ అన్న పదాన్ని తెరపైకి తెచ్చి ప్రశ్నించేవారిని దిమాగీ నక్సల్స్‌గా ముద్ర వేసి నిర్బంధించే ప్రయత్నం చేస్తుందని కూనంనేని తెలిపారు. మావోయిస్టులను లేదా కమ్యూనిస్టులను భౌతికంగా హతమార్చినా భావజాలాన్ని తుద ముట్టించేందుకు దిమాగి నక్సల్స్ పేరుతో నిర్బంధాలు, హతమార్చటం లాంటి చర్యలకు పాల్పడే ప్రమాదం ఉందని ఆయన తెలిపారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన మోడీ ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతున్నారని మోడీ ఏవలం అంబానీ, అదానీ కోసం ప్రదానిగా పనిచేస్తున్నారని కూనంనేని ఆరోపించారు. ప్రపంచ వ్యాప్తంగా వామపక్ష భావజాలం పెరుగుతుందని, పెట్టుబడిదారి దేశం అమెరికాలో ట్రంప్‌కు వ్యతిరేకంగా సోషలిస్టులు వరుస విజయాలు సాధిస్తున్నారని న్యూయార్క్ మేయర్‌ను సోషలిస్టు భావజాలం ఉన వ్యక్తి గెలుచుకున్నారన్నారు. సమాజ చోధకశక్తి యువతేనని మారిన మారుతున్న పరిణామాలను నిరంతరం అధ్యయనం చేస్తూ పోరాటతత్వాన్ని అలవర్చుకోవాలి. యువత సైద్ధాంతిక నైతిక శారీరక బలాన్ని పెంపొందించుకోవాలని యువతకు సూచించారు.






**పోరాటాల కాణాచి ఎఐవైఎఫ్– వలీ, దర్మేంద్ర**

భారతదేశ యువజనోద్యమాలకు దిక్సూచి ఎఐవైఎఫ్ అని పోరాటాల కాణాచిగా పెరుగాంచిందని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలీ ఉల్లా ఖాద్రీ, కల్లూరి దర్మేంద్ర తెలిపారు.యువజన సమాఖ్య మహాసభలో వారు మాట్లాడుతూ పాలకులు యువతకు సంబందించిన ఏ పథకాలను అమలు చేయటం లేదని ఆరోపించారు.యువతకు ఉపాధి ఉద్యోగాల కోసం ఏఐవైఎఫ్ పోరాడుతుందని వారు తెలిపారు. ఉద్యోగ ఉపాదికల్పనకు సంబంధించి పాలకులు కార్యాచరణ ప్రకటించాలని డిమండ్ చేశారు.బయ్యారం ఉక్కు పరిశ్రమ సాధన కోసం పోరాడతామని, వలీ, దర్మేంద్ర తెలిపారు. ఈ మహాసభలలో సిపిఐ జాతియ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, కొండపర్తి గోవిందరావు, నానబాల రామకృష్ణ తదితరులు ప్రసంగించగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, షేక్ జానిమియా, ఎపూరి లతాదేవి, బిజి క్లెమెంట్ పలువురు జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లిఖార్జునరావు, కొల్లి రవి, అహ్వాన సంఘం అధ్యక్షులు కొల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి దూసరి గోపాలరావు, ఏఐఎస్ఎఫ నాయకులు రామకృష్ణ, లక్ష్మణ్, ఏఐవైఎఫ్ నాయకులు శ్రీనాథ్ రెడ్డి, శ్రావణ్‌శ్రావణ్, చింతల రమేష్, కొల్లి రవి తదితరులు పాల్గొన్నారు.



## బిజెపి కార్యకర్తలు దాడి

(మొదటి పేజీ తరువాయి)

'కాక్రోచ్ జనతా పార్టీ' బృందాన్ని, బిజెపి కార్యకర్తల అండతో గ్రామస్తులు అడ్డుకున్నారు. బారికేడ్లు ఏర్పాటు చేసి వారిని బలవంతంగా వెనక్కి నెట్టివేశారు. జైపూర్ జిల్లాలోని రాంపుర కన్వర్ పుర గ్రామానికి వెళ్లిన సిజెపి బృందానికి చేదు అనుభవం ఎదురైంది. తమ కార్యకర్తలపై దాడి జరిగిందని, రాళ్లు రువ్వారని ఆ పార్టీ ఆరోపించింది. రాష్ట్ర పోలీసులు జోక్యం చేసుకోవడంలో విఫలమయ్యారని పార్టీ సహకన్వీనర్ అశుతోష్ రంకా విమర్శించారు. తమ బృందంపై దాడి చేశారని, వాహనాలను ధ్వంసమయ్యాయని, మహిళా మద్దతుదారుల పట్ల దురుసుగా ప్రవర్తించారని రంకా ఆరోపించారు. ఈ నేపథ్యంలో రాజస్థాన్‌లో ఏం జరుగుతోందని సిజెపి వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. 'అశుతోష్, ఇతర సిజెపి వలంటీర్ల ప్రాణాలు తీయడానికి బిజెపి గూండాలు ప్రయత్నిస్తున్నారు. రాజస్థాన్ పోలీసులు ఇలాంటి దాడిని ఎలా సమర్థిస్తారని నిలదీశారు. అయితే బగ్రు డిఎస్‌పి ధర్మేంద్ర శర్మ మాత్రం తనకు అలాంటి ఘటన గురించి ఏమీ తెలియదని చెప్పారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోలలో, సిజెపి బృందం గ్రామంలోకి ప్రవేశించడానికి ప్రయత్నిస్తున్నప్పుడు పెద్ద సంఖ్యలో ప్రజలు వారితో వాగ్వాదానికి దిగడం, సభ్యులను నెట్టివేయడం కనిపించాయి. కొన్ని క్లిప్‌లలో కార్ల అద్దాలు పగిలిపోయి ఉండటం కూడా కనిపించింది. అవి సిజెపి బృందానికి చెందినవిగా భావిస్తున్నారు. గత కొన్నేళ్లుగా రాంపుర కన్వర్‌పురలోని పాఠశాల ఒక గేదెల కొట్టంలో నడుస్తోందని, తాము పరిశీలన కోసం అక్కడికి వెళ్లినప్పుడు తమపై బహిరంగంగా దాడి చేశారని రంకా విలేకరులతో చెప్పారు. తమపై రాళ్లు రువ్వారని, కార్ల అద్దాలు పగలగొట్టి తమ బృందంపై రాళ్ల వర్షం కురిపించారన్నారు. తమ దుస్తులు చింపేశారన్నారు. రాజస్థాన్ విద్యాశాఖ మంత్రి మదన్ దిలావర్ ఆదేశాల మేరకే సిజెపి బృందంపై దాడి జరిగిందని రంకా ఆరోపించారు. 'మిస్టర్ దిలావర్ – మీరు నేడు గూండాలను పంపి, దేశం దృష్టిలో మొత్తం రాజస్థాన్ రాష్ట్రానికి అవమానం తెచ్చారు. కానీ ఇలాంటి గూండాలకు భయపడే రకం మనుషులం మేము కాదు' అని హెచ్చరించారు. బిజెపి గూండాయిజాన్ని ప్రత్యక్షంగా చూసిందని, రాజస్థాన్ ప్రజాస్వామ్యానికి ఇది ఒక చీకటి రోజన్నారు. తాము మీకు 48 గంటల సమయం ఇస్తున్నాము, వీరందరినీ అరెస్టు చేయాలి, పాఠశాలల్లోకి బయటి వ్యక్తుల ప్రవేశాన్ని నిషేధించే ఉత్తర్వును ఉపసంహరించుకోవాలి, లేకపోతే, ఈ ఉద్యమం కేవలం విద్యకు మాత్రమే పరిమితం కాకుండా మదన్ దిలావర్‌ను లక్ష్యంగా చేసుకుంటుందని రంకా హెచ్చరించారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com